www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 70
మంగళవారం | 25-6-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: చవితి రా. 11.11 తదుపరి పంచమి; నక్షత్రం: శ్రవణం మ. 2.32 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: సా. 6.17 -7.47; దుర్ముహుర్తం: ఉ. 8.23-9.15, రా. 10.23 తదుపరి 11.06; అమృతఘడియలు: తె. 3.18-4.48; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.48
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




ప్రమాణం చేస్తున్న రామ్మోహన్ నాయుడు.. పంచె కట్టులో సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తున్న ఎంపీ కలిశెట్టి

తెలుగు భాషకు పట్టం

సంప్రదాయానికి పెద్దపీట.. మాతృభాషలో ప్రమాణం చేసిన 15 మంది రాష్ట్ర ఎంపీలు

సంప్రదాయ దుస్తుల్లో మరికొందరు.. సంస్కృతంలో కృష్ణ ప్రసాద్ ప్రమాణం

పార్టీపై అభిమానం చాటుకున్న కలిశెట్టి.. సైకిల్‌పై లోక్‌సభకు అప్పలనాయుడు

2



కొలువుదీరిన లోక్‌సభ

కొత్త పార్లమెంటు భవనంలో వేడుకగా కార్యక్రమం

తొలి రోజు 280 మంది సభ్యుల ప్రమాణం పూర్తి

విపక్షాల నిరసన సెగ.. నీట్‌పై నినాదాల హోరు

మోదీ ప్రమాణం వేళ రాజ్యాంగం చూపిన రాహుల్

హంగూ ఆర్భాటాలొద్దు

ప్రజల్లో కలిసిపోండి.. పాలకులం కాదు.. వారికి సేవకులం

మనపై చాలా అంచనాలున్నాయి.. శాఖలపై అధ్యయనం చేయండి

బూతుల భాష వాడినవారు ఏమయ్యారో చూశాం.. అధికారులతో సౌమ్యంగానే మాట్లాడండి.. కేబినెట్ తొలి భేటీలో చంద్రబాబు హితవు

పోలవరం నిర్మాణ పరిస్థితిపై ఆరా తీసిన పవన్

అన్న క్యాంటీన్లకు ట్రస్టు ఏర్పాటుచేద్దామన్న లోకేశ్

11

జులైలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు!

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు, పవన్, మంత్రులు, సీఎస్



హామీల అమలుకు శ్రీకారం

తొలి కేబినెట్‌లోనే కీలక నిర్ణయాలు.. ఆ 5 సంతకాలకు ఆమోదం

గంజాయి నియంత్రణకు ఐదుగురు మంత్రులతో కమిటీ

జూలై నుంచి పెంచిన పింఛన్

1న బకాయితో కలిపి చేతికి రూ.7 వేలు

సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటికే పంపిణీ

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు ఆమోదం

తొలి దశలో 183 అన్న క్యాంటీన్లు

రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్య గణనకు నిర్ణయం

ఇక ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీనే

7 అంశాలపై శ్వేత పత్రాల విడుదలకు ఓకే

అమరావతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ, సామాజిక పింఛను రూ.4వేలకు పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన... ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే పెట్టిన 'ఐదు తొలి సంతకాల' అమలుకు రంగం సిద్ధమైంది. కొత్త ప్రభుత్వ తొలి కేబినెట్ సమావేశంలోనే కీలక నిర్ణయాలపై ఆమోద ముద్ర పడింది. ఆంధ్రప్రదేశ్‌పై 'గంజాయి రాజధాని'గా పడిన ముద్ర తొలగించాలని ప్రభుత్వం సంకల్పించింది. గంజాయితోపాటు మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. దీనికోసం ఐదుగురు మంత్రులతో కమిటీని నియమించింది. పెంచిన వృద్ధాప్య పింఛన్లను జూలై 1 నుంచి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దే పంపిణీ చేయించాలని నిర్ణయం తీసుకుంది. పోలవరం, అమరావతి సహా ఏడు అంశాలపై ఏడు శ్వేతపత్రాలను విడుదల చేయాలని నిశ్చయించింది. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 'కూటమి' సర్కారు తొలి కేబినెట్ భేటీ జరిగింది. ఆ వివరాలను సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు

మిగతా 11వ పేజీలో...

1న మెగా డీఎస్సీ షెడ్యూల్!

16,347 పోస్టుల భర్తీకి సిద్ధం

అదే రోజు టెట్ పరీక్షకు కూడా

11

ఎన్నికల హామీని నిలబెట్టుకునే దిశగా వడివడిగా అడుగులు

కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ.. ఆమోదం

రెండు రోజుల్లో పాత టెట్ ఫలితాలు

జగన్ రక్షణకు 986 మంది!



సీఎం హోదాలో అసాధారణ భద్రత

దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేని వైనం

తన ప్రభుత్వంలో పట్టుబట్టి మరీ ఏర్పాట్లు

భూమి, నీరు, ఆకాశంలో పోరాడేలా శిక్షణ

ఎన్ఎస్‌జీ తరహాలో యూనిఫామ్

అత్యాధునిక ఆయుధాలు, భద్రత ఏర్పాట్లు

తాడేపల్లి ప్యాలెస్‌కు సుశిక్షితులతో రక్షణ

మాజీ అయినా ఇంకా అదే భద్రత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల పాలనలో సీఎం హోదాలో జగన్ తీసుకున్న కఠిన నిర్ణయాలు ఏవీ లేవు. మావోయిస్టులు, ఉగ్రవాదుల నుంచి ఆయనకు ముప్పు ఏదీ లేదు. అయినా సరే... జగన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల భద్రత కోసం 986 మంది పోలీసులను మోహరించారు. చంద్రబాబుకు 'ఎన్ఎస్‌జీ' భద్రత ఉండటంతో... ఆయనకు పోటీగా జగన్ ఎస్ఎస్‌జీ (స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్)ను ఏర్పాటు చేసుకున్నారు. సముద్ర జలాలు, ఆకాశం, భూమిపై పోరాడేలా శిక్షణ ఇప్పించారు. ఇజ్రాయెల్ ఆయుధాలు తెప్పించారు. జగన్ భద్రత కోసం

మిగతా 2వ పేజీలో...



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేశ్‌తో సినీ నిర్మాతలు

పవన్‌తో నిర్మాతల భేటీ

అభినందన సభ ఏర్పాటుకు అనుమతి కోరినట్టు వెల్లడి

సమస్యలపై మరోసారి కలిసి చర్చిస్తామని ఉద్ఘాటన

సినిమాలో..



2

గోపాలకృష్ణ ద్వివేది అవుట్

కార్మిక శాఖ నుంచి జీఏడీకి

ఎంఎం నాయక్‌కు అదనపు బాధ్యత

2019 ఎన్నికల్లో ద్వివేది వైసీపీకి అనుకూలంగా ఉన్నారన్న విమర్శలు

జగన్ హయాంలో కీలక పోస్టులు

సచివాలయాలకు, ప్రభుత్వ ఆఫీసులకు వైసీపీ రంగులు ఈయన నిర్వాకమే!

'సత్యం' చెప్పాల్సిందే!

ఆర్థిక శాఖ కార్యదర్శికే శ్వేతపత్రం తయారీ పని

జగన్ ప్రభుత్వంలో కీలకంగా కేవీవీ సత్యనారాయణ

అడ్డదారుల్లో అప్పులు.. కాగ్‌కు సైతం అబద్ధాలు

ఆర్థికంపై త్వరలో కొత్త ప్రభుత్వం శ్వేతపత్రం

దానిని తయారుచేయాల్సిన అధికారిగా అప్పటి తప్పులన్నీ ఒప్పుకోవాల్సిందే

దీంతో అడకత్తెరలో కేవీవీ సత్యనారాయణ

సర్కార్ మారగానే ఎస్కేప్‌కు యత్నం.. అడ్డుకుని అదే శాఖలో కొనసాగిస్తున్న ప్రభుత్వం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆనాటి జగన్ ప్రభుత్వం సాగించిన ఆర్థిక అరాచకాలకు ప్రత్యక్ష సాక్షి ఆయనే. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వాస్తవ ఆరోగ్య పరిస్థితి ఏమిటనేది తెలుసుకునే వీలే లేకుండా ఆర్థిక శాఖ కార్యదర్శిగా కేవీవీ సత్యనారాయణ తప్పుడు లెక్కలను నివేదించారు. అన్ని అక్రమ దారులూ తొక్కి తెచ్చిన అప్పులపై వాస్తవాలు చెప్పకుండా

మిగతా 2వ పేజీలో...

త్వరలో నామినేటెడ్

పోస్టులు

పార్టీ కోసం కష్టపడిన వారికే ప్రాధాన్యం: చంద్రబాబు

11

మనోళ్లను వేధించిన వైసీపీ నేతలకు నో ఎంట్రీ.. టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్

వైసీపీ భవనాలన్నీ అక్రమమే



12

18 నిర్మాణాలకు దరఖాస్తులే చేయలేదు

మరో 4 ఆఫీసులకూ అనుమతుల్లేవు.. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా కట్టడాలు

ఇప్పుడు చర్యలు ప్రారంభంతో గగ్గోలు.. నోటీసులు జారీ చేస్తున్న స్థానిక సంస్థలు

రుతుపవనాలు విస్తరించినా..

చల్లదనం కరువు

వర్షాలపై తప్పుతున్న అంచనాలు

2

కొనసాగుతున్న ఎండ తీవ్రత, ఉక్కపోత

ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు!

విద్యార్థుల జీవితాలతో కాలేజీల చెలగాటం

నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు తీసుకున్న వైనం

ఇప్పుడు మొత్తం ఫీజులు కడితేనే ఇస్తామని మెలిక

జగన్ సర్కారు పాపం.. విద్యార్థులకు శాపం!

గత ప్రభుత్వంలో 3 క్వార్టర్ల ఫీజు బకాయి వల్లే.. తల్లిదండ్రులకు బకాయి 2 వేల కోట్లకుపైనే

వైసీపీ సర్కారులో స్పందించని ఉన్నత విద్యా శాఖ.. కొత్త సర్కారు రాకతో కోటి ఆశలు

3

కార్మిక శాఖ నుంచి గోపాలకృష్ణ ద్వివేది అవుట్

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, అధికారి గోపాలకృష్ణ ద్వివేదిని ప్రభుత్వం బదిలీ చేసింది. గతవారం జరిగిన బదిలీల్లో.. కొంత మంది సీనియర్ ఐఏఎస్‌లకు కీలక పోస్టింగ్ ఇచ్చింది. అప్పుడు పోస్టింగ్ పొందిన వారిలో ద్వివేది కూడా ఉన్నారు. జగన్ సర్కారుతో అత్యంత సన్నిహితంగా మెలగిన ఆయన్ను జీఏడీకి పంపిస్తారని అందరూ భావించారు. కానీ ప్రభుత్వం ఆయన్ను కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అనంతరం ప్రభుత్వం పునరాలోచనలో పడింది. సోమవారం రాత్రి ఆయన్ను కార్మిక శాఖనుంచి రిలీవ్ చేయడంతో పాటు జీఏడీకి అటాచ్ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఎన్నికల సమయం నుంచి ఆయన వైసీపీకి సన్నిహితంగా ఉంటున్నారనే విమర్శలున్నాయి. ఆ ఎన్నికల్లో ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో)గా ఉన్న ఆయన వైసీపీ విజయానికి సహకరించారని టీడీపీ ఆరోపించింది. నాటి సీఎం చంద్రబాబు కూడా ద్వివేది కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ గద్దెనెక్కాక జగన్ ఆయనకు కీలకమైన పోస్టింగ్స్ ఇచ్చింది. గ్రామ సచివాలయాలకు, వాటర్ ట్యాంక్‌లకు వైసీపీ రంగులు వేయడం పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన నేతృత్వంలోనే జరిగింది. హైకోర్టు ఎన్నిసార్లు హెచ్చరించినా ఆయన మాత్రం రంగులను వదిలిపెట్టలేదు. ఇలా ప్రభుత్వం చెప్పిన పనులన్నీ చేస్తూ కీలకమైన పోస్టుల్లో కొనసాగారు. ప్రభుత్వం మారిన తర్వాత కార్మిక శాఖకు వెళ్లినా, ప్రభుత్వం అక్కడ నుంచి బదిలీ చేసింది. ఆయన స్థానంలో పశు సంవర్థక శాఖ సెక్రటరీగా ఉన్న ఎం.ఎం.నాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.

ప్రాణాలు తోడేస్తున్న తలసేమియా



» ఆపన్నహస్తం కోసం ఎదురు చూపులు

అమరావతి, జూన్ 24: ఆడిపాడే వయసులో ఆ చిన్నారి.. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. ఆరేళ్ల వయసులో వారానికోసారి రక్తం ఎక్కించుకుంటూ తలసేమియాతో పోరాడుతున్నాడు. ఈ బాధల నుంచి విముక్తి కోసం బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేయించుకుందామంటే ఆ నిరుపేద కుటుంబానికి స్థోమత లేదు. దీంతో ఆపన్న హస్తం అందించే దాతల కోసం ఎదురుచూస్తోంది. పల్నాడు జిల్లా అమరావతి మండలం మునగోడు గ్రామానికి చెందిన కస్తాల కోటేశ్వరరావు, రాధిక దంపతుల ఆరేళ్ల కుమారుడు రత్నబాబు చిన్నతనంలోనే తలసేమియా బారిన పడ్డాడు. తరచూ రక్తం ఎక్కిస్తూ ఉండాలి. లేదంటే ప్రాణానికే ప్రమాదం. అయితే నిరుపేద తల్లిదండ్రులైన కోటేశ్వరరావు, రాధిక.. తాము కష్టించి పనిచేయగా వచ్చిన డబ్బులతో కుమారుడికి వైద్యం చేయిస్తున్నారు. తమిళనాడులోని వేలూరులో ఉన్న సీఎంసీ వైద్యశాలలో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేస్తే రక్తం ఎక్కించే పని ఉండదని వైద్యులు తెలిపారు. దానికి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ ఖర్చవుతుంది. దీంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సాయం చేయాలనుకుంటే చైతన్య గోదావరి బ్యాంక్, అమరావతి, అకౌంట్ నంబర్ 709610100001699, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ANDB 0007999కు నగదు జమ చేయాలని కోరుతున్నారు.

లోకం తీరు



తెలుగు భాషకు పట్టం

పార్లమెంటులో మాతృభాషలో 15 మంది సభ్యుల ప్రమాణం

న్యూఢిల్లీ/విజయనగరం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో తెలుగు భాష పరిమళించింది. తెలుగు సంప్రదాయం ఉట్టిపడింది. ఏపీకి చెందిన పలువురు ఎంపీలు మాతృభాషలో ప్రమాణ స్వీకారం చేశారు. మరికొందరు సంప్రదాయ దుస్తుల్లో మెరిసి లోక్‌సభకు వన్నె తెచ్చారు. తాజాగా సోమవారం కొలువుదీరిన పార్లమెంటులో ప్రొటెం స్పీకర్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ప్రధాని, కేంద్రమంత్రులు ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వరుసక్రమాన్ని అనుసరించి అరుణాచల్ ప్రదేశ్ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి గైర్హాజరు అయ్యారు. టీడీపీ సభ్యులు 16 మంది, వైసీపీ సభ్యులు ముగ్గురు, బీజేపీ అభ్యర్థులు ముగ్గురు, జనసేన సభ్యులు ఇద్దరు ఎంపీలుగా ప్రమాణం చేశారు.

తెలుగుకు పట్టం కట్టింది వీరే.. కింజారపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, లక్ష్మీనారాయణ, కేశినేని శివనాథ్, టీకే పార్థసారథి, శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయులు, దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, మద్దిల గురుమూర్తి(వైసీపీ), భూపతిరాజు శ్రీనివాసవర్మ(బీజేపీ) దగ్గుబాటి పురందేశ్వరి(బీజేపీ), వల్లభనేని బాలశౌరి(జనసేన) తెలుగులో ప్రమాణం చేశారు.

ఇంగ్లీషులో.. గంటి హరీశ్ మాథుర్, మాగుంట శ్రీనివాసులరెడ్డి, పుట్టా మహేశ్ యాదవ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సీఎం రమేశ్, మిథున్‌రెడ్డి(వైసీపీ), ఉదయ్ శ్రీనివాస్(జనసేన) ఇంగ్లీషులో ప్రమాణం చేశారు.

ఒకరు హిందీ, మరొకరు సంస్కృతం: బాపట్ల టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సంస్కృతంలో ప్రమాణం చేశారు. వైసీపీ ఎంపీ తనూజా రాణి హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు.

కలిసికట్టుగా పార్లమెంటుకు

టీడీపీ ఎంపీలు ఢిల్లీలోని 50, అశోకారోడ్ నుంచి సోమవారం ఉదయం 10 గంటలకు కలిసికట్టుగా పార్లమెంటుకు వెళ్లారు. ఎంపీల కుటుంబసభ్యులు, అభిమానులు లోక్‌సభలో ప్రత్యేకంగా పాసులు తీసుకుని హాజరయ్యారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కూడా హాజరయ్యారు.

రూల్ బుక్‌లో సంతకాలు.. ఏపీ, తెలంగాణకు చెందిన ఐదుగురు కేంద్ర మంత్రులు లోక్‌సభ సమావేశాల తొలి రోజే ఎంపీలుగా ప్రమాణం చేశారు. కేంద్ర కేబినెట్ మంత్రులు కింజారపు రామ్మోహన్ నాయుడు, కిషన్‌రెడ్డి, సహాయ మంత్రులు బండి సంజయ్, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ రూల్‌బుక్‌లో సంతకాలు చేశారు. తెలంగాణకు చెందిన మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తెలుగులో ప్రమాణం చేశారు. కిషన్‌రెడ్డి పంచె కట్టులో ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు.

కలిశెట్టి కమనీయం!

విజయనగరం ఎంపీ, టీడీపీ నేత కలిశెట్టి అప్పలనాయుడు పార్టీపై అభిమానం చాటుకున్నారు. సోమవారం ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలకు ఆయన సైకిల్‌పై వెళ్లారు. అంతేకాదు, తెలుగుదనానికి పెద్దపీట వేస్తూ సంప్రదాయ వస్త్రధారణలో లోక్‌సభలో అడుగు పెట్టారు. పట్టుపంచె, లాల్చీ, మెడలో కండువా వేసుకుని ఢిల్లీలోని ఎంపీ క్వార్టర్స్ నుంచి టీడీపీ గుర్తు అయిన సైకిల్ తొక్కుకుంటూ పార్లమెంటుకు వచ్చారు. క్వార్టర్స్ నుంచి బయలుదేరే ముందు తన మాతృమూర్తికి పాదాభివందనం చేసిన ఎంపీ ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం.. పార్లమెంట్‌కు చేరుకుని ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కలిశెట్టి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పార్లమెంటులో అడుగు పెట్టడం చాలా ఆనందంగా ఉందని కలిశెట్టి ఈ సందర్భంగా అన్నారు.

కొలువుదీరిన లోక్‌సభ

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ కొత్త భవనంలో 18వ లోక్‌సభ కొలువుదీరింది. నూతన పార్లమెంట్ భవనంలో లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం జరగడం ఇదే తొలిసారి. తొలుత ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశాలు ప్రారంభయ్యాయి. ప్రధాని మోదీ లోక్‌సభ లోపలికి వచ్చేప్పుడు సభ్యులు నిలబడి కరతాల ధ్వనులతో ఆహ్వానించారు. మోదీ అందరికీ అభివాదం చేస్తూ లోనికి చేరుకున్నారు. తర్వాత లోక్‌సభ సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. తొలుత లోక్‌సభ ప్యానెల్ ఛైర్‌పర్సన్లుగా రాధామోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే ప్రమాణం చేశారు. ఉదయం 11.07కు మోదీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆ తర్వాత వరుసగా రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్, హెచ్‌డీ కుమారస్వామి, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, జితిన్ రామ్ మాంఝీతోపాటు మిగిలిన కేంద్ర మంత్రులు, తర్వాత సహాయ మంత్రులు ప్రమాణం చేశారు. తొలిరోజు 280 మంది సభ్యులు ప్రమాణం చేశారు. మిగతా సభ్యులు మంగళవారం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 మంది ఎంపీలు మొదటిరోజే ప్రమాణ స్వీకారం చేయగా, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మినహా.. మిగతా వారు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, ఆ పార్టీ కీలక నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరగనుంది. అదేవిధంగా.. కేరళలోని వయనాడ్ లోక్‌సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. దీంతో లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ బలం 99కి తగ్గింది.

తొలిరోజే నిరసన సెగ

విపక్ష కూటమి 'ఇండియా' నేతలు తొలిరోజే తమ ఐకమత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. లోక్‌సభలో తమకు కేటాయించిన చోట ముందు వరసలోనూ కూటమి పార్టీల నేతలు కూర్చున్నారు. తొలుత వారంతా పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. రాజ్యాంగ ప్రతులను చేతబట్టుకుని, లోక్‌సభకు కలిసి వెళ్లారు. ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం సమయంలో రాహుల్‌గాంధీ సహా.. ఇండియా కూటమి నేతలు రాజ్యాంగ ప్రతులను గాల్లోకి ఊపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణ స్వీకార సమయంలో.. "నీట్.. నెట్".. "నీట్ షేమ్" అంటూ నినాదాలు చేశారు. నీట్ అక్రమాలపై చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టారు. మరోవైపు.. సీనియర్ ఎంపీలున్నా.. బీజేపీ ఉద్దేశపూర్వకంగా ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మెహతాబ్‌ను నియమించడంపై ముందు నుంచి ఇండియా కూటమి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో.. ప్రొటెం స్పీకర్ ప్యానెల్‌లో నియమితులైన కాంగ్రెస్ సభ్యుడు కొడికున్నిల్ సురేశ్, డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు, తృణమూల్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్.. భర్తృహరి నియామకాన్ని నిరసిస్తూ వాకౌట్ చేశారు. ఆయన కంటే.. కాంగ్రెస్ ఎంపీ కె.సురేశ్ సీనియర్ అని వివరించారు. దళితుడైనందువల్లే సురేశ్‌కు అవకాశమివ్వలేదని ఆరోపించారు.

విభిన్న భాషలు.. సంప్రదాయ దుస్తులు

లోక్‌సభ సభ్యులు ఇంగ్లిష్‌తోపాటు.. సంస్కృతం, హిందీ, డోగ్రీ, తెలుగు, బెంగాలీ, అస్సామీ, ఒడియా భాషల్లో ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, అన్నపూర్ణా దేవి, జ్యోతిరాదిత్య సింధియా హిందీలో.. రామ్మోహన్ నాయుడు, కిషన్‌రెడ్డి తెలుగులో, సురేశ్‌గోపీ మలయాళంలో, మురళీధర్ మహోల్ మరాఠీలో.. హెచ్‌డీ కుమారస్వామి కన్నడలో.. ఇలా వేర్వేరు భాషల్లో ప్రమాణం చేశారు.

రేపు లోక్‌సభ స్పీకర్ ఎన్నిక

లోక్‌సభ స్పీకర్ ఎన్నిక బుధవారం జరగనుంది. ఈనెల 27న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు ప్రధాని మోదీ జూలై 2న లోక్‌సభలో, 3న రాజ్యసభలో సమాధానమిస్తారు.

ఎమర్జెన్సీ ఓ మచ్చ: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): "ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీని విధించి మంగళవారంతో 50 ఏళ్లు పూర్తవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎమర్జెన్సీ ఓ మచ్చ. అప్పట్లో ఎంతోమందిని అన్యాయంగా జైళ్లలో వేశారు. అలాంటి చీకటి రోజులను మళ్లీ చూడకూడదనేది మా ప్రయత్నం" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 18వ లోక్‌సభ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఉదయం పార్లమెంట్‌కు చేరుకున్న మోదీకి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోదీ మీడియాతో మాట్లాడారు. ప్రధాని 50 ఏళ్ల కిందటి ఎమర్జెన్సీ గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారని, కానీ, గత పదేళ్లలో అప్రకటిత ఎమర్జెన్సీ గురించి ఆయన మర్చిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు.

రాజ్యసభ సభా నాయకుడిగా నడ్డా

బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జగత్‌ప్రకాశ్ నడ్డా రాజ్యసభలో సభానాయకుడిగా నియమితులయ్యారు. ఇప్పటివరకు కొనసాగిన కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్థానంలో ఆయన్ను నియమించారు. 2020లో అమిత్‌షా నుంచి పార్టీ పగ్గాలు స్వీకరించిన నడ్డాను.. ప్రధాని మోదీ తన కేబినెట్‌లోకి తీసుకోవడంతో బీజేపీ అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేస్తారని అంతా భావించారు. అయితే ఇప్పుడప్పుడే ఆయన వైదొలిగే అవకాశాలు కనిపించడం లేదు. పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నిక జరగాలంటే.. కనీసం సగం రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తికావలసి ఉంటుంది. సంస్థాగత ఎన్నికలు పూర్తికావడానికి ఎంతలేదన్నా ఆరు నెలలు పట్టే అవకాశం ఉంది. అప్పటిదాకా నడ్డానే కొనసాగిస్తారని తెలుస్తోంది.

రుతుపవనాలు విస్తరించినా..
చల్లదనం కరువు

» వర్షాలపై తప్పుతున్న అంచనాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు రాష్ట్రం మొత్తం విస్తరించినా వాతావరణం చల్లబడటం లేదు. ఎండ తీవ్రత కొనసాగుతోంది. అక్కడక్కడ వాతావరణ అనిశ్చితి నెలకొని వర్షాలు కురుస్తున్నాయి. అవి కూడా కొద్ది ప్రాంతాలకే పరిమితమవుతున్నాయి. రుతుపవనాల కాలంలో ఇదేం వాతావరణమని నిపుణులే ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వానలను రుతుపవన ముందస్తు వర్షాలు(మార్చి నుంచి మే వరకు కురిసే ప్రీమాన్‌సూన్ రెయిన్స్)గా మాత్రమే పరిగణించాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇవి నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్నవి కావని చెబుతున్నారు. వాతావరణంలో మార్పుల ప్రభావం నైరుతి సీజన్‌పై కూడా పడిందంటున్నారు. ఇదిలావుండగా సోమవారం నుంచి కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని ఆదివారం బులెటిన్‌లో వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు వాతావరణ శాఖ సోమవారం విడుదల చేసిన బులెటిన్‌లో మంగళవారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు, ఉత్తర కోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇంకా 26, 27 తేదీల్లో కోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు, ఉత్తరకోస్తాలో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. అయితే ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సోమవారం విడుదల చేసిన బులెటిన్‌లో మాత్రం మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది తప్ప, ఉత్తర కోస్తాలో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొనలేదు.

'సత్యం' చెప్పాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వాన్ని, కాగ్‌ను సైతం ఏమార్చారు. అయితే, కొత్తగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం జగన్ చేతుల్లో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదలకు సిద్ధమైంది. దానిని తయారుచేయాల్సిన బాధ్యతను సత్యనారాయణకే అప్పగించింది. దీంతో.. ఆయన ఇప్పుడు 'సత్యం' చెప్పక తప్పని పరిస్థితి ఏర్పడింది. నిజానికి, ప్రభుత్వం మారగానే డిప్యుటేషన్ రద్దుచేసుకుని మాతృసంస్థ రైల్వేస్‌కు వెళ్లే ప్రయత్నం చేయగా, అడ్డుకుని కేవీవీని అదే శాఖలో కొనసాగిస్తోంది. దీంతో గత ఐదేళ్లలో ఆర్థిక శాఖలో జరిగిన తప్పులను ఇప్పుడు ఆయన ఒప్పుకోవాల్సిన పరిస్థితి! అప్పట్లోలా మాయా నివేదికలు ఇస్తానంటే కుదరదు. ఈ విషయం అందరి కంటే ఎక్కువగా సత్యనారాయణకే తెలుసునని ఆర్థిక శాఖ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఆయన రైల్వే శాఖ నుంచి 2017లో రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. అప్పటి నుంచి ఆర్థిక శాఖలోనే కొనసాగుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కేవీవీ సత్యనారాయణ ఆర్థికశాఖను జగన్ ఆడుకునే ఆటబొమ్మలా మార్చివేశారనే ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేషన్ల ద్వారా అప్పులు తేవడంలో రాజ్యాంగ చట్టాలను కూడా తుంగలో తొక్కేలా అప్పట్లో జగన్ రాజ్ సాగింది. కార్పొరేషన్ల అప్పులు చెప్పాలంటూ ఐదేళ్లపాటు కాగ్ ప్రతి నెలా రాష్ట్ర ఆర్థిక శాఖ అడుగుతూనే ఉంది. కానీ, ఒక్క నెలలో కూడా ఆర్థిక శాఖ ఆ వివరాలు కాగ్‌కి వెల్లడించలేదు. కార్పొరేషన్ల అప్పులు చెప్పాలంటూ ఎన్నో ఆర్టీఐ దరఖాస్తులొచ్చినా ఏ ఒక్కరికి కూడా సమాధానం రాలేదు. గతంలో ఢిల్లీ నుంచి కాగ్ అధికారుల బృందం కార్పొరేషన్ల అప్పులు తేల్చేందుకు రాష్ట్రానికి వచ్చింది. ఆ బృందానికి సత్యనారాయణ తప్పుడు సమాచారం ఇచ్చారు. ఆ సమయానికి కార్పొరేషన్ల అప్పులు రెండున్నర లక్షల కోట్లు కాగా, కేవలం రూ.40,000 కోట్లేనంటూ నివేదిక ఇచ్చారు. ఇలాగే చెప్పాలంటూ ఆర్థిక శాఖ ఉద్యోగులకు కూడా ఆదేశాలిచ్చారు.

కన్ను పడిన ఆస్తులు తాకట్టుకే...

రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌కి మళ్లించి, రాజ్యాంగాన్ని ఉల్లంఘించారు. ఏపీస్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ అనే సంస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ శాఖల్లో ఉన్న డబ్బులన్నింటినీ డిపాజిట్ల పేరుతో ఊడ్చేశారు. వైజాగ్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీలు, పార్కులు, ఖాళీస్థలాలు, వైజాగ్ కలెక్టరేట్ , పోర్టుల భూములు, ఆఖరికి సచివాలయం కూడా తాకట్టు పెట్టారు. పోలీసు శాఖలో సీసీకెమెరాలు కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఇలా ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ ఖజానాను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చే దివాలాకోరు స్థితికి రాష్ట్రాన్ని దిగజార్చడంలో సత్యనారాయణ పాత్రే కీలకం. ఈ ఉల్లంఘనలన్నీ బయటకు వస్తే ఆర్థిక శాఖ నుంచి మొదట వినిపించే పేరు సత్యనారాయణదే. అలాగే, ఆర్థిక శాఖలో అత్యంత కీలకమైన బిల్లుల చెల్లింపులో ఉన్న ఫిఫో వ్యవస్థను సత్యనారాయణ కుప్పకూల్చారు. మొదటవచ్చిన బిల్లును మొదట చెల్లించాలన్న నిబంధనను ప్రతి రోజూ ఉల్లంఘించారు. బిల్లుల కోసం వచ్చిన బాధితులను కనీసం కలవడానికి కూడా ఆయన ఇష్టపడేవారు కాదు. బిల్లు బాధితులు తన పేషీ వైపు రాకుండా పోలీసు కాపలా పెట్టుకున్నారు. ప్రభుత్వానికి పనులు చేసిపెట్టిన కాంట్రాక్టర్లు, వెండర్లు, సప్లయర్లకు కనీసం సమాధానం చెప్పాల్సిన జవాబుదారీతనాన్ని ఏనాడూ ఆయన పాటించలేదు. పెండింగ్ బిల్లుల అవకతవకలపై హైకోర్టులో 4 లక్షలకు పైగా పిటిషన్లు పడ్డాయి. పైగా ప్రతి ఆర్థిక సంవత్సరం చివరి రోజైన మార్చి 31వ తేదీన రూ.వేలకోట్ల బిల్లులను జగన్ డైరెక్షన్‌లో ఏ కారణం లేకుండా రద్దు చేశారని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇలా రద్దు చేసిన బిల్లులే రూ.2 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఇవన్నీ ఉల్లంఘనలే. ఇప్పుడు ఈ ఉల్లంఘనలకు సత్యనారాయణే జవాబు ఇవ్వాల్సిన పరిస్థితిని కొత్త ప్రభుత్వం కల్పించడం విశేషం.

జగన్ రక్షణకు 986 మంది!

(మొదటి పేజీ తరవాయి)

ప్రాణాలకు తెగించి పోరాడేలా 379 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎన్ఎస్‌జీ తరహాలో యూనిఫామ్ (డార్క్ బ్లూ, బ్లాక్) ఏర్పాటు చేశారు. ఈ నిర్ణయం అప్పట్లో పోలీసు శాఖలో నవ్వులపాలైంది. శత్రుదేశాలు, ఉగ్రవాదులతో ముప్పు ఉండే ప్రధాన మంత్రికి స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) రక్షణ కల్పిస్తుంది. మావోయిస్టులు, సంఘ విద్రోహశక్తుల జాబితాలో ఉండే యోగి ఆదిత్యనాథ్ లాంటి ముఖ్యమంత్రులు, రాజ్‌నాథ్, అమిత్ షా లాంటి కేంద్ర మంత్రులు, ఇతర వీవీఐపీలకు ఎన్ఎస్‌జీ, సీఆర్‌పీఎఫ్ భద్రత కల్పిస్తున్నాయి. దేశంలో అతికొద్ది మంది రాజకీయ ప్రముఖులకే సాయుధ కమెండోలైన ఎన్ఎస్‌జీతో కేంద్ర హోంశాఖ రక్షణ కల్పిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబుపై అలిపిరి (తిరుపతి) వద్ద నక్సలైట్లు దాడి చేశారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఎన్ఎస్‌జీ కమెండోలతో సెక్యూరిటీ కల్పించింది. అయితే వారి భద్రతకు మించి జగన్ అసాధారణ భద్రత ఏర్పాటు చేసుకున్నారు. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర పోలీసులు ఆయన సెక్యూరిటీపై సమీక్షించి 300 మంది ఏపీఎస్పీ, గ్రేహౌండ్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులతో జడ్ ప్లస్ రక్షణ ఏర్పాట్లు చేశారు. అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై రాష్ట్రంలో పలుచోట్ల వైసీపీ శ్రేణులు దాడులు చేశారు. దీంతో ఎన్ఎస్‌జీ ఆయన భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. తనకూ అటువంటి సెక్యూరిటీ గార్డులు కావాలని జగన్ పోలీసు ఉన్నతాధికారులకు చెప్పారు. దీంతో కేంద్రానికి రాష్ట్ర హోంశాఖ లేఖ రాసినా అటువైపు నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. తాను ముఖ్యమంత్రిగా ఉంటే తనకన్నా చంద్రబాబు సెక్యూరిటీ ఎక్కువగా కనిపించడానికి వీల్లేదని జగన్ చెప్పడంతో మరో మార్గంలేక రాష్ట్ర పోలీసులు ఎన్ఎస్‌జీ తరహాలో ఎస్ఎస్‌జీ ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌జీ తరహాలో యూనిఫామ్ సిద్ధం చేసి, కమాండ్ హబ్, జాగిలాల శిక్షణా కేంద్రం, మొబైల్ ఫోర్స్, ఎస్‌కే9 లాంటివన్నీ ఏపీ ఇంటెలిజెన్స్ విభాగం అందుబాటులోకి తీసుకొచ్చింది.



రిట్రాక్టబుల్ గేట్స్

ముడుచుకునే బలమైన ఈ గేట్లను స్థలం తక్కువగా ఉన్న చోట్ల అమరుస్తారు. భూమిలో ముడుచుకునే కంచెల్లా కూడా వాడతారు.



బొల్లార్డ్స్

నిషేధిత ప్రాంతాల్లోకి వచ్చే వాహనాలు, పాదచారులను అడ్డుకోవడానికి ఏర్పాటు చేసే దృఢమైన నిలువు పోస్టులు.

ప్యాలెస్‌లతో పాటు దేశ, విదేశాల్లోనూ...

తాడేపల్లితో పాటు హైదరాబాద్, బెంగళూరులో కళ్లు చెదిరే ప్యాలెస్‌లు నిర్మించుకున్న జగన్ దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేనంత సెక్యూరిటీ నియమించుకున్నారు. తనతో పాటు తన ప్యాలెస్‌లకు, తన కుటుంబ సభ్యులకు, విదేశాల్లోని కుమార్తెలకు సైతం భద్రత ఏర్పాటు చేసుకున్నారు. మొత్తం 986 మందితో రక్షణ ఏర్పాటు చేసుకున్నారు. తాడేపల్లి ప్యాలెస్ వద్ద అత్యధికంగా 379 మందిని షిఫ్టుల వారీగా విధుల్లో నియమించుకున్నారు. జగన్ జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు భారీగా భద్రతా సిబ్బంది వెంట ఉండేవారు. ఇతర విభాగాల నుంచి 439 మంది, అలైడ్ డ్యూటీల కోసం 116 మంది సిబ్బంది ఉన్నారు. పులివెందులలోని నివాసం, ఇడుపులపాయలోని ప్యాలెస్, హైదరాబాద్ లోటస్ పాండ్ భవంతికి 52 మంది పోలీసులను కాపలాగా పెట్టారు. తాడేపల్లి ప్యాలెస్‌కు అసాధారణ రీతిలో 48 చోట్ల చెక్‌పోస్టులు, బ్యారికేడ్లు, అవుట్ పోస్టులు, పోలీసు పికెట్లు, బూమ్ బారియర్లు, టైర్ కిల్లర్స్ బొల్లార్డ్స్, రిట్రాక్టబుల్ గేట్లతో పాటు 30 అడుగుల ఎత్తున పటిష్ఠ ఇనుప గోడ నిర్మించుకున్నారు. కౌంటింగ్‌కు ముందు కుటుంబంతో కలిసి ఆయన విదేశాలకు వెళ్లినప్పుడు కేవలం సెక్యూరిటీ ఖర్చుగా ప్రభుత్వ ఖజానా నుంచి కోటిన్నర విడుదల చేశారు.

మాజీ సీఎం అయినా భద్రత తగ్గదా?

ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఆర్నెల్ల క్రితం ఏర్పాటు చేసుకున్న భద్రత చూసి కింది స్థాయి పోలీసులే నవ్వుకున్నారు. 'గతంలో చంద్రబాబు హయాంలో శేషాచలం కొండల్లో ఎర్ర చందనం స్మగ్లర్లను.. విశాఖ మన్యంలో మావోయిస్టులను పదుల సంఖ్యలో ఎన్‌కౌంటర్ చేశారు. అయినా ఆయనకు 108 మందితోనే సెక్యూరిటీ ఉండేది. జగన్ హయాంలో కనీసం ఒక రౌడీషీటర్‌పై కూడా చర్యలు తీసుకున్నది లేదు. కానీ అసాధారణ భద్రత ఏర్పాటు చేసుకున్నారు. అది కేవలం ఇగో కోసమే' అనే వ్యాఖ్యలు పోలీసు వర్గాల్లో వినిపించాయి.

జగన్ సేవలో...

ప్రాక్సిమిటీ సెక్యూరిటీ

అనధికార వ్యక్తులు, వాహనాలు సమీప ప్రాంతానికి రాకుండా అడ్డుకునే సుశిక్షితులైన సాయుధ సిబ్బంది ఇందులో ఉంటారు. దాడులు, ఉల్లంఘనలు, అతిక్రమణలను అడ్డుకుంటారు. ప్రపంచ, జాతీయ స్థాయిలో పేరున్న వీవీఐపీలకు మాత్రమే ఇటువంటి భద్రత ఉంటుంది. యాక్సెస్ నియంత్రణ వ్యవస్థలు, ఫెన్సింగ్‌తో కూడిన గేట్లు, బొల్లార్డ్స్‌తో కెమెరాలు, అలారం వ్యవస్థలు, మోషన్ డిటెక్టర్లు, పీఐడీఎస్, సురక్షిత తలుపులు, పటిష్ఠమైన ప్రవేశ ద్వారాలు, గార్డ్ పెట్రోలింగ్ వంటివి ఉంటాయి. ఒక ప్రాంతాన్ని పూర్తిగా గుప్పిట్లో పెట్టుకుని శత్రుదుర్భేద్యంగా మార్చే వ్యవస్థ ఇది.

బూమ్ బారియర్స్

టోల్ గేట్ల వద్ద వాహనాలను ఆటోమేటిక్‌గా ఆపి స్కాన్ అవగానే పైకి లేచే గేట్లనే బూమ్ బారియర్లు అంటారు. బటన్ సిస్టమ్‌తో పాటు రిమోట్ కంట్రోల్ పద్ధతిలో పనిచేస్తాయి. అటువంటి వాటినే జగన్ ప్యా లెస్‌కు వెళ్లే మార్గాల్లో పోలీసులు ఏర్పాటు చేశారు.

టైర్ కిల్లర్స్

సైనిక స్థావరాలు, రాయబార కార్యాలయాలు, పార్లమెంటు లాంటి చోట్ల వీటిని వాడతారు. అనధికార వాహనాలు అనుమతి లేకుండా లోపలికి చొచ్చుకొస్తే నిరోధించే క్రమంలో టైర్ కిల్లర్స్‌ను ఏర్పాటు చేస్తారు. జగన్ ప్యాలెస్‌కు వెళ్లే దారిలో ఇవి అమర్చారు.

ఏఐతో పరీక్షల్లో మోసాలకు చెక్!

» యూపీఎస్సీ చర్యలు

న్యూఢిల్లీ, జూన్ 24: నీట్, నెట్ నిర్వహణలో జరిగిన అవకతవకలు దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) అప్రమత్తమైంది. తాము నిర్వహించే వివిధ పరీక్షల్లో మోసాలను నిరోధించడానికి.. ఫేసియల్ రికగ్నిషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సీసీటీవీ నిఘా వ్యవస్థను ఉపయోగించాలని నిర్ణయించింది. ఆధార్ ఫింగర్‌ప్రింట్ అథెంటికేషన్, అభ్యర్థుల ముఖగుర్తింపు, ఈ-అడ్మిట్ కార్డుల క్యూఆర్ కోడ్ స్కానింగ్, ఏఐ ఆధారిత సీసీటీవీలతో నిఘా.. వంటి సాంకేతిక పరిష్కారాలను అందించేందుకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీసెస్ సహా.. 14 పరీక్షలను యూపీఎస్సీ నిర్వహిస్తుంది. అంతేకాకుండా గ్రూప్-ఏ, గ్రూప్-బి పోస్టులకు సంబంధించి ప్రతి సంవత్సరం అనేక నియామక పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో పరీక్షలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని యూపీఎస్సీ భావిస్తోంది. ఈ టెండర్ల బిడ్ దాఖలుకు చివరి తేదీని జూలై 7గా నిర్ణయించారు.

నీట్ దర్యాప్తులో సీబీఐ జోరు

మూడు రాష్ట్రాల్లో నమోదైన ఐదు కేసుల స్వీకరణ.. పట్నా, గోధ్రాల్లో వివరాలు సేకరిస్తున్న ప్రత్యేక బృందాలు

పట్నా, గోధ్రా, న్యూఢిల్లీ, జూన్ 24: నీట్ అక్రమాలపై దర్యాప్తు బాధ్యతలను స్వీకరించిన సీబీఐ జోరు పెంచింది. బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో నీట్ అవకతవకలకు సంబంధించి నమోదైన ఒక్కో కేసును రీ-రిజిస్టర్ చేసింది. రాజస్థాన్‌లో 3 కేసుల దర్యాప్తును స్వీకరించింది. మహారాష్ట్రలోని లాతూరులో యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్) నమోదు చేసిన మరో కేసు ను కూడా సీబీఐ స్వాధీనం చేసుకునే అవకాశం ఉం ది. కాగా.. నీట్ అక్రమాలపై బిహార్, గుజరాత్‌లో నమోదైన కేసుల దర్యాప్తునకు ఆదివారానికే పట్నా, గోధ్రాకు చేరుకున్న సీబీఐ ప్రత్యేక బృందాలు దర్యాప్తు ను ముమ్మరం చేశాయి. పట్నాకు చేరుకున్న సీబీఐ బృందం.. కొద్దిరోజులుగా అక్కడ పేపర్ లీక్ కేసును అత్యంత సమర్థంగా దర్యాప్తు చేస్తున్న ఆర్థిక నేరాల విభాగం(ఈవోయు) కార్యాలయానికి సోమవారం ఉదయం వెళ్లి కీలక వివరాలు సేకరించింది. ఇప్పటికే 18 మందిని అరెస్టు చేసిన ఈవోయు.. వారి మొబైల్ ఫోన్లను, సిమ్‌కార్డులను, ల్యాప్‌టాప్‌లను, పోస్ట్‌డేటెడ్ చెక్కులను, కాల్చేసిన నీట్ ప్రశ్నపత్రం అవశేషాలను స్వాధీనం చేసుకుంది. నీట్ అక్రమాలపై దర్యాప్తు బాధ్యతను సీబీఐకి బదిలీ చేస్తూ బిహార్ సర్కారు ఆదివారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో.. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులందరినీ విచారణ నిమిత్తం సీబీఐ బృందం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తీసుకెళ్లే అవకాశం ఉందని ఈవోయు అధికారి తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడైన దానాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ జూనియర్ ఇంజనీర్ సికందర్ ప్రసాద్ యాదవేందుపై ఆదాయానికి మించి ఆస్తుల కేసు కూడా సీబీఐ నమో దు చేసే అవకాశం ఉందన్నారు. యాదవేందును ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించినట్టు ఆ అధికారి వెల్లడించారు.

గోధ్రాలోనూ.. గోధ్రాకు చేరుకున్న సీబీఐ బృందం స్థానిక పోలీసు అధికారులను కలిసి, నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి వివరాలు సేకరించినట్టు పంచమహల్ జిల్లా ఎస్పీ హిమాన్షు సోలంకి తెలిపారు. ఈ కేసులో గుజరాత్ పోలీసులు ఇప్పటిదాకా ఐదుగురిని అరెస్ట్ చేశారు. అక్కడి ఒక కేంద్రంలో పరీక్ష రాసే 27 మంది అభ్యర్థులతో వారు ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం.. వారు ప్రశ్నపత్రంలో తమకు తెలిసిన సమాధానాలు రాసి మిగతావాటిని వదిలిపెడితే, వాటికి వీరు సమాధానాలు రాస్తారు. ఇందుకోసం ఒక్కొక్క అభ్యర్థి నుం చి రూ.10 లక్షలు తీసుకున్నారు. మహారాష్ట్రలోనూ నీట్ అక్రమాలకు పాల్పడ్డ ఆరోపణలపై నాందేడ్ ఏటీఎస్ అధికారులు లాతూర్‌కు చెందిన జలీల్ ఖాన్ ఉమర్ ఖాన్ పఠాన్ అనే జిల్లా పరిషత్ స్కూల్ టీచర్‌ను అరెస్ట్ చేశారు.

పార్లమెంటులో విపక్షాల నిరసన

నీట్ అక్రమాల నేపథ్యంలో.. లోక్‌సభలో కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారం సందర్భంగా మోదీ 3.0 సర్కారుకు తొలిరోజే నిరసన సెగ తగిలింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రమాణ స్వీకారానికి పిలవగానే.. 'నీట్ షేమ్', 'నీట్ షేమ్', 'నీట్ షేమ్' అంటూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు.

తహసీల్దార్ కాళ్లు మొక్కిన రైతు

▸▸ 'మా పొలం మాకు ఇప్పించండ'ంటూ వేడుకోలు

నందికొట్కూరు రూరల్, జూన్ 24: 'అయ్యా మా పొలం మాకు ఇప్పించండంటూ' సోమవారం ఓ రైతు తహసీల్దార్ దామోదర్‌రెడ్డి కాళ్లమీద పడ్డారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దామగట్లకు చెందిన రైతు మధుసూదన యాదవ్ సోమవారం తన కుంటుంబ సభ్యులతో కలిసి నిరసనకు దిగారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహిస్తుండగా కుటుంబ సభ్యులతో వచ్చి తమ పొలాన్ని బంధువులు ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని, అది తొలగించి న్యాయం చేయాలని వినతి పత్రం అది తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమి అని, తమ పేర్లపై మ్యాన్యువల్ రికార్డులు ఉన్నా స్థానిక వీఆర్వో అక్రమంగా తమ బంధువులకు ఆన్‌లైన్ చేశాడని ఆరోపించారు. ఈ విషయంపై నాలుగేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని వాపోయారు. ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయాలంటూ తహసీలార్ కాళ్లపై పడ్డారు. ఈపరిణామంతో కంగుతిన్న తహసీల్దార్ ఆయనను పైకి లేపారు.



తహసీల్దార్ దామోదర్‌రెడ్డికి కాళ్లు మొక్కుతున్న రైతు మధుసూదన యాదవ్

మీరైనా నా గోడు ఆలకించండి 'బాబూ'!



ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' పేరును కొత్త ప్రభుత్వం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'గా మార్చింది. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోతో ఫ్లెక్సీలు ముద్రించి కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఓ వృద్ధురాలు అక్కడ చంద్రబాబు ఫొటోతో ఉన్న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' ఫ్లెక్సీకి నమస్కరిస్తూ కనిపించారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి గమనించి ఆరా తీయగా...తన పేరు అప్పలనరసమ్మ అని, హోంగార్డుగా పనిచేసి రిటైరయ్యానని తెలిపారు. తన కుమారుడికి హోంగార్డు ఉద్యోగం ఇస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారని, కానీ ఐదేళ్ల నుంచి పోలీస్ అధికారులు, తరువాత కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో వినతపత్రాలు ఇచ్చిన తన మొర ఎవరూ ఆలకించ లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో తనలో ఆశలు చిగురించాయన్నారు. నగరానికి సీఎం వచ్చినప్పుడు గోడు చెప్పుకొంటానని పేర్కొన్నారు. -విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

● జగన్ సర్కారు పాపం.. విద్యార్థులకు శాపం!

ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు!

గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఇంజనీరింగ్ కాలేజీల తీరుతో ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. గత ప్రభుత్వంపై నమ్మకం లేక చాలా కాలేజీలు అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల ఇంటర్మీడియట్, పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకున్నాయి. వాటిని తిరిగి ఇవ్వకుండా ఫీజులు మొత్తం కట్టాలని ఇప్పుడు మెలిక పెట్టాయి. ప్రభుత్వం తమ ఖాతాల్లో ఫీజులు వేయలేదని చెప్పినా, ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయి. దీంతో ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యే దశలో సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు కోల్పోయే దుస్థితి వచ్చింది.

▸▸ విద్యార్థుల జీవితాలతో కాలేజీల చెలగాటం

▸▸ నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్, టెన్త్ సర్టిఫికెట్లు తీసుకున్న వైనం

▸▸ ఇప్పుడు మొత్తం ఫీజులు కడితేనే ఇస్తామని మెలిక

▸▸ గత ప్రభుత్వంలో మూడు క్వార్టర్ల ఫీజు బకాయి వల్లే తల్లిదండ్రులకు రావాల్సిన ఫీజులు రూ.2వేల కోట్లకుపైనే

▸▸ కాలేజీల తీరుతో ఉద్యోగాలు కోల్పోతున్న విద్యార్థులు

▸▸ వైసీపీ సర్కారులో స్పందించని ఉన్నత విద్యాశాఖ, కమిషన్లు

▸▸ కొత్త సర్కారు రాకతో కోటి ఆశలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓవైపు సాఫ్ట్‌వేర్ రంగం గత రెండేళ్లుగా కొంత మందగించింది. కొత్త ఉద్యోగాల కల్పన కష్టంగా మారింది. ఫలితంగా క్యాంపస్ ఇంటర్వ్యూలు తగ్గిపోయాయి. ఈ తరుణంలో విద్యార్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించుకుంటుంటే వాటికి కాలేజీల యాజమాన్యాలు అడ్డుపడుతున్నాయి!. విద్యార్థుల జీవితాల కంటే తమ ఫీజులే ముఖ్యమనే తరహాలో వ్యవహరిస్తున్నాయి. గత ప్రభుత్వం ఫీజులు చెల్లించక, కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వక తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యా కమిషన్లు మౌనం దాల్చాయి. ఇప్పుడు కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ సమస్య ఇంకా నూతన ప్రభుత్వం దృష్టికి వెళ్లలేదు. ఫీజుల బకాయిల వివరాలు ఇవ్వాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ మొదటి సమీక్షలో అధికారులను ఆదేశించారు. అయితే కాలేజీలు సర్టిఫికెట్లు తీసుకున్న విషయాన్ని అధికారులు మంత్రికి వివరించలేదు.

● నిబంధనలు ఏం చెబుతున్నాయి?

నిబంధనల ప్రకారం ఇంజనీరింగ్ అడ్మిషన్ల సమయంలో టెన్త్, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలన మాత్రమే చేయాలి. జిరాక్సులు మాత్రమే తీసుకోవాలి. కానీ గత ప్రభుత్వం ఫీజులు విషయంలో మార్చిన విధానం వల్ల నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్లే తీసుకున్నారు. అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద వేసే ఫీజులను ప్రభుత్వం నేరుగా కాలేజీల ఖాతాల్లో వేసేది. దీంతో ఫీజుల అంశం ప్రభుత్వం, కాలేజీల మధ్య ఉండేది. కానీ గత వైసీపీ ప్రభుత్వం పారదర్శకత పేరుతో ఫీజులను తల్లిదండ్రుల ఖాతాల్లో వేసే విధానం తెచ్చింది. అయితే ఏ విద్యా సంవత్సరంలోనూ సక్రమంగా ఫీజులు విడుదల చేయలేదు. ఏటా మూడు క్వార్టర్ల ఫీజులు పెండింగ్ పెడుతూ వస్తోంది. దీంతో నాలుగేళ్ల బీటెక్ కోర్సు చదివిన విద్యార్థులకు చివరి సంవత్సరంలో ఇబ్బందులు ప్రారంభమవుతున్నాయి. చివర్లో మొత్తం ఫీజులు కడితేనే ఫీజులు చెల్లిస్తామని కాలేజీలు మెలిక పెట్టి, మొత్తం ఫీజులు వసూలు చేసుకుంటున్నాయి. సర్టిఫికెట్లు కీలకం కావడంతో తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారు. ఆ స్తోమత లేనివారు వారి పిల్లలను ఇంటర్వ్యూలకు కూడా పంపలేకపోతున్నారు. ఇప్పుడు వేలాది మంది విద్యార్థులు ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

● రూ.2వేల కోట్ల బకాయిలు

రాష్ట్రంలో 9.44లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిధిలోకి వస్తున్నారు. ఒక క్వార్టర్‌కు రూ.708కోట్లు విద్యార్థులకు ఫీజులు చెల్లించాలి. 2023-24 విద్యా సంవత్సరంలో కేవలం ఒక్క క్వార్టర్ ఫీజులే జగన్ సర్కారు విడుదల చేసింది. మూడు క్వార్టర్ల ఫీజులు ఇవ్వాలి. ఇప్పుడు వాటిని తల్లిదండ్రులే కట్టుకుంటున్నారు. ఉదాహరణకు ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ఫీజు రూ.60వేలు ఉంటే ప్రభుత్వం రూ.15వేలు విడుదల చేసింది. మిగిలిన రూ.45వేలు తల్లిదండ్రులు సొంత డబ్బుతో కట్టుకుంటున్నారు. కట్టలేనివారు పిల్లల్ని ఇంటర్వ్యూలకు పంపలేక బాధపడుతున్నారు. మొత్తం విద్యార్థుల్లో ఏటా లక్ష మంది ఇంజనీరింగ్ పూర్తిచేసి బయటకు వస్తారు. వారిలో ఇప్పుడు దాదాపు 70శాతం మంది అంటే 70వేల మంది సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. సర్టిఫికెట్ల అడిగితే విజయవాడలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల విషయంలో దారుణంగా వ్యవహరిస్తోంది. 'ప్రభుత్వం ఫీజులు ఎప్పుడు విడుదల చేస్తుందనేది మాకు సంబంధం లేదు. ముందు మా ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోండి. మీకు ఇంటర్వ్యూలు ఉంటే మాకేంటి?' అని యాజమాన్యం తెగేసి చెబుతోంది. దీంతో అనేక మంది విద్యార్థులు తమకు వచ్చిన ఉద్యోగాలను వదిలేసుకునే దుస్థితి ఏర్పడింది.

100 రోజుల్లో అన్న క్యాంటిన్లు: మంత్రి నారాయణ

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 100 రోజుల్లో అన్నా క్యాంటిన్లను ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. అన్నా క్యాంటిన్లను ప్రారంభించడానికి సంబంధించిన జీవోను కేబినెట్ ఆమోదించిందన్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలోనే తాము ఏర్పాటు చేసిన 183 అన్నా క్యాంటిన్లను వెంటనే ప్రారంభిస్తామని చెప్పారు. మరో 20 అన్నా క్యాంటిన్ల నిర్మాణ పనులు రకరకాల దశల్లో ఉన్నాయని వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి వెంటనే ప్రారంభిస్తామన్నారు. రాజధానిలో తుమ్మచెట్లు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

జగన్ బొమ్మున్న పాస్‌బుక్ మాకొద్దు

▸▸ రీసర్వేతో మా భూములు కోల్పోయాం

▸▸ గత ప్రభుత్వ చర్యలతో నష్టపోయాం

▸▸ 'అనంత'లో రైతు సోదరుల ఆవేదన

▸▸ తహసీల్దారుకు పాస్‌బుక్ స్వాధీనం



అనంతపురం జిల్లా బెళుగుప్ప తహసీల్దారుకు పాసుపుస్తకాన్ని స్వాధీనం చేస్తున్న రైతులు

బెళుగుప్ప, జూన్ 24: జగన్ సర్కారు పోయినా ఆయన పాలనలో తీసుకున్న నిర్ణయాలకు రైతులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. జగన్ బొమ్మల పిచ్చి, తప్పుల తడక రీ సర్వేతో బాధితులయ్యారు. 'జగన్ బొమ్మ ఉన్న పాసు పుస్తకాలు మాకు అవసరం లేదు. మీరే తీసేసుకోండి. గత ప్రభుత్వం చేసిన రీసర్వేతో మా భూములు కోల్పోయాం' అని అనంతపురం జిల్లా బెళుగుప్ప రైతు సోదరులు విజయ్ కుమార్, శివ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు తహసీల్దారు హరినాథరావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గుండ్లపల్లి పొలంలో 2016లో తాము 11.23 ఎకరాల భూమి కొనుగోలు చేశామని, తమ కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్ రికార్డులలో వివరాలు నమోదయ్యాయని తెలిపారు. రీసర్వే చేసిన తరువాత అడంగల్‌లో ఆరు ఎకరాలు రావడం లేదని, గత ప్రభుత్వ చర్యలతో నష్టపోయామని వాపోయారు. జగన్ బొమ్మ ఉన్న పాసుపుస్తకం తమ వద్ద ఉంచుకోవాలంటే భయమేస్తోందని, తమకు అవసరం లేదని తహసీల్దారుకు స్వాధీనం చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దవుతుందని, ఆందోళన చెందవద్దని తహసీల్దారు రైతులకు సూచించారు.

స్తంభానికి కట్టేసి కొట్టారు!

▸▸ క్రికెట్ గొడవలో ఎస్సీ యువకులపై వైసీపీ శ్రేణుల దాష్టీకం

వెదురుకుప్పం, జూన్ 24: క్రికెట్ గొడవ రాజీ కోసం పిలిచి ఇద్దరు ఎస్సీ యువకులను స్తంభానికి కట్టేసి కొట్టారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం మారేపల్లి కాలనీకి చెందిన టీడీపీ ఎస్సీ యువనాయకుడు కె.భాస్కర్, స్థానిక యువకులు, తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురం కాలనీకి చెందిన వారూ ఆదివారం క్రికెట్ ఆడారు. ఈ క్రమంలో రెండు జట్ల మధ్య ఘర్షణ జరిగింది. వావిలిచేను గ్రామస్థులు కలుగజేసుకుని మారేపల్లి కాలనీకి చెందిన క్రీడాకారులను చితకబాదారు. ఆదివారం రాత్రి 9-10 గంటల ప్రాంతంలో వావిలిచేనుకు చెందిన కొందరు అగ్రవర్ణాల వారు మారేపల్లి కాలనీ క్రీడాకారులకు ఫోనుచేసి పంచాయితీ చేసుకుందామని పిలిచారు. దీంతో కె.భాస్కర్, మరో ఎస్సీ యువకుడు నవీన్ వావిలిచేను గ్రామానికి వెళ్లారు. అక్కడ తమను విద్యుత్ స్తంభానికి కట్టేసి చిత్ర హింసలకు గురి చేసి, చితకబాదారని భాస్కర్ ఆరోపించారు. కులంపేరుతో దూషించారన్నారు. తమపై దాడికి పాల్పడిన అగ్ర వర్ణాల వారు వైసీపీకి చెందినవారని ఆయన మీడియాకు చెప్పారు. ఈ ఘటనపై సోమవారం సాయంత్రం వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

'వలంటీర్ల'పై కౌంటర్ వేయండి

▸▸ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

▸▸ విచారణ జూలై 22కు వాయిదా

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): వలంటీర్లు మూకుమ్మడిగా ఉద్యోగాలకు రాజీనామా చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యం సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను జూలై 22కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసేవరకు గ్రామ, వార్డు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ కమిషనర్, గ్రామ-వార్డు వలంటీర్లు సచివాలయశాఖ ముఖ్యకార్యదర్శికి సూచించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఈ పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర సోమవారం వాదనలు వినిపిస్తూ... గత ప్రభుత్వంలోని మంత్రులు తమతో బలవంతంగా రాజీనామాలు చేయించారని వలంటీర్లు స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారని, లోతైన విచారణ జరిపి రాజీనామాల వ్యవహారాన్ని తేల్చాలని కోరారు. రాజీనామాల విషయంలో ప్రభుత్వం, ఈసీ వైఖరిని కోరాలని విజ్ఞప్తి చేశారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

అమిగోస్ అక్రమాలపై సీఐడీ దర్యాప్తు చేయించండి

▸▸ అనంత కలెక్టర్‌కు కాంట్రాక్టర్ ఫిర్యాదు

అనంతపురం టౌన్, జూన్ 24: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మైనింగ్ లీజ్ పేరిట రూ.వెయ్యి కోట్ల దోపిడీకి పాల్పడిన అమిగోస్ సంస్థ అక్రమాలపై సీఐడీ దర్యాప్తు జరిపించాలని క్వారీ యజమాని చంద్రశేఖరరెడ్డి కలెక్టరుకు విన్నవించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఆయన అమిగోస్ అక్రమాలను వివరించారు. తన రాయల్టీ పేపర్‌ను చించేశారని, తన వాహనాన్ని లాక్కుని, లైసెన్స్‌డ్ గన్‌తో కాల్చిపారేస్తామని బెదిరించారని వాపోయారు. తాను చెల్లించిన సొమ్ముకు బిల్లు ఇవ్వకుండా మంత్రి పేరిట బెదిరించారని ఆవేదన వ్యక్తం చేసారు. లీజుదారులకు ఫేక్ రాయల్టీ బిల్లులు ఇచ్చి రూ.కోట్లు దండుకున్నారని అన్నారు.

ట్యూషన్ టీచర్లకు 'డిజిటల్ కార్పొరేషన్' జీతాలు

▸▸ చైర్మన్, వైస్‌చైర్మన్ ఇళ్లలో పిల్లలకు బోధించినందుకు చెల్లింపులు

▸▸ వైసీపీ సోషల్ మీడియాలో పనిచేసేవారికీ కార్పొరేషన్ 'ఉద్యోగాలు'

▸▸ కావాల్సిన వారికి ఉద్యోగాల పేరిట వందల కోట్ల దోపిడీ

▸▸ ప్రజాధనాన్ని పప్పుబెల్లాల్లా పంచేశారు: నీలాయపాలెం

▸▸ వారందరిపై విచారణ జరపాలని డిమాండ్



అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు కల్పించడం కోసం వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని పప్పుబెల్లాల మాదిరిగా పంచిపెట్టేసిందని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ఆరోపించారు. కేవలం దీని కోసమే డిజిటల్ కార్పొరేషన్ పెట్టారని, దాని చైర్మన్, వైస్ చైర్మన్ ఇళ్లలో పిల్లలకు ట్యూషన్లు చెప్పే టీచర్లను కూడా ఈ కార్పొరేషన్‌లో ఉద్యోగులుగా చూపించి జీతాలు చెల్లించారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంత అడ్డగోలుగా పాలన సాగిందో తెలుసుకోడానికి ఇదో పెద్ద ఉదాహరణ అన్నారు. సోమవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులకు ఆ వివరాలు వెల్లడించారు. 'డిజిటల్ కార్పొరేషన్‌లో ఉద్యోగులుగా చూపిస్తున్న 129 మందిలో 49 మంది అసలు ఆఫీసుకు రారు. ఈ కార్పొరేషన్‌లో భార్యాభర్తల పాలసీ ఉంది. దాని ప్రకారం భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులు అయి ఉంటే అందులో ఒకరు ఆఫీసుకు వస్తే మరొకరు రావాల్సిన పని లేదు. అలాగే, ఫ్యామిలీ పాలసీ కూడా తెచ్చారు. ఈ కార్పొరేషన్‌లో కంప్యూటర్లు నిర్వహించే వ్యక్తి కుటుంబంలో ముగ్గురికి ఉద్యోగాలు ఇచ్చారు. ఒకే పని చేసేవారికి ఒకే రకమైన జీతాలు లేవు. ఒకరికి రూ.లక్ష ఇస్తే మరొకరికి రూ.50 వేలు ఇచ్చారు. ఇంకొకరికి కేవలం రూ.25 వేలే ఇచ్చారు. జగన్ భజన చేయడం తప్ప ఈ కార్పొరేషన్‌కు వేరే పని లేదు. ఈ పని కోసం నాలుగేళ్లలో రూ.500 కోట్లు ఖర్చు చేశారు. అందులో భారీగా కొల్లగొట్టారు. ఐ డ్రీం అనే యూ ట్యూబ్ చానల్ యజమానికి ఈ కార్పొరేషన్ చైర్మన్ పదవి అప్పగించారు. జగన్‌కు అనుకూలంగా వార్తలు ప్రచారం చేసే 500 వెబ్ సైట్లకు ఈ కార్పొరేషన్ నుంచి డబ్బులు చెల్లించారు. గూగుల్‌తోపాటు ఐ ప్యాక్‌కు కూడా ప్రకటనల రూపంలో ఈ కార్పొరేషన్ నుంచి డబ్బులు ఇచ్చారు. జగన్ పత్రిక, సోషల్ మీడియాలో పనిచేసే వారినీ డిజిటల్ కార్పొరేషన్‌లో ఉద్యోగులుగా చూపించి జీతాలు చెల్లించారు. ప్రభుత్వ ప్రచారం పేరుతో జగన్‌కు ప్రచారం చేశారు. ఒక ప్రభుత్వ కార్పొరేషన్‌గా ఉండి గూగుల్‌కు రాజకీయ ప్రకటనలు ఇచ్చారు. ఈ కార్పొరేషన్ నుంచి ఇచ్చిన ప్రకటనలను గూగుల్ తర్వాత తొలగించింది. అవి రాజకీయపరమైనవి కావడమే దీనికి కారణం' అని నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. వైసీపీ సోషల్ మీడియాలో పనిచేస్తున్న వారికి ఉద్యోగాలిచ్చి జీతాలు చెల్లించడానికే ఈ కార్పొరేషన్ ఏర్పడిందని చెప్పారు. పార్టీ వారి కోసం కార్పొరేషన్‌ను పెట్టడం దేశంలోనే పెద్ద వింత అన్నారు. ప్రభుత్వం మారగానే ఇందులో సగం మంది రాజీనామా చేసి వెళ్లిపోయారని, చైర్మన్‌గా ఉన్న చిన్న వాసుదేవ రెడ్డి కూడా పారిపోయారని వివరించారు. అన్నీ సవ్యంగా చేస్తే ఇంత ఖర్చు ఎందుకు పడుతుందని ప్రశ్నించారు. టీడీపీ నేతలపై అడ్డగోలుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన గుర్రంపాటి దేవేందర్ రెడ్డి, ఇంటూరి రవి కిరణ్ వంటి వైసీపీ నేతలను జగన్ ఈ కార్పొరేషన్ ద్వారా పోషించారని, వీరందరిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

కిలో అంటే 900 గ్రాములే!

▸▸ రేషన్ తూకంలో మోసాలు నిజమే..నిర్ధారించిన అధికారులు

▸▸ 189 కేసుల నమోదు.. అతిపెద్ద కుంభకోణం : మంత్రి నాదెండ్ల

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై ప్యాకెట్ల రూపంలో ఇస్తున్న రేషన్ సరుకులను 10 శాతం తక్కువ తూకాలతో పేదలకు పంపిణీ చేస్తున్నట్లు తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈనెల 15న బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అదేరోజు సాయంత్రం గుంటూరు జిల్లా తెనాలిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. కార్డుదారులకు సరఫరా చేస్తున్న కందిపప్పు, పంచదార, పామాయిల్ ప్యాకెట్లలో 50 నుంచి 80గ్రాముల చొప్పున తూకాల్లో తేడాలను గుర్తించారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించి సమగ్రమైన నివేదిక సమర్పించాలని తూనికలు, కొలతలశాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు ఈనెల 16 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా 251 ఎంఎల్ఎస్ పాయింట్లలో దాదాపు 600 శాంపిల్స్ సేకరించారు. సరఫరాదారులు ఉద్దేశపూర్వకంగానే నికర పరిమాణంలో 10 శాతం తగ్గించి కార్డుదారులకు పంపిణీ చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో చెక్కరపై 110, కందిపప్పుపై 74, పామోలిన్‌పై 4 చొప్పున మొత్తం 189 కేసులు నమోదు చేశారు. ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ చర్యలు చేపడతామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ వెల్లడించారు. 8 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన రాగుల పంపిణీని వచ్చే నెల నుంచి అన్ని జిల్లాలకూ విస్తరించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఉన్నతాధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్ష

విజయవాడలో సోమవారం సమీక్ష నిర్వహించిన మంత్రి మనోహర్.. రేషన్ బియ్యం పంపిణీలో అతిపెద్ద కుంభకోణం చోటుచేసుకుందన్నారు. త్వరలోనే దీనిపై దృష్టి సారిస్తామని, అవసరమైతే విజిలెన్స్ ఎంక్వయిరీ వేస్తామని చెప్పారు. తూకాల మోసాలకు పాల్పడిన సరఫరాదారులందరినీ బ్లాక్‌లిస్టులో పెట్టమని ఆదేశించినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

▸▸ ఆత్మహత్యాయత్నం చేసినట్టు ప్రచారం.. అవాస్తవమని వీడియో విడుదల

విశాఖపట్నం/పెందుర్తి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని, కుటుంబ సభ్యులు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారంటూ ప్రచారం జరిగింది. దీంతో అదీప్‌రాజ్ స్పందించి వీడియో రిలీజ్ చేశారు. 'స్వల్ప అనారోగ్యం తలెత్తడంతో ఆస్పత్రిలో చేరాను. ప్రస్తుతం కోలుకొని డిశ్చార్జి అయ్యా. ఆత్మహత్య చేసుకున్నానంటూ కొంతమంది పుకారు సృష్టించారు. వాటిని ఎవరూ నమ్మవద్దు' అని వీడియోలో పేర్కొన్నారు.

దళిత మహిళపై కత్తితో దాడి

▸▸ పోలీసులకు ఫిర్యాదు చేసిందని ప్రియుడి తండ్రి ఘాతుకం

▸▸ అనకాపల్లి జిల్లా దేశపాత్రునిపాలెంలో ఘటన

▸▸ నిందితుడిపై కఠిన చర్యలకు దళిత సంఘాల డిమాండ్



గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యశోద

పరవాడ, జూన్ 24: పెళ్లికి ఒప్పుకోవట్లేదని పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు దళిత మహిళపై ప్రియుడి తండ్రి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం దేశపాత్రునిపాలెంలో సోమవారం జరిగిందీ ఘటన. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీకి చెందిన మట్టా యశోద (31), అదే కాలనీకి చెందిన కంపర రమేశ్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో వీరి పెళ్లికి రమేశ్ తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో యశోద మూడు నెలల క్రితం పరవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రమేశ్‌ను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పెళ్లి చేసుకోడానికి అంగీకరించాడు. అయితే, రమేశ్ తండ్రి ఒప్పుకోకపోవడంతో వివాహం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో యశోద మరోసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సోమవారం మధ్యాహ్నం రమేశ్ తండ్రి సత్యనారాయణ స్థానిక చెక్‌పోస్టు వద్ద యశోదపై కత్తితో దాడి చేశారు. ఆమె మెడ, చేతులపై గాయాలవడంతో గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి చేరారు. ఎస్ఐ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల

ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన ఈసెట్-2024 కౌన్సెలింగ్ షెడ్యూలును అడ్మిషన్ల కన్వీనర్ నవ్య సోమవారం విడుదల చేశారు. ఈనెల 26 నుంచి 30 వరకు ఫీజులు చెల్లింపు, రిజిస్ట్రేషన్ గడువుగా పేర్కొన్నారు. 27 నుంచి జూలై 3 వరకు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయొచ్చని, 1 నుంచి 4 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 5న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని వివరించారు. 8న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు 15లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త లోక్‌సభ

పద్దెనిమిదవ లోక్‌సభ సమావేశాల ఆరంభం నాటి దృశ్యాలు చూసినప్పుడు రాబోయే రోజులు ఎలా ఉండబోతున్నాయన్నది ఇప్పుడే కళ్ళకు కడుతున్నది. లోక్‌సభ కొలువుతీరడానికి ముందే ప్రధానిమోదీ 1975లో ఇందిర విధించిన ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ, దానిని రాజ్యాంగం మీద ఎన్నటికీ చెరగని మచ్చగా అభివర్ణిస్తూ, దేశానికి అటువంటి కళంకాలు రాకుండా నడుచుకుంటామంటూ రాజ్యాంగంపై చర్చనీ, మళ్ళీ ఓ రచ్చనీ లేవదీశారు. మోదీ ఏలుబడిలో దేశం ఓ వందసార్లు అప్రకటిత అత్యయికస్థితి ఎదుర్కొందని విమర్శించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, విపక్షానికి అందివచ్చిన నీట్ ఆయుధాన్ని ప్రయోగించారు. విపక్షాలమీద విరుచుకుపడటమే తప్ప లక్షలాదిమందిని ఇబ్బందుల పాల్జేసిన నీట్, నెట్ ఇత్యాది వైఫల్యాలమీద మోదీ నోరువిప్పరన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. సభలోపల విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ ప్రమాణం చేస్తున్నప్పుడు నీట్ పేపర్ లీక్‌మీద విపక్షసభ్యులు నినాదాలు చేయడం, మోదీ, అమిత్‌షాలు ప్రమాణం చేస్తున్నప్పుడు రాహుల్‌గాంధీ తదితర విపక్ష నేతలు రాజ్యాంగం ప్రతిని చూపించడం, పార్లమెంట్ వెలుపల వీరంతా సంఘటితంగా ఆ ప్రతులను చూపుతూ నినాదాలు చేయడం వంటివి ఈ సమావేశాలు ఏ అంశాల చుట్టూ తిరుగుతాయో సూచిస్తున్నాయి. తన ఏలుబడిలో కాంగ్రెస్ రాజ్యాంగాన్ని ఎంతగా బలహీనపరిచిందో ప్రజలకు తెలియచెప్పడానికి బీజేపీ దేశవ్యాప్త కార్యక్రమాలు చేపట్టబోతున్నదట.


ఎన్నడూ మొదటివరుసలో కూర్చోవడానికి ఇష్టపడని రాహుల్‌గాంధీ ఇప్పుడు ముందుకు రావడంతోపాటు అఖిలేశ్ ఆయన పక్కనే ఉండటం విపక్షం సమధికోత్సాహానికి నిదర్శనం కావచ్చు. మంగళవారం రాహుల్ ప్రమాణస్వీకారం సందర్భంగా ఎటువంటి దృశ్యాలు చూస్తామో తెలియదు కానీ, ప్రొటెమ్ స్పీకర్ విషయంలో బీజేపీ అనవసరపు పట్టుదలకు పోయి ఆదిలోనే అగ్గిరాజేసినమాట వాస్తవం. అత్యంత సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా నియమించే సంప్రదాయానికి భిన్నంగా బీజేపీ సభ్యుడు భర్తృహరి మెహతాబ్‌ను ఎంపికచేయడం ద్వారా బీజేపీ ఘర్షణకు పునాదులు వేసింది. ఈ నిర్ణయాన్ని రాజ్యాంగంమీద దాడిగా విపక్షం అభివర్ణిస్తోంది. ఎనిమిదిసార్లు గెలిచివచ్చిన తమ ఎంపీ కొడికున్నిల్ సురేష్‌ను కాదనడం ద్వారా అధికారపక్షం దళితసమాజాన్ని అవమానించిందని కాంగ్రెస్ విమర్శిస్తే, మధ్యలో ఓడిన సురేష్‌కంటే ఏడుసార్లు వరుసగా నెగ్గుకొచ్చిన తమ భర్తృహరి గొప్పవాడని బీజేపీ సమర్థించుకుంది. ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయించి, మహా అయితే ఓ రెండు రోజుల్లో ముగిసిపోయే ఓ పాత్ర విషయంలో బీజేపీ ఇంత మొండిగా వ్యవహరించనక్కరలేదు. తమ చర్యను సమర్థించుకోవడానికి తమకు అనుకూలంగా ఉన్న గతకాలపు నిర్ణయాలను కొన్నింటిని అది గుర్తుచేస్తున్నది. తాత్కాలిక స్పీకర్‌నే శాశ్వతం చేయబోతున్నారన్న ప్రచారాన్ని అటుంచితే, స్పీకర్‌గా మోదీ ఎవరిని నిర్ణయించినా గెలిపించుకోగలిగే సంఖ్యాబలం ఆ కూటమికి ఉన్నందున కనీసం ఈ ముందుదశలో బీజేపీ ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరిస్తే సరిపోయేది. ఒడిశా విజయం అధికారపక్షాన్ని నేలమీద నిలబడనివ్వడం లేదు. ఇప్పుడున్నవారో, వేరెవరో మోదీ మనసులో ఉన్నందున భర్తృహరిని ఇలా తాత్కాలికంగా సంతృప్తి పరుస్తున్నారని మరొకవాదన.

సుదీర్ఘకాలంగా సభలో ఉంటున్న సీనియర్ సభ్యుడిని ఆ కుర్చీలో కూచోబెట్టి, మిగతా తంతుని పూర్తిచేయించే గౌరవసంప్రదాయాల విషయంలో బీజేపీ భిన్నంగా వ్యవహరించడం వెనుక ఒక విస్పష్టమైన సందేశం ఉంది. విపక్షాలతో ఏమాత్రం రాజీపడబోవడంలేదని, సయోధ్య సాధ్యపడదని చెప్పదల్చుకున్నట్టు కనిపిస్తోంది. సంఖ్యరీత్యా తాము తగ్గినా, విపక్షం పెరిగి తమతో కాస్తంత సమమైనా తమలో ఏ మార్పూ ఉండబోదని ఇస్తున్న సందేశం కావచ్చు. విపక్షంతోనే కాదు, అసమ్మతి గొంతులతో, విమర్శకులతో కూడా గతంలో మాదిరిగానే వ్యవహరిస్తానని ఇటీవల అరుంధతీరాయ్‌పై ఊపా కేసు ద్వారా బీజేపీ తెలియచేసింది. కేజ్రీవాల్‌కు బెయిల్ రాకుండా చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ న్యాయవ్యవస్థ మెట్లన్నీ ఎక్కుతోంది, శక్తిమేర పోరాడుతోంది.

పదిహేడవ లోక్‌సభనుంచి దేశం అత్యంత భయానకమైన దృశ్యాలు చూసింది. విపక్షసభ్యులను తీవ్రంగా అవమానించడం, అనుచితంగా ప్రవర్తిస్తూ హేయమైన భాషవాడటం, సుదీర్ఘకాలం సస్పెండ్ చేయడం, సభలో తమను ప్రశ్నిస్తున్నవారినీ, తమకు నచ్చనివారినీ ఎంచుకొని మరీ తప్పుడు మార్గాల్లో అనర్హత వేటువేయడం ప్రజలు చూశారు. అత్యంత కీలకమైన బిల్లులను కూడా ప్రభుత్వం చర్చలేకుండా ఏకపక్షంగా నెగ్గించుకోవడం, అధికారపక్షానిదే పైచేయికావడమూ జరిగింది. రాజ్యాంగం ప్రకారం ఉండాల్సిన డిప్యూటీ స్పీకర్ కూడా ఇంతకాలమూ లేకపోయారు. కొత్త లోక్‌సభ గతానికి భిన్నంగా ప్రజలపక్షాన మరింత సమర్థంగా పని చేయాలని అందరూ ఆశిస్తున్న తరుణంలో, ఆరంభంలోనూ అడుగులు ఆ దిశగాపడకపోవడం, ఆ సూచనలేవీ లేకపోవడం విచారకరం.

విద్య వ్యాపారీకరణ విష ఫలితమే 'నీట్' కుంభకోణం!

ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4వ తేదీనే నీట్-యూజీ ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఇలా జరగడం యాదృచ్ఛికం కావచ్చు. లేదా ఏదో మతలబు ఉందని సందేహించవచ్చు. ఎన్నికల ఫలితాల సంభ్రమంలో దీన్ని గురించి ఎవరూ ఆలోచించే అవకాశం ఉండదనే ఎత్తుగడేమో అన్న అనుమానం కూడా తలెత్తవచ్చు. ఏది ఏమైనా చివరకు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసే విధంగా వందల కోట్ల రూపాయలు చేతులు మారిన నీట్ కుంభకోణం బట్టబయలైంది. ఒకవైపు మూడోసారి మోదీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం, మంత్రి పదవుల పంపకాలు జరుగుతుంటే, మరోవైపు నీట్ అవినీతి దుమారం మీడియాను ముంచెత్తింది. ఈ పరిణామం లక్షలాది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఎంతో క్షోభకు గురి చేసింది. సుప్రీంకోర్టు సైతం 'నీట్ పవిత్రత దెబ్బ తింది' అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఇంత జరిగినా, లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారినా, దేశవ్యాప్త నిరసనలు చెలరేగుతున్నా ప్రధానమంత్రి మాత్రం పెదవి విప్పలేదు. ఇది మోదీ మార్కు పాలనకు మరొక ఉదాహరణ.



అకడమిక్ వ్యవహారాలతో ఏమాత్రం సంబంధం లేని ఎన్టీఏ లాంటి ఒక బ్యూరోక్రటిక్ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేసింది? ఆ సంస్థకు నీట్, జేఈఈ వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షలతో సహా అన్ని రకాల పోటీ పరీక్షల నిర్వహణను ఎందుకు అప్పగించింది? ఈ కీలక ప్రశ్నలపై చర్చ జరగాలి.

తమ ప్రభుత్వంపై పడిన అవినీతి మరకను కప్పిపుచ్చుకోవడానికి ఎన్టీఏ అధికారులను బలి పశువులను చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్టీఏను సంస్కరించే పేరిట ఏవో చర్యలు, ప్రకటనలు వెలువడుతున్నాయి. అసలు కేంద్ర ప్రభుత్వం అకడమిక్ వ్యవహారాలతో ఏమాత్రం సంబంధంలేని ఎన్టీఏ లాంటి ఒక బ్యూరోక్రటిక్ సంస్థను ఎందుకు ఏర్పాటు చేసింది? ఆ సంస్థకు నీట్, జేఈఈ వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షలతో సహా అన్ని రకాల పోటీ పరీక్షల నిర్వహణను ఎందుకు అప్పగించింది? ఇలాంటి కీలక ప్రశ్నలు చర్చకు రావడం లేదు.

నీట్ కుంభకోణం నేపథ్యంలో మన దేశ విద్యారంగంలో అమలవుతున్న విధానపరమైన మార్పులను నిశితంగా పరిశీలించాలి. ఎందుకంటే ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షలలో అక్రమాలు, ఫలితాలలో అవకతవకలు తదితర సమస్యలన్నీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ అనే ప్రధాన విధానంతో ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం అమలవుతున్న జాతీయ విద్యావిధానం-2020లో యావత్తు విద్యను, ప్రత్యేకించి ఉన్నత విద్యను గంపగుత్తగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి అవసరమైన సిఫార్సులు చాలా ఉన్నాయి. ఈ విధానం నిరాటంకంగా, వేగంగా అమలు కావడానికి విద్యా రంగంలోని అన్ని అధికారాలను కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి బదలాయించే చర్యలు వరుసగా చేపడుతున్నారు. రాజ్యాంగంలో విద్యారంగం ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ, రాష్ట్రాల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా అన్ని వ్యవహారాలను కేంద్రమే నిర్దేశించడం ఫెడరల్ సూత్రాలకు పూర్తి విరుద్ధం. ఈ విధమైన అధికారాల కేంద్రీకరణలో భాగంగానే గతంలో రాష్ట్రాల పరిధిలో ఉన్న మెడికల్ ప్రవేశాలు, అడ్మిషన్ల మొత్తం ప్రక్రియను కేంద్రం నియమించే వ్యక్తులతో కూడిన ఎన్టీఏకు అప్పగించారు. దీనితో యూనివర్శిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి.

నీట్‌ను ప్రవేశపెట్టిన తరువాత మెడికల్ విద్యలో చోటుచేసుకున్న మార్పుల గురించి అమృత్‌సర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా పనిచేసిన డాక్టర్ శ్యామ్ సుందర్ దీప్తి వెలిబుచ్చిన అభిప్రాయాలు గమనార్హమైనవి. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటి 2021 అక్టోబర్ 31న జాతీయ విద్యావిధానం-2020పై నిర్వహించిన ఒక జాతీయ స్థాయి సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ఇలా చెప్పారు: "నీట్‌కు ముందు, ఆ తర్వాత విద్యార్థులకు కల్పించబడిన ప్రవేశాలలో చాలా వ్యత్యాసం ఉంది. అంతకు ముందు సంవత్సరాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి, వివిధ రకాల ఆర్థిక-సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులందరూ ప్రవేశాలు పొందారు. అయితే నేడు కేవలం నగరాలు, మహానగరాల నుండి వచ్చిన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఈ తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మధ్య, దిగువ మధ్య తరగతి నుండి ప్రవేశాలు పొందిన విద్యార్థులను వేళ్లపై లెక్కించవచ్చు. దీనికి కారణం సుస్పష్టం. నీట్ ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవడానికి కోచింగ్ సెంటర్లకు, అదేవిధంగా కోర్సులో చేరిన తరువాత మెడికల్ కళాశాలలకు చెల్లించవలసిన ఫీజులు అత్యధికంగా ఉండటమే. ఈ ఫీజులు కనీసం 25 లక్షల నుండి 30 లక్షల వరకు ఉంటున్నాయి. ఇంత పెద్ద మొత్తాన్ని మధ్యతరగతి కుటుంబాలు భరించడం చాలా కష్టం. ఈ భారీ ఫీజులకు కారణం మొత్తం మెడికల్ కళాశాలల్లో 50 శాతానికి పైగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనూ, కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోనూ ఉండటమే. వారి చేతుల్లో కేవలం కళాశాలలను ఉంచడమేగాక, వారికి అనుకూలంగా విద్యాప్రణాళిక రచించబడింది కూడా! కార్పొరేట్ వ్యవస్థను నడిపే పనిముట్లుగా శిక్షణ పొందిన సిబ్బందిని ఉత్పత్తి చేయడమే ఈ విద్యా ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యం." ఈ అభిప్రాయాలు ఎంత వాస్తవికంగా ఉన్నాయో మన కళ్ళ ముందు స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రస్తుతం జరిగిన నీట్ కుంభకోణం వంటివి భవిష్యత్తులో మరిన్ని పెద్ద స్థాయిలో జరిగే అవకాశాలు లేకపోలేదు. కావున నీట్‌ను తిరిగి నిర్వహించాలనే డిమాండ్‌తో పాటుగా ఎన్టీఏను తక్షణం రద్దు చేయాలని, విద్యలో అన్ని చెడులకు మూలమైన విద్య కార్పొరేటీకరణ, అధికారాల కేంద్రీకరణ విధానాన్ని ఉపసంహరించాలని కోరుతూ ఒక సమరశీల ఉద్యమాన్ని నిర్మించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

○ ఎస్. గోవింద రాజులు
ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ

మోదీ పాలనలో గుణాత్మక మార్పు వచ్చేనా?

ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు ప్రధాని నరేంద్రమోదీ బలాన్ని సగానికి ఒక పిసరు తగ్గించినందుకు అభ్యుదయవాదులు, ప్రగతిశీలురు సంతోషిస్తున్నారు. ఆయన గొంతు చించుకొని దేశమంతా ప్రచారం చేసినా బీజేపీకి సాధారణ మెజారిటీ రానందుకు, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు అనే ఊతకర్రల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందుకు మురిసిపోతున్నారు. మోదీ పూర్వంలా దూకుడుగా కాకుండా ఈసారి పరిపాలనలో ఆగి, ఆలోచించి అడుగు వేయక తప్పదని భావిస్తున్నారు. కాని ఆయన వ్యవహార శైలి చూస్తుంటే ప్రజాస్వామికవాదుల ఆకాంక్షలు బూడిదపాలు కాక తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి.



18వ సార్వత్రిక ఎన్నికల తీర్పు ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. దేశ సెక్యులర్ నీతి చెక్కుచెదరకూడదని, మైనారిటీలను ద్వేషించడం మానుకోవాలని ప్రజలు ఆదేశించారు. నిరుద్యోగం, అధిక ధరలు, అగ్నివీర్ వంటి సమస్యల విషయంలో స్పష్టమైన వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ఈ సందేశాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజలు గమనించకుండా ఉండరు.

బీజేపీ ఏకచ్ఛత్రాధిపత్యం అయితే ప్రధాని మాటకు తిరుగుండదు. ఇతరుల మద్దతు అనివార్యమైనప్పుడు, ప్రధాన నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారి విధానాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. 2004లో కేంద్రంలో ఐక్య ప్రగతిశీల కూటమి (యూపీఏ) ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు మద్దతు ఇచ్చిన వామపక్షాలతో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని (సీఎంపీ) కుదుర్చుకున్నది. ప్రభుత్వం మితిమించి కుడి వైపు ఒరిగిపోకుండా అది కొంతకాలం అడ్డుకట్ట వేయగలిగింది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వానికి లోపలి నుంచి మద్దతు ఇస్తున్న టీడీపీ, జేడీ (యూ) పార్టీలు అటువంటి ఒప్పందాన్ని కోరలేదు. అందుచేత ఎప్పటి మాదిరిగానే ప్రధాని మోదీ ఏకపక్ష నిర్ణయాలతో సెక్యులరిజాన్ని, ఫెడరలిజాన్ని చెరోచేత పట్టుకొని కొరుక్కుతినడానికి అవకాశాలున్నట్టు భావించక తప్పడం లేదు.

మంత్రివర్గ కూర్పులో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, జై శంకర్‌లకు అవే శాఖలు అప్పగించడం మోదీ పాలన కొనసాగింపునే సూచిస్తున్నది. ముఖ్యంగా అమిత్ షాకు తిరిగి హోమ్ శాఖ కట్టబెట్టడం ఆయన పాత శైలికి పచ్చ జెండా ఊపడంగానే భావించాలి. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర హోం మంత్రిగా అమిత్ షా మణిపూర్‌ను ఎలా మండించి జాతుల విద్వేష కాష్టంగా మార్చారో చూస్తూనే ఉన్నాం. అలాగే భీమా కోరెగావ్ వంటి కృత్రిమ కేసులను సృష్టించి వామపక్ష మేధావులపైన బెయిలుకు వీలు లేని 'ఊపా'ను ఉసిగొల్పడం మాదిరి చర్యలు ప్రజాస్వామిక వాదులను తీవ్రంగా కలచి వేశాయి. ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార ఘట్టంలో చేసిన ప్రసంగాలు ప్రజలను అమితంగా భీతిల్లజేశాయి. ఎన్నికల ఫలితాలు వెలువడి తన పార్టీ మెజారిటీకి ఆమడ దూరంలోనే ఆగిపోయిన తర్వాత ఆయన చేసిన ప్రసంగాల్లో ఎక్కడా గత విధానాల పట్ల పశ్చాత్తాపం వ్యక్తం కాలేదు. అవినీతి అంతు చూస్తామని ప్రధాని మోదీ మళ్ళీ తాజాగా ప్రకటించారు. బీజేపీ అవినీతి వ్యతిరేక విధానమంటే ప్రతిపక్షాలను రాచిరంపాన పెట్టడమూ, స్వపక్షంలోని అవినీతిని కప్పి పెట్టడమేనని రుజువైపోయింది. ఆ క్రమంలో కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం మోదీ – షా లకు అలవాటైన విద్యే. ప్రతిపక్ష ముక్త భారత్‌ను రూపొందించాలని శతవిధాలా ప్రయత్నించారు. మోదీ గత పాలన రీతులను యథాతథంగా కొనసాగించడమే అయితే ఈ ఎన్నికల ద్వారా వచ్చిన మార్పు ఆదిలోనే అదృశ్యమైనట్టు భావించాలి.

గతంలో వాజపేయి హయాంలో బీజేపీకి మెజారిటీ లోపించినందున కశ్మీర్, రామ మందిరం అంశాలను వివాదాస్పదమైనవిగా పరిగణించి పక్కన బెట్టారు. గత ఐదేళ్లలో బీజేపీ పార్లమెంటులో ఎదురు లేని, తిరుగులేని ఆధిక్యతను అనుభవించినందున ఈ అంశాలను ఇష్టపూర్వక రీతిలో ఒక కొలిక్కి తెచ్చుకున్నది. అలా జరిపించుకోడంలో దేశ మౌలిక నీతి అయిన శాంతియుత సహజీవన సిద్ధాంతాన్ని బలి తీసుకున్నది.

"మన ఎన్నికల వ్యవస్థ ప్రతి భారతీయుణ్ణి గర్వంతో తల ఎత్తుకునేలా చేసింది. సామర్థ్యంలో దానికి ప్రపంచంలోనే సాటి లేదు" అని ఈ ఎన్నికల తర్వాత మోదీ ప్రకటించారు. కాని ఎన్నికల సంఘం నిష్పాక్షిక గొంతును ఆయన నులిమేసిన చేదు వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. కమిషన్ సభ్యుల నియామక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తికి చోటు లేకుండా చేశారు. సొంత మనుషులతో నింపుకునేందుకు వీలుగా పార్లమెంటు చేత చట్టం చేయించుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని ఎంతగా నియమోల్లంఘనకు పాల్పడినా ఎలక్షన్ కమిషన్ నోరు విప్పని దృశ్యం నిన్న మొన్నటిదే. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముస్లింలపై ద్వేష భావజాలాన్ని రెచ్చగొట్టారు. కాంగ్రెస్ పార్టీని ముస్లిం లీగ్‌తో పోల్చారు. అణగారిన వర్గాలకు భారత రాజ్యాంగం ఇస్తున్న సౌకర్యాలను ముస్లింలకు కాంగ్రెస్ ధారాదత్తం చేస్తుందని ఆరోపించారు. దేశ సంపద మీద మొట్టమొదటి హక్కు ముస్లిమ్‌లదేనని కాంగ్రెస్ చెప్పినట్టు ప్రచారం చేశారు. దేశంలోని మైనారిటీలకు సాధికారత కల్పించవలసిన అవసరమున్నదని మన్మోహన్ సింగ్ 2006లో ఒక ప్రసంగంలో అన్న దానిని వక్రీకరించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నిధులను ముస్లింలకు దోచిపెడుతున్నట్టు చూపే ఒక వీడియోను కాషాయ శక్తులు ప్రచారంలో పెట్టాయి. ఇంత తీవ్రంగా సాగిన ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారు. అందుకే బీజేపీకి మెజారిటీని నిరాకరించి అతి పెద్ద పార్టీ స్థాయిని మాత్రమే ఇచ్చారు.

అదే సమయంలో రాజ్యాంగం, రిజర్వేషన్లు, కుల గణనను ప్రచారాంశాలు చేసుకున్న కాంగ్రెస్‌కు 99 స్థానాలు కట్టబెట్టి పదేళ్ల తర్వాత మొదటిసారిగా లోక్‌సభలో అధికారిక ప్రతిపక్ష హోదాను దానికి ప్రసాదించారు. బీజేపీకి కంచుకోటగా గతంలో నిరూపించుకున్న ఉత్తరప్రదేశ్ లోని 80 స్థానాల్లో సమాజ్‌వాది పార్టీకి 37 స్థానాల్లో విజయ కిరీటాన్ని తొడిగారు. గత లోక్‌సభలో దానికి ఉన్నవి 5 స్థానాలే. ఈ తీర్పు ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. దేశ సెక్యులర్ నీతి చెక్కుచెదరకూడదని, మైనారిటీలను ద్వేషించడం మానుకోవాలని ప్రజలు ఆదేశించారు. అలాగే ప్రజలు నిరుద్యోగం, అధిక ధరలు, అగ్నివీర్ వంటి సమస్యల విషయంలో స్పష్టమైన వ్యతిరేకతను తెలియజేశారు. అధికారం చేతికి వచ్చింది కదా అని ఈ సందేశాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజలు గమనించకుండా ఉండరు.

మోదీ తన పాలన ప్రాధాన్యాలను తప్పనిసరిగా మార్చుకోవలసి ఉంది. పర మత విద్వేషానికి స్వస్తి చెప్పి ప్రజల బతుకులు బాగుపరచడంపై దృష్టి పెట్టాలి, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో సంప్రదించి నిర్ణయాలు తీసుకొనే కొత్త అధ్యాయానికి తెర లేపాలి. జవహర్ లాల్ నెహ్రూ మాదిరిగా వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం కాదు; దేశ సర్వతోముఖ అభివృద్ధికి, సహజీవన శాంతికి ఎవరు ఎంత చేశారనేది ముఖ్యం. ప్రధాని మోదీ మూడోసారి అధికారానికి వచ్చిన మహదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దేశంలోని ముస్లింలను ప్రతి హిందువూ ద్వేషించేలా చేసి ఎన్డీఏకి లోక్‌సభలో 400 స్థానాలు లభించేలా చూడాలన్న బీజేపీ వ్యూహం విఫలమయ్యిందంటే ప్రజలు ఏక జాతి దేశాన్ని కోరుకోవడం లేదని రూఢీ అయిపోయింది. జనాభాలో కేవలం 15శాతంగా ఉన్న ముస్లింలను హిందువులు పరాయివారుగా చూడడం లేదు. వారితో అన్ని రకాలుగా పెనవేసుకుపోయారు. వారు కూడా ఈ భూమి పుత్రులే. రాజ్యాంగం వారికి కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను హరిస్తే ఇతరులకు ఒరిగేది ఏమీ ఉండదు. అందుచేత మూడోసారి మోదీ పాలనలో గణనీయమైన మార్పు రావాలని అందరూ ఆశిస్తున్నారు.


■ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

ప్రజా చైతన్యంపై 'ఊపా' దాడి

అరుంధతి రాయ్, షేక్ షౌకత్ హుస్సేన్ (కశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్) పైన పద్నాలుగేళ్ళ క్రితంనాటి ఆరోపణలను సాకుగా చూపిస్తూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా ఊపా అనే అనాగరిక చట్ట ప్రయోగానికి అనుమతిచ్చారు. అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులున్న, ప్రజాస్వామ్య సంస్కృతి కోసం ఆరాటపడే గొప్ప మానవీయ రచయిత్రి అరుంధతి రాయ్ పైన ఊపా కేసు ప్రయోగంతో కేంద్రంలోని ప్రభుత్వం తన అంతిమ ఫాసిస్టు రూపాన్ని ప్రదర్శిస్తున్నది.

2010లో ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో వక్తలు చేసిన ఉపన్యాసాలు ప్రజలను రెచ్చగొట్టే విధంగానూ, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేవిగానూ ఉన్నాయని ఒక కశ్మీరీ పండిట్ ఆనాడు ఫిర్యాదు నమోదు చేశారు. ఆనాటి కేసును తిరగదోడి గత సంవత్సరం ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, ఇవాళ వాటినే ఊపా కేసు పరిధిలోకి తెచ్చారు. ఊపా ఎంత అనాగరిక చట్టమైనా దాని ఉద్దేశం కొంతమంది వ్యక్తులు లేదా సంస్థల వల్ల భవిష్యత్తులో హింస లేదా నేరాలు జరగకుండా నివారించటమే. నిజంగా ఈ ప్రముఖుల ఉపన్యాసాల వల్ల కశ్మీరీ ప్రజలు రెచ్చిపోయి ఉంటే, వేర్పాటువాదం మరింత పెరిగిపోయి ఉంటే ఆ పర్యవసానాలు వారి ఉపన్యాసాలనంతరం కనిపించేవి. ఫలితంగా జరిగిన పరిణామాలకు వీరి ఉపన్యాసాలను లింక్ చేసి ఉంటే అదొక చట్టబద్ధ వ్యవహారమై ఉండేది. నిజానికి, అటువంటి ఉపన్యాసాలు వారేమీ ఇవ్వకపోయినా, ఇచ్చిన ఉపన్యాసాలతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోయినా, వీరిపై ఆరోపణలు చేసిన వ్యక్తి దురుద్దేశంతో ఫిర్యాదు చేశాడని ఆ కేసును అంతటితో మూసివేయవచ్చు.

అరుంధతీ రాయ్ లాంటి వ్యక్తులు కశ్మీర్ ప్రజల సామాజిక, రాజకీయ, రాజ్యాంగ హక్కుల విశ్లేషణ తప్ప మతోన్మాదుల లాగా మాబ్‌ని రెచ్చగొట్టే చవకబారు ఉద్రేకపూరిత ఉపన్యాసాలు ఇచ్చే బాపతు కాదు. ఆ విషయాలు తెలిసి కూడా నిత్యం ప్రజల మనోభావాలతో ఆడుకుంటూ, వారిలో భావోద్రేకాలను రెచ్చగొట్టి, చట్ట బాహ్య హింసకు కారణమైన చరిత్ర గల రాజకీయ పార్టీ ఇవాళ అధికార పీఠంపై కూర్చుని శాంతి కోసం తపిస్తున్నట్టు నిజమైన శాంతికాముకులైన ప్రజాస్వామ్యవాదులపై ఇటువంటి కేసులకు దిగుతున్నది.



ఫాసిస్ట్ స్వభావం గల అధికార పార్టీ, వారి సోదర, మాతృ సంస్థల బండారాన్ని బట్టబయలు చేస్తూ అరుంధతి రాయ్, ఇంకా అనేకమంది జాతీయ స్థాయి ప్రజాస్వామిక వాదులు ప్రజలను చైతన్యం చేయటాన్ని సహించలేని ప్రభుత్వం రాజకీయంగా, సైద్ధాంతికంగా వారిని ఎదుర్కోలేక ఇటువంటి నిరంకుశ అణచివేతకు దిగుతున్నది. ప్రజలు క్రమంగా పాలకుల ప్రజావ్యతిరేక, ఫాసిస్టు స్వభావాన్ని అర్థం చేసుకుంటున్నారు. వారు మరింత చైతన్యం కాకుండా నిరోధించటానికే అరుంధతీ రాయ్ పైన ఈ ఊపా కేసు.

ఫాసిజం స్వభావసిద్ధమైన లక్షణం సమాజంలోని చైతన్యాన్నీ వివేకాన్నీ చంపి వేయటం. అందుకే వాళ్లు ప్రజలను చైతన్యం చేసే రచయితలనూ, మేధావులనూ, కమ్యూనిస్టులనూ, చైతన్యానికి వేదికలుగా ఉండగల విశ్వవిద్యాలయాలనూ లక్ష్యంగా చేసుకొని మొట్టమొదట దాడి చేస్తారు. గత పదేళ్ళుగా దేశంలో అదే జరుగుతున్నది. అదే క్రమంగా ఉధృతమవుతున్నది. ఆధునిక నాగరికతకూ, ప్రజాస్వామ్యానికీ, మానవాళి గౌరవప్రద జీవనానికీ గొడ్డలి పెట్టులాగా మారిన ఫాసిస్ట్ పరిపాలనా ధోరణి భారతదేశంలో జడలు విప్పుతున్నది. అందరం ఒక్కటై ప్రజాస్వామ్యాన్నీ, భావప్రకటనా స్వేచ్ఛనూ కాపాడుకుందాం. అరుంధతి రాయ్, షేక్ షౌకత్ హుస్సేన్ లపై ఊపా ప్రయోగాన్ని తీవ్రంగా వ్యతిరేకిద్దాం.

– డాక్టర్ ఎస్. తిరుపతయ్య
(మానవ హక్కుల వేదిక)

స్థితప్రజ్ఞుని కొత్త ప్రస్థానం

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో జగన్ దారుణ పరాజయానికి, తమ విజయానికి ఎన్డీఏ కూటమికి చెందిన నేతలు, కార్యకర్తలు; 61% మంది ఓటర్లు, దేశ విదేశాల్లోని కొందరు తెలుగు వారు ఇంకా సంబరాలు జరుపుకొంటూనే ఉన్నారు. ప్రత్యేకించి వైనాట్ 175 అన్న జగన్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడంతో వారు పట్టలేని సంతోషంతో ఉన్నారు. జగన్ ఓటమితో రాష్ట్ర రాజకీయ వాతావరణం తేలిక పడింది. పంటిబిగువున కొన్నేళ్లుగా భయంభయంగా బతుకీడుస్తున్న కొన్ని వర్గాల ప్రజల ముఖాల్లో సంతోష ఛాయలు ప్రస్ఫుటంగా గోచరమవుతున్నాయి. అయితే, ఆశ్చర్యకరంగా జగన్‌ను మట్టి కరిపించి చరిత్రలోనే ఎవ్వరూ అందుకోలేనంత గొప్ప విజయం సాధించిన తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖంలో మాత్రం చిక్కటి గాంభీర్యం కనిపిస్తోంది.

చంద్రబాబునాయుడు స్వతహాగా స్థితప్రజ్ఞత గలిగిన నాయకుడు. కష్టం ఎదురైతే హైరానా పడటం, విజయం దక్కితే సంబరం చేసుకొనే నైజం ఆయనలో కన్పించదు. అలాగని.. ఐదేళ్ల నిరంతర పోరాటాలు, ప్రజల్ని చైతన్యపరిచే క్రమంలో సాగించిన ఉద్యమాలు అందించిన అద్భుత ఫలితాన్ని ఆయన ఆస్వాదించడం లేదని కాదు. కానీ, ఇపుడు చంద్రబాబుకు అధికారం ఓ పూలపాన్పు కాదు. ముఖ్యమంత్రి పదవి బంగారు కిరీటం కాదు. కారణం– గత ఐదేళ్లలో జగన్, ఆయని బృందం చేసిన నిర్వాకాలతో రాష్ట్రం ఓ మట్టిదిబ్బగా మారిపోయింది. రాష్ట్ర ఖజానా వట్టిపోయింది. మితిమీరి చేసిన అప్పులు రాష్ట్ర భవిష్యత్‌కు గుదిబండగా మారాయి. జీవనాడి అనుకొన్న పోలవరంతో సహా సాగునీటి ప్రాజెక్టులు అన్నీ పడకేశాయి. వ్యవసాయరంగం ఈసురోమంటోంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నారు. రాష్ట్రానికి రాజధాని లేదు. వచ్చిన పరిశ్రమలు తరలిపోయాయి. కొన్ని కుంటుతూ నడుస్తున్నాయి. మరోపక్క రాష్ట్ర సంపదకు దోహదం చేసే సహజవనరుల్ని గత ఐదేళ్లల్లో అధికార పార్టీ నేతలు మహ్మద్‌ఘోరీ కంటే ఘోరంగా ఇష్టానుసారంగా దోచుకొన్నారు. ఇక, రాష్ట్రంలో శాంతిభద్రతలు వివరించలేనంతగా క్షీణించాయి. నాటి అధికార పార్టీతో అంటకాగుతూ కిందిస్థాయి పోలీసులు మొదలుకొని కొందరు ఎస్పీలు సాగించిన అరాచకాలు కంచే చేను మేసిన చందంగా సాగిపోయాయి. బాధితులనే నేరస్థులుగా చిత్రీకరించి అక్రమ కేసులు పెట్టిన ఘటనలు ఈ ఐదేళ్లల్లో కోకొల్లలు. నాసిరకం మద్యం, గంజాయిల చెలామణితో ఐదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు పెరిగినట్లు నేషనల్ క్రైమ్‌బ్యూరో ఆఫ్ రికార్డ్స్ గణాంకాలు వెల్లడించాయి. ఇక, శ్రీకాకుళం మొదలుకొని అనంతపురం వరకు గుంతలు పడి అధ్వానంగా మారిన రోడ్లు.. జగన్ అస్తవ్యస్థ పాలనకు ఆనవాళ్లుగా నిలిచాయి. అధికార పార్టీ నేతలే స్వయంగా భూకబ్జాలకు, దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడుతూ ఉంటే.. అందుకు సంబంధించిన నివేదికలు అందినా.. వాటిపై కన్నెత్తి చూడకుండా నీరోచక్రవర్తిలా తాడేపల్లి ప్యాలెస్‌లో గడిపేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి– ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన ద్రోహం చరిత్రలో ఎప్పటికీ మాయని మచ్చలా నిలిచిపోతుంది. ఈ అక్రమాలకు కొందరు ఉన్నతాధికారులు వెన్నుదన్నుగా నిలిచి నాటి అధికార పార్టీ ఆగడాలకు, అవినీతికి కొమ్ముకాశారు.

అధికారంలోకి వచ్చాక జగన్ ప్రదర్శించిన విపరీత ధోరణిని, నియంతృత్వాన్ని ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ తన సొంత మనుషులకు పని లేకపోయినా సలహాదార్లుగా నియమించి వారికి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచిపెట్టడం; ప్రాధాన్యతలు విస్మరించి రుషికొండ లాంటి చోట వందల కోట్లతో విడిదికోసం విలాసవంతమైన భవనాలు నిర్మించుకోవడం; రాజకీయ ప్రత్యర్థుల్ని శత్రువుల్లా పరిగణించి వారిని వేధించడం; పత్రికా స్వేచ్ఛను హరించడం, న్యాయస్థానాల తీర్పులను ఖాతరు చేయకపోవడం, ఎవరి సలహాలు, సూచనలు పాటించకపోవడం, ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థల్ని కుప్పకూల్చడం, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడం, ఎన్నికలలో ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినా ఆత్మపరిశీలన లేకుండా ఓటమికి సాకులు చెప్పడం... ఇటువంటి లక్షణాలన్నీ నియంతల్లోనే కన్పిస్తాయి. జగన్ ఓ నయా నియంతగా ఐదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లో వెలిగిపోయారు. కానీ, నియంతల పతనం ఎప్పుడూ దారుణంగానే ఉంటుందన్నది చరిత్ర చెప్పే వాస్తవం. ఇందుకు జగన్ అతీతుడు కాదని ప్రజలు తేల్చేశారు.

ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు ప్రదర్శించిన పరిణతిని ఎంత పొగిడినా తక్కువే అవుతుంది. చంద్రబాబునాయుడి పోరాటాలు, ఉద్యమాలు ప్రతి గడపకూ చేరాయి. పవన్‌కళ్యాణ్ మాటలు, విమర్శలు అందర్నీ ఆలోచింపజేశాయి. ఐదేళ్ల పాటు అప్రజాస్వామిక శక్తులతో పోరాడి ఘన విజయం సాధించిన నాయకుడికి ఇప్పుడు మరో రూపంలో సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి.



కొంతలో కొంత సంతోషం ఏమిటంటే, జగన్ ధ్వంస రచన ఐదేళ్లకే ముగియడం. ఇందుకు కారణం చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌ల ఉమ్మడి నాయకత్వం. చివర్లో బీజేపీతో చేతులు కలపడం, ఇవన్నీ కలిసివచ్చాయి. ప్రజా చైతన్యం ఓట్ల రూపంలో వెల్లువెత్తింది. నిజానికి, ప్రజలను నిరంతరం వాస్తవాల ద్వారా చైతన్యపర్చాలన్న దృక్పథం చంద్రబాబులో మొదటినుంచీ ఉంది. 2019లో అధికారం కోల్పోయిన తర్వాత చంద్రబాబు నిరాశానిస్పృహలకు లోను కాలేదు. తొలి రోజు నుంచే ఆశావహ వైఖరితో పార్టీ శ్రేణుల్ని ముందుకు నడిపిస్తూ ప్రజల తరఫున నిలబడ్డారు. జగన్ ప్రభుత్వం చేసిన అక్రమాలు, పాల్పడిన అవినీతికి సంబంధించిన వివరాలతో అన్ని వేదికల ద్వారా అలుపెరుగని పోరాటాలు చేశారు. ఆ క్రమంలో చంద్రబాబు ఎదుర్కొన్న సవాళ్లు, అవమానాలు బహుశ భారతదేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ఎదుర్కొని ఉండరు.

దేశంలో అత్యంత సీనియర్ రాజకీయ నాయకులలో రెండు, మూడు స్థానాలలో నిలిచే చంద్రబాబునాయుడిని అసెంబ్లీ సాక్షిగా బూతులు తిట్టి మానసిక ఆనందం పొందే స్థాయికి ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి దిగజారుతాడని ఎవరు మాత్రం అనుకొంటారు? పైగా, ఉన్నత స్థానంలో ఉండే స్పీకర్ అందుకు వత్తాసు పలకడం; గౌరవ మర్యాదలు గలిగిన మహిళల పేర్లను తీసుకొని దుర్భాషలాడటం వంటి ఘోరాలకు రాష్ట్ర అసెంబ్లీని వేదిక చేసిన పాపం నిస్సందేహంగా నాటి సీఎం జగన్, స్పీకర్ తమ్మినేని సీతారాంలదే. చంద్రబాబునాయుడిని అసెంబ్లీలో తమ సభ్యులు అవమానిస్తుంటే.. జగన్, సీతారాంలు చిరునవ్వులు చిందించారు. కానీ, చివరకు ఏం జరిగింది? వారి సంకుచిత ధోరణి బెడిసి కొట్టింది. అసెంబ్లీ లోపల, బయట మృగప్రవృత్తితో ప్రవర్తించిన నేతల గూబలు గుయ్యిమనేలా ప్రజలు తీర్పు చెప్పారు. ఈ ఎన్నికలలో ప్రజలు ప్రదర్శించిన పరిణతిని ఎంత పొగిడినా తక్కువే అవుతుంది. చంద్రబాబునాయుడి పోరాటాలు, ఉద్యమాలు ప్రతి గడపకూ చేరాయి. పవన్‌కళ్యాణ్ మాటలు, విమర్శలు అందర్నీ ఆలోచింపజేశాయి.

ఐదేళ్ల పాటు అప్రజాస్వామిక శక్తులతో పోరాడి ఘన విజయం సాధించిన నాయకుడికి మరో రూపంలో సవాళ్లు ఇప్పుడు స్వాగతం పలుకుతున్నాయి. 11 సీట్లకు పరిమితమైన జగన్ పార్టీ ఇప్పట్లో కోలుకొనే అవకాశమే లేదు. జగన్ చేసిన పాపాలు రాష్ట్రాన్ని ఏ విధంగా అధోగతిపాలు చేశాయో గమనించిన ప్రజలు అతణ్ణి క్షమిస్తారని అనుకోలేం. అదే సమయంలో ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని నిర్మాణాత్మకంగా జగన్ వ్యవహరిస్తారని కూడా భావించలేం. ఓటమికి సాకులు వెతుక్కునే క్రమంలో జగన్ ఈవీఎంలను తప్పు పట్టడం చూస్తే ఆయనలో ఇసుమంతైన మార్పు రాలేదని అర్థమవుతుంది. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత మీడియా ముందుకు వచ్చి ఈవీఎంల సమర్థత గురించి జగన్ చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఆయన ద్వంద్వ ప్రవృత్తిని ఎత్తి చూపుతున్నాయి.

ఇంతకుముందు మాదిరిగానే జగన్ ప్రజల్ని కాక సొంత మీడియాను, సోషల్ మీడియాను నమ్ముకొంటారు. ఇప్పటికే తన మీడియా ద్వారా తమ పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయంటూ కొన్ని స్వల్ప సంఘటనలను చిలవలు పలవలుగా చేసి దుష్ప్రచారం చేస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఈ తరహా గోబెల్స్ ప్రచారం కొనసాగుతుంది. అయితే, ఇప్పుడు జగన్ పూర్తి ఆత్మరక్షణలో పడిపోయారు. తన మీద సిబిఐ, ఈడీ కేసులు ఉన్నప్పటికీ గత ఐదేళ్లుగా కోర్టు వాయిదాలకు వెళ్లకుండా అధికార రక్షణ కవచం అడ్డుపెట్టుకొని ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చారు. కానీ, ఇప్పుడు ఆయనకు ఆ వెసులుబాటు ఉండదు. అంతేకాదు, అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రజాధనాన్ని కొల్లగొట్టినందున పాత కేసులతో పాటు కొత్త కేసుల్ని కూడా జగన్ అనివార్యంగా ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీకి జగన్ నుంచి సమస్యలు ఎదురు కావచ్చునేమో గానీ, సవాళ్లు ఉండే అవకాశం లేదు. కానీ, జగన్ చేసిన విధ్వంసం వల్ల ఉత్పన్నమయిన సమస్యలే కొత్త ప్రభుత్వ పురోగతికి ప్రతిబంధకాలుగా, గుదిబండలుగా మారతాయి. అయితే సంక్షోభ పరిస్థితులను, అవరోధాలను, ప్రతికూలతలను విజయవంతంగా ఎదుర్కొని, వాటిని అనుకూలతలుగా మార్చుకున్న చరిత్ర చంద్రబాబునాయుడి సొంతం. కనుక ప్రజలు ఆయన నుంచి ఆచరణాత్మక పరిపాలన ఆశిస్తున్నారు. అనేక చిక్కులు, సవాళ్లను దాటుకుంటూ ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వడివడిగా అడుగులు వేస్తూ ఓ నూతన అధ్యాయాన్ని లిఖించడానికి ముందుకు సాగుతున్నారు.

• సి. రామచంద్రయ్య
శాసనమండలి మాజీ సభ్యులు

శాపంగా మారిన పరీక్షా వ్యవస్థ

దేశంలో ఉన్నత విద్యలో ప్రవేశానికి ఏర్పరుచుకున్న పరీక్షా వ్యవస్థ లోపభూయిష్టమై విద్యార్థి లోకానికి శాపంగా మారింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యం వల్ల పలు పరీక్షల వాయిదాలు, రద్దులతో విద్యా సంవత్సరానికి, విద్యార్థుల కష్టానికి, తల్లిదండ్రుల ఆర్థిక స్థితికి తగులుతున్న దెబ్బల తీవ్రత గణింపలేనిది. లక్షలాది విద్యార్థులు రాసిన యూజీసీ నెట్ పరీక్ష ఒకటి రద్దు కాగా, రాయబోయేది మరొకటి వాయిదా పడింది. ఇప్పుడు నీట్ పీజీ ప్రవేశపరీక్ష ఆఖరు నిమిషంలో వాయిదా పడింది.

మొదట నీట్ పరీక్షలో బయట పడ్డ తీవ్ర లోపాలు సుప్రీంకోర్టులో బాధితులు కేసు వేసే వరకూ ప్రభుత్వాన్ని కదిలించలేదు. తప్పులేమీ జరగలేదని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు కొన్ని చోట్ల మాత్రమే అలా జరిగాయని అంటున్నది. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరపడానికి సూచనలు కోరుతూ నిపుణుల కమిటీ ఏర్పాటు చెయ్యడం ముదావహం, అయినా అదొక్కటే సరిపోదు. తప్పు చేసిన వారికి, ఉదాసీనత చూపించిన వారికి శిక్ష పడాలి. లక్షలాది విద్యార్థులు వారి విలువైన సమయాన్ని, ధనాన్ని... సన్నద్ధత కోసం కోల్పోవడానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. దేశమంతా ఒకేసారి పరీక్షల నిర్వహణ సాధ్యం కాదంటే, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం జరుపుకొనేలా విధానం మార్చాలి. అవకతవకలు ఏ స్థాయిలో జరిగినా అది విద్యార్థులందరికీ అన్యాయం జరిగినట్టే. ముందు ముందు అలా జరగకుండా చూడడమే కాదు, ఎట్టి పరిస్థితుల్లోనూ జరిగే అవకాశమే లేదు అన్న రీతిలో విధానాన్ని సంస్కరించాలి. ఆ నిబద్ధత చూపుతున్నట్టు ప్రభుత్వం కనిపించాలి. విద్యార్థి ఒక్క సెకను ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించమని బీరాలు పలుకుతున్నపుడు, ఆ పరీక్షను నిర్వహించడంలో చిన్న తప్పు కూడా జరగదు అన్న భరోసా కూడా ఇవ్వాలి. విద్యార్థి ఫెయిల్ అయితే ఆ నష్టం పరిమితం. విద్యావ్యవస్థ ఫెయిల్ అయితే అది అపారం.

– డి.వి.జి శంకరరావు

కొమ్మకొమ్మకో కోక

కొమ్మకొమ్మకో సన్నాయి.. వాటికి కోటి రాగాలు ఉన్నాయో లేదో కానీ.. ఇక్కడి కొమ్మల రెమ్మరెమ్మకో అందం.. సీతాకోకమ్మల రంగుల సోయగమే. హరివిల్లులోని వర్ణాలను వయ్యారాల వింజామరలుగా మరల్చుకుని.. రెక్కలు విదుల్చుతూ.. అటూ ఇటూ తిరుగుతూ ఈ సీతాకోకచిలుకలు చేసిన అల్లరి చూస్తే.. అహో ఆ సొగసు వర్ణించతరమా..! సోమవారం వర్షం కురిసిన వేళ పెదపులిపాకలో గుంపులుగా సాక్షాత్కరించిన ఈ సీతాకోకచిలుకలు జీవ వైవిధ్యంలోని మాధుర్యాన్ని తెలియజేశాయి.





● ప్రమాణ శ్రీకారం

విద్యాధరపురం, జూన్ 24 : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం పార్లమెంట్ హాల్లో ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. చిన్నితో ఈ ప్రమాణస్వీకారం చేయించారు.



● బాధ్యతల స్వీకారం

ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రిగా కొల్లు రవీంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయం మూడో బ్లాకులోని మంత్రి పేషీలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కుటుంబ సభ్యులు, అధికారుల సమక్షంలో ఆయన ఫైల్‌పై సంతకం చేశారు.

మళ్లీ పెరిగిన డయేరియా కేసులు



జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

* జగ్గయ్యపేటలో కలవరం * కొత్తగా 15 మందికి వ్యాధి లక్షణాలు

జగ్గయ్యపేట, జూన్ 24 : జగ్గయ్యపేట నియోజకవర్గంలో మళ్లీ డయేరియా కేసులు పెరిగాయి. ఈ వ్యాధి లక్షణాలతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ 15 మంది జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేరగా, ఐదుగురిని విజయవాడ రిఫర్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న 19 మందిని డిశ్చార్జి చేశారు. కొత్తగా చేరిన కేసుల్లో జగ్గయ్యపేట పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల వారున్నారు. ఆర్టీసీ కాలనీకి చెందిన ఎం.కృష్ణలత (31), చెరువు బజార్‌కు చెందిన ప్రణయ్ (3), ఎం.విజయలక్ష్మి (24), చిల్లకల్లుకు చెందిన వి.సైదా (40), బూదవాడకు చెందిన బి.మంగ (70), జి.సరోజ (25), పి.కార్తీ (11), పి.కల్యాణి (34), అన్నవరానికి చెందిన బి.ధనమ్మ (25), వత్సవాయి మండలం పెదమోదుగపల్లి గ్రామానికి చెందిన వై.రామారావు (30), డి.నరసింహారావు (40), రావిరాలకు చెందిన వై.బుజ్జి, మంగొల్లుకు చెందిన జి.సిద్దు (12), ముక్త్యాలకు చెందిన జె.ఎస్తేరు (5) ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసినీ, డీసీహెచ్‌ఎస్ బీసీకే నాయక్, డీపీఎంవో డాక్టర్ నవీన్ పర్యవేక్షణలో డాక్టర్లు స్నేహ, సమీరా, బాలాజీ, వాసంతి, అనిల్‌కుమార్, విద్యాసాగర్ సేవలందిస్తున్నారు.

సముద్ర దొంగలెవరు?

సముద్ర మట్టానికి 10-20 కిలోమీటర్ల లోతులో ఉండే సీ ఫ్యాన్స్‌ను బయటకు తీసుకొస్తుందెవరు..? వెళ్లినవారు గజ ఈతగాళ్లా... స్క్యూబా డైవర్లా..? అసలు సీ ఫ్యాన్స్‌కు నగరంలో అంత డిమాండ్ ఉందా..?
సీ ఫ్యాన్స్ స్మగ్లింగ్ కేసులో అటవీశాఖ అధికారుల ముందు మెదులుతున్న ప్రశ్నలివి. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టడానికి నిందితుడ్ని కస్టడీకి కోరుతున్నారు.



'సీ ఫ్యాన్స్' స్మగ్లింగ్ కేసులో అనేక అనుమానాలు



శ్రీనివాసరావు నుంచి స్వాధీనం చేసుకున్న సీ ఫ్యాన్స్

- సముద్ర గర్భంలో 10-20 కిలోమీటర్ల లోతులో సీ ఫ్యాన్స్
- సాధారణ వ్యక్తులు వెళ్లే అవకాశం తక్కువ
- కేసులో స్క్యూబా డైవర్ల పాత్ర ఉన్నట్టు అనుమానం
- కట్టుకథలు వినిపిస్తున్న నిందితుడు శ్రీనివాసరావు
- కస్టడీ కోరుతున్న అటవీ శాఖ అధికారులు



శ్రీనివాసరావు

- సూత్రధారుల కోసం లోతైన విచారణ

విజయవాడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : సముద్రగర్భంలో అంతరించిపోతున్న జాతి జాబితాలో ఉన్న సీ ఫ్యాన్స్‌ను బయటకు తీసుకొచ్చి, ఫొటోఫ్రేముల్లో అమర్చి, విక్రయించి, లక్షలాది రూపాయలు వెనుకేసుకుంటున్న ఎస్.శ్రీనివాసరావు అనే వ్యక్తిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే, సీ ఫ్యాన్స్‌ను సముద్ర గర్భం నుంచి తీసుకొస్తున్న వారు ఎవరన్నది తెలియలేదు. ఇందుకోసం ఒక మాఫియా పనిచేస్తోందని అధికారులు అనుమానిస్తున్నారు. నిందితుడు శ్రీనివాసరావుకు ఈ మాఫియాతో ఎలా లింకులు ఏర్పడ్డాయో తెలుసుకునే పనిలో అటవీశాఖ అధికారులు ఉన్నారు. అయ్యప్పనగర్‌లోని అక్షయనిధి షాపులో శ్రీనివాసరావును పట్టుకున్నాక అధికారులు చాలాసేపు విచారణ చేశారు. ములుగు జిల్లాలోని మేడారం నుంచి సీ ఫ్యాన్స్ తీసుకొస్తున్నట్టు అతను చెప్పాడు. కానీ, ఇందులో వాస్తవం లేదని అధికారులు అంటున్నారు.

త్వరలో కస్టడీ పిటిషన్

సీ ఫ్యాన్స్ కేసులో నిందితుడు శ్రీనివాసరావుకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. జలరాశులను బయటకు తీసుకొచ్చే ముఠా వివరాలు తెలియాలంటే శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించిన పిటిషన్‌ను కోర్టులో దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. కనీసం వారం పాటు శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. ఏడాదిన్నరగా ఈ వ్యాపారం చేస్తున్నానని నిందితుడు అధికారులకు చెప్పాడు. ఇందులోనూ ఎలాంటి వాస్తవం లేదని అధికారులు అనుమానిస్తున్నారు. నిందితుడి బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేశారు. అందులో ఏ మేరకు నిల్వలు ఉన్నాయో అధికారులు సోమవారం తేల్చనున్నారు. మరోపక్క నిందితుడి సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా కాల్‌డేటా రికార్డ్ (సీడీఆర్)ను పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు.

అధికారులకు సైతం బెదిరింపులు

అయ్యప్పనగర్‌లో అక్షయనిధి షాపులో సోదాలు చేస్తున్నప్పుడు నిందితుడు శ్రీనివాసరావు అటవీశాఖ అధికారులను బెదిరించాడు. ఇంటి కింది భాగంలో షాపు ఉండగా, పై అంతస్తులో వన్యప్రాణులు, జలరాశులకు సంబంధించిన భాగాలు ఉన్నాయి. వాటిని సీజ్ చేస్తున్న సమయంలో ఓ అధికారిని బెదిరించినట్టు తెలిసింది. క్షుద్రపూజలు చేయించి పతనం చేస్తానని హెచ్చరించినట్టు సమాచారం. కాగా, శ్రీనివాసరావును కలవాలంటే 48 గంటల ముందు అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. సాధారణ అపాయింట్‌మెంట్‌కు రూ.500 ధర నిర్ణయిస్తే, అత్యవసర అపాయింట్‌మెంట్‌కు రూ.1,500-రూ.2వేల వరకు వసూలు చేస్తారు.

సీ ఫ్యాన్స్ అంటే..

మన రాష్ట్రంలో కృష్ణా, నెల్లూరు, కాకినాడ, బాపట్ల జిల్లాల్లో సముద్రతీర ప్రాంతం ఉంది. ఈ ప్రాంతాల్లో సీ ఫ్యాన్స్ ఉండవని వైల్డ్‌లైఫ్ జస్టిస్ కవిఏషన్ అధికారులు చెబుతున్నారు. ఈ తరహా జలరాశులు అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీప్, రామేశ్వరం, తుత్తుకూడి, గుజరాత్ ప్రాంత సముద్రగర్భంలో మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. ఇవి సముద్రగర్భానికి 10-20 కిలోమీటర్ల లోతులో ఉంటాయి. ముఖభాగం నేలకు అంటుకుని ఉంటుంది. శరీర భాగమంతా మొక్క మాదిరిగా పెరుగుతుంది. దానిద్వారా సీ ఫ్యాన్స్ ఆహారాన్ని తయారు చేసుకుంటాయి. దీన్ని పాలిప్స్‌గా పిలుస్తారు. ఈ సీ ఫ్యాన్స్ గుంపులుగా ఉంటాయి. మెరైన్ పరిభాషలో ఆ ప్రాంతాన్ని ఒక కాలనీగా వ్యవహరిస్తారు. వాటిని పైకి తీసుకురావడానికి సముద్రంలో చాలా లోతుకు వెళ్లాల్సి ఉంటుంది. గజ ఈతగాళ్లు, సాధారణ వ్యక్తులెవరూ అక్కడికి వెళ్లలేరు. స్క్యూబా డైవర్లు మాత్రమే వెళ్లగలరని అధికారులు భావిస్తున్నారు. చేపల వేటకు ఉపయోగించే వలలతో సీ ఫ్యాన్స్‌ను బయటకు తీసుకొచ్చారని తెలుస్తోంది. నిందితుడు శ్రీనివాసరావు నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రిలో ఈ వలలు ఉండడం గమనార్హం. ఈ వలలతో సముద్రగర్భంలోని సీ ఫ్యాన్స్ నివాసం ఉంటున్న ప్రదేశాలను ఖాళీ చేస్తున్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సీ ఫ్యాన్స్‌కు నీటిలో ఉన్నంత వరకే జీవం ఉంటుంది. బయటకొచ్చాక నిమిషాల వ్యవధిలో చనిపోతాయి. ఆ తర్వాత రెండు, మూడు వారాలపాటు వీటిని ఎండబెడతారు. అప్పుడది ఎండిన ముళ్లకంపలా కనిపిస్తుంది. ఇలా ఆరిన సీ ఫ్యాన్స్‌ను ఫ్రేముల్లో అమర్చి ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

కుర్చీని వదలరు..!



ఏపీటీడీసీలో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

- సీఈ రాజీనామా.. వెంటనే తిరిగి విధులకు హాజరు
- మళ్లీ పోస్టింగ్ ఆర్డర్ వస్తుందట.. ఉద్యోగం చేస్తారట..!
- నిన్నటివరకు వైసీపీ సైడ్.. నేడేమో టీడీపీ వైపు..!
- ఐదేళ్లలో పర్యాటక శాఖలో ఒక్క పనిచేయని ఘనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో కుర్చీలకు అతుక్కుపోయిన వారిని కదిలించాల్సిన సమయమొచ్చింది. రిటైరైన వారందరితో రాజీనామాలు చేయించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసినా ఇక్కడ పనిచేసే వారికి లెక్క లేకుండాపోయింది. తాజాగా విడుదలైన జీవో ప్రకారం ఏపీటీడీసీలో రిటైరై పనిచేస్తున్న 18 మంది తక్షణం రాజీనామా చేయాల్సి ఉంది. అందరూ రాజీనామాలు అయితే చేశారు కానీ, మళ్లీ పోస్టింగులు తెచ్చుకుంటామన్న ధీమాతో ఉన్నారు.

ప్లేటు ఫిరాయించిన చీఫ్ ఇంజనీర్

ఏపీటీడీసీలో చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా రాజీనామా చేసిన అధికారి తిరిగొచ్చి ఆ సీటులోనే కూర్చున్నారు. రాజీనామా చేసిన అధికారి ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మళ్లీ విధుల్లో చేరారు. మంత్రి, స్పీకర్ పేర్లు చెబుతూ మళ్లీ అదే సీటుకు అతుక్కుపోవాలని చూస్తున్నారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి అంటకాగి, పర్యాటకాభివృద్ధికి అవరోధంగా నిలిచిన ఈ చీఫ్ ఇంజనీర్ తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్లేటు ఫిరాయించారు. టీడీపీ నేతలు తెలుసంటూ కవర్ చేస్తున్నారు. అంతేకాదు.. అన్నవరం ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక పనిమీద ఆయన సోమవారం ఢిల్లీకి కూడా వెళ్లారు. ఈయనకు నెలకు రూ.2 లక్షల జీతం. ప్రతినెలా రూ.2 లక్షలకు తగ్గకుండా మెడికల్ బిల్లులు పెడతారు. ఇక దుబారా అంతా ఇంతా కాదు. ఈయన ఆధ్వర్యంలో ఐదేళ్లలో ప్రసాద్ స్కీమ్‌లో కానీ, స్వదేశ్ దర్శన్ స్కీమ్‌లో కానీ ఒక్క పని కూడా జరగలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రుషికొండ విధ్వంసం దగ్గర నుంచి ప్రతి పనిలోనూ ఆయన ప్రభుత్వానికి తాబేదారుగా వ్యవహరించారు. చీఫ్ ఇంజనీర్‌గా అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సిన అధికారి.. పర్యాటక యూనిట్లన్నింటినీ పగలగొట్టించారు. పనులు ఆగిపోవడంతో సందర్శకులు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ అధికారి గతంలో ఆర్‌అండ్‌బీ ఈఈగా ఉన్నప్పుడు రాజమండ్రి పుష్కరాల్లో పనిచేశారు. ఆ సమయంలో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఘాట్లకు సంబంధించిన పనుల నిర్లక్ష్యంపై అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఏపీటీడీసీలో కీలక అధికారిగా మారిపోయారు. మరో అధికారి వాటర్ ఫ్లీట్ జీఎంగా వ్యవహరిస్తున్నారు. ఈయన అయితే ఏకంగా హరిత బెర్మ్‌పార్కులోనే ఉంటున్నారు. పర్యాటక సూట్‌లో ఉంటూ సకల భోగాలూ అనుభవిస్తున్నారు. బదిలీల్లో ఈయన ఇష్టానుసారంగా చక్రం తిప్పారు. తన అనుయాయులను కీలక స్థానాల్లో నియమించడం, కానివారిని దూరప్రాంతాలకు పంపించేయటం ఈయనకు వెన్నతో పెట్టిన విద్య.



పర్యటన

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సోమవారం నగరంలో పర్యటించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్ రెల్లిస్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి నీటి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలను ఆరా తీశారు.

మీరు చెప్పినట్టు చేయలేం!

- మేయర్‌కు స్పష్టం చేసిన సిటీప్లానర్
- అనధికార కట్టడాల విషయంలో రగడ
- అధికార మార్పిడితో ఆగిన వసూళ్లు
- మేయర్ వర్గంలో అసహనం

బదిలీపై వెళ్లిపోతా.. మీకు చేతనైంది చేసుకోండి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అనధికార కట్టడాల విషయంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రగడ నడుస్తోంది. ఏకంగా మేయర్ భాగ్యలక్ష్మికి, వీఎంసీ సిటీప్లానర్‌కు నడుమ ఈ విషయంలో తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకోవడం గమనార్హం. 2021లో వీఎంసీ ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గం కొలువుదీరింది. అప్పటి నుంచి వైసీపీ కార్పొరేటర్లు నగరంలో ఇష్టారాజ్యంగా దందాలు నడిపించారు. ఎక్కడ చిన్నపాటి నిర్మాణాలు జరిగినా అక్కడ వాలిపోయి వసూళ్లు చేపట్టారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు టార్గెట్లు పెట్టి మరీ వసూళ్లు చేసేవారు. దీనిపై అప్పట్లోనే వీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో తీవ్ర కలకలం రేగింది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దిగిపోయి, టీడీపీ ప్రభుత్వం కొలువుదీరింది. వీఎంసీ పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేలే గెలుపొందారు. దీంతో వీఎంసీలోనూ వైసీపీ హవాకు చెక్ పడింది. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి వచ్చే నెలవారీ మామూళ్లు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఇటీవల నగరంలోని అక్రమ కట్టడాలపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఇంకా వైసీపీ నాయకులు, మాజీమంత్రి వెలంపల్లి అనుచరులు అక్రమ కట్టడాల నుంచి వసూళ్ల దందా నడిపిస్తున్నారంటూ ప్రచురితమైన కథనాలపై కలకలం రేగింది. టౌన్‌ప్లానింగ్ సిబ్బందే ఉద్దేశపూర్వకంగా తమపై పత్రికల్లో కథనాలు రాయిస్తున్నారంటూ పలువురు వైసీపీ కార్పొరేటర్లు, మేయర్ భావించారు.

మేయర్ వర్సెస్ సిటీ ప్లానర్

మేయర్‌కు, సిటీప్లానర్‌కు నడుమ సోమవారం తీవ్రస్థాయిలో వాగ్వాదం నడిచినట్లు సమాచారం. అక్రమ కట్టడాల విషయంలో ఫోన్ చేసిన మేయర్‌కు సిటీప్లానర్ తొలుత సౌమ్యంగా సమాధానమిచ్చారు. కానీ, మేయర్ రెచ్చగొట్టేలా మాట్లాడుతుండటంతో ఆయన తీవ్రస్థాయిలోనే సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. 'మా ఒత్తిళ్లు మాకున్నాయి. నగరంలో టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇంకా మీరు చెప్పినట్టు చేయడం సాధ్యం కాదు' అని సిటీప్లానర్ స్పష్టం చేసినట్లు సమాచారం. తాను త్వరలోనే బదిలీపై వెళ్లిపోతున్నానని, ఈ నాలుగు రోజులు తనపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని, ఇంకా కాదు కూడదంటే చేతనైంది చేసుకోండని సిటీప్లానర్ స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. ఈ తాజా పరిణామాలపై మేయర్, వైసీపీ కార్పొరేటర్లు తీవ్ర అసహనంతో ఉన్నారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీజేఏసీ అమరావతి నేతలు

మహిళా ఉద్యోగులకు సత్వర న్యాయం..

▸▸ డీజీపీని కోరిన ఏపీజేఏసీ అమరావతి నేతలు

వన్‌టౌన్, జూన్ 24 : ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులపై అనుచితచర్యలకు పాల్పడిన వారిపై ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని, ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో పనిచేసే పరిస్థితి కల్పించాలని డీజీపీ ద్వారకా తిరుమలరావును ఏపీజేఏసీ అమరావతి నేతలు కోరారు. రామవరప్పాడు రింగ్‌లోని కె.హోటల్‌లో డీజీపీ ద్వారకా తిరుమలరావును సోమవారం ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ, అనుబంధ సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ ఛైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కోశాధికారి వీవీ మురళీకృష్ణనాయుడు సంయుక్తంగా మాట్లాడుతూ, మహిళా ఉద్యోగులకు ఆత్మస్థైర్యం కల్పించేలా వేధింపుల కేసుల్లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. అనుబంధ సంఘాల నేతలు, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, హోంగార్డు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.గోవింద్, కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



మల్లవల్లిలోని పారిశ్రామికవేత్తలతో సమావేశమైన యార్లగడ్డ

పారిశ్రామిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

▸▸ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, జూన్ 24 : మల్లవల్లిలో నూతన పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గురునానక్ నగర్లోని తన కార్యాలయంలో మల్లవల్లిలోని పారిశ్రామికవేత్తలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన పరిశ్రమలు వచ్చేందుకు ఆటంకాలు తెలుసుకున్నారు. ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని, నాణ్యతగల విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఫైర్ స్టేషన్, ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని వారు కోరారు. నీటి సమస్యను త్వరగా పరిష్కరించేలా చూడాలన్నారు. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. సానుకూలంగా స్పందించిన యార్లగడ్డ పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కంపెనీకి అనుమతుల కోసం ఏపీఐఐసీ కార్యాలయానికి ఎన్నిసార్లు తిరిగినా కొర్రీలు పెట్టి తిప్పడం జరుగుతుందన్నారు. పారిశ్రామికవేత్తలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని యార్లగడ్డ పేర్కొన్నారు. పలువురు పారిశ్రామికవేత్తలు, అశోక్ లేల్యాండ్ కంపెనీ ప్రతినిధి పాల్గొన్నారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న నిర్మాతలు

గన్నవరంలో సినీ నిర్మాతల సందడి

గన్నవరం, జూన్ 24 : గన్నవరం విమానాశ్రయంలో సినీ నిర్మాతల సందడి నెలకొంది. నగరంలో ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో సోమవారం ఇక్కడికి విచ్చేశారు. సినీనిర్మాతలు చలసాని అశ్వనీదత్, అల్లుఅరవింద్, దగ్గుబాటి సురేశ్‌బాబు, యార్లగడ్డ సుప్రియ, యర్నేని నవీన్, టీజీ విశ్వప్రసాద్, ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు విచ్చేశారు. అనంతరం వారు రోడ్డు మార్గాన విజయవాడకు తరలివెళ్లారు.

మంత్రి కొల్లుకు నెట్టెం, యార్లగడ్డ శుభాకాంక్షలు



జగ్గయ్యపేట, జూన్ 24 : రాష్ట్ర మైన్స్, ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొల్లు రవీంద్రను సోమవారం రాష్ట్ర సచివాలయంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కీలక శాఖల్లో సచివుడిగా సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



మచిలీపట్నం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కలెక్టర్ చాంబరులో కలెక్టర్ డీకే బాలాజీని సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కలెక్టరేట్‌కు వచ్చిన మండలి బుద్ధప్రసాద్‌కు డీఆర్వో కె.చంద్రశేఖరరావు పూలమొక్కను అందజేశారు. సమాచార పౌరసంబంధాలు, గృహనిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథిని తాడిగడపలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సమాచారశాఖ డీడీ ఎం.వెంకటేశ్వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

పేరంటాలమ్మ సేవలో మురళీమోహన్



గుణదల, జూన్ 24 : రామవరప్పాడులో పేరంటాలమ్మను మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ దర్శించుకున్నారు. సోమవారం తన జన్మదినం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చినట్టు మురళీమోహన్ తెలిపారు. ఆలయానికి వచ్చిన మురళీమోహన్‌ను ఈవో పాతూరి లోకేశ్వరి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి శేషవస్త్రం ప్రసాదం అందజేశారు. అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

27న గురుకులాల్లో ఖాళీల భర్తీకి ప్రవేశ పరీక్ష

వన్‌టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతులలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 27వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి కృష్ణాజిల్లాల సమన్వయ అధికారి సుమిత్రాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోగా ఆయా పాఠశాలలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశపరీక్ష ఉంటుందని మెరిట్, రిజర్వేషన్ ఆధారంగానే ఖాళీలు భర్తీ ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా ఏఏ తరగతులలో ఏఏ గురుకుల పాఠశాలల్లో ఖాళీలు ఉన్నవి ఆమె వివరించారు.

మక్కపేటలో డయేరియా కలకలం!

వత్సవాయి, జూన్ 24 : మండలంలో డయేరియా కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సోమవారం గోపినేనిపాలెం నుంచి సపావతు సంధ్య, రామావతు పార్వతి, భీమవరం నుంచి బీమాల సునీతలు మక్కపేటలో ప్రత్యేక వైద్య శిబిరంలో చేరారు. వైద్యాధికారిణి అలేఖ్య ఆధ్వర్యంలో ఏఎల్‌పీహెచ్‌వో సునీత, సీహెచ్‌వో మల్లికార్జునరావు, ఎంపీహెచ్‌వో ఉషారాణిలు వైద్య సేవలందిస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది డ్రెయినేజీ పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. మండలంలో ఇప్పటి వరకు 25 మందికి వ్యాధి లక్షణాలు బయటపడగా 10మందిని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి పంపినట్టు మిగిలిన వారికి మక్కపేట, వత్సవాయిల్లో చికిత్స అందిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షర్మిత తెలిపారు.

గుంటుపల్లిలో ఇద్దరికి లక్షణాలు..

ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి గ్రామంలో ఇద్దరు డయేరియా లక్షణాలతో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్టు తెలుస్తోంది. డయేరియా భయంతో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. వాతావరణంలో మార్పులు, కలుషిత నీరు తాగడం వల్లే అతిసార బారిన పడినట్టు తెలుస్తోంది.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు



రోగులతో మాట్లాడుతున్న జిల్లా సీపీఐ నేతలు

మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలి

▸▸ సీపీఐ నేతల డిమాండ్

జగ్గయ్యపేట : డయేరియా బాధితులను సీపీఐ జిల్లా నేత డి.శంకర్ సోమవారం పరామర్శించారు. జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో సుహాసిని ఇతర అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, డయేరియా మృతులకు రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట పురపాలకసంఘ పరిధిలో పురాతన పైపులైన్లను మార్చి కొత్తవి వేయాలని కోరారు. పురపాలకసంఘం స్పందన దారుణంగా ఉందని విమర్శించారు. పార్టీ నేతలు శివాజీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుల చెరలో చేపల చెరువు!

▸▸ వేలం నిర్వహిస్తే వీఎంసీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం ▸▸ ఐదేళ్లుగా జేబులు నింపుకుంటున్న వైసీపీ నేతలు

పాయకాపురం, జూన్ 24 : వీఎంసీ పరిధిలోని కుందావారి కండ్రిక ప్రాంతంలో అక్రమార్కుల చెరలో ఉన్న చేపల చెరువుపై అధికారులు దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గత వైసీపీ పాలనలో ఐదేళ్లుగా ఎలాంటి టెండర్లు లేకుండా పార్టీ నేతలు చేపల చెరువును స్వాధీనం చేసుకుని లక్షలాది రూపాయలు జేబుల్లో నింపుకున్నారని ఆరోపిస్తున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాకు చేరాల్సిన సొమ్ము ప్రైవేటు వ్యక్తుల పరమవుతున్నా నాటి పార్టీ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చెరువును వేలం వేసేందుకు సాహసించలేదన్నారు. కొత్త ప్రభుత్వం రావడంతో అధికారులు అక్రమార్కుల చెర నుంచి చెరువును విడిపించి వేలం నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చాలని కోరుతున్నారు.

చెరువు నేపథ్యం..

స్థానిక 64వ డివిజన్ కుందావారి కండ్రికలోని సర్వే నెం.17లో 33 ఎకరాల చెరువు ద్వారా ఆయకట్టు రైతుల సాగుకు నీరందుతోంది. అయితే చెరువులో అనధికారికంగా వైసీపీ నేతలు చేపల సాగు చేస్తున్నారు. సాధారణంగా చెరువుల్లో చేపల సాగు చేస్తే అధికారులు ఏటా బహిరంగ వేలం నిర్వహించి పాడుకున్న వారికే చెరువును అప్పగించాలి. కానీ వైసీపీ నేతల ఒత్తిళ్లతో నాడు అధికారులు వేలం నిర్వహించలేదు. దీంతో యథేశ్చగా చేపల పెంపకం చేపట్టి ఏటా రూ.లక్షల్లో దోచేశారు.



సాగునీటి కోసం వినియోగించే కుందావారి కండ్రిక చెరువు

ఏటా రూ.20 లక్షల ఆదాయం

33 ఎకరాల చేపల చెరువుకు వేలం నిర్వహిస్తే ఏటా వీఎంసీకి రూ.20 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనాలున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ, వీఎంసీ అధికారులు దృష్టి పెట్టకపోవటంతో ఐదేళ్ల పాటు వేలం లేకుండానే వైసీపీ నేతలు చేపల సాగుతో అక్రమంగా సంపాదించారు. ప్రభుత్వం మారినా చేపల చెరువును అక్రమంగా నిర్వహిస్తున్న వ్యక్తి హవా కొనసాగిస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును స్వాధీనపరచుకుని వేలం నిర్వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌కు ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్సు, జూన్ 24 : కర్నూలు జిల్లా డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో జూలై 13, 14వ తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారుల ఎంపికలు పూర్తిచేసినట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లో సర్‌విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఎంపికను చేపట్టినట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి, ట్రెజరర్ కె.రమేష్, జిల్లా పరిశీలకులు పి.రవికుమార్‌లు హాజరయ్యారన్నారు. ఎం.తీర్థు సమ్‌దేవ్, పి.కిరణ్, వి.గిరిష్, పి.అభిషేక్‌సాయి, బి.జిష్ణుష్, వై.రోహిత్ మల్లిఖార్జున్, ఎస్.దేవ గణేష్, కె.శక్తిధార్, ఎం.శరత్, వి.దుర్గాతేజ, సీహెచ్.భానుశ్రీ, ఎస్ పావని సరయు, యు.ప్రేమామృత, కె.బూరీశ్వర, ఎం.యజ్ఞసాయి, ఎం.రామ్‌మణికంఠ, బి.పృధ్వీరాజ్, ఎం.సాత్విక్, కె.కీర్తన, టి.గురుచరణ్, టి.షణ్ముకరాఘవ, జీసీహెచ్ నవశ్రీ, డి.రోమన సాహిహిరా, యానా జూన్, ఎ.సత్య సాన్వి, ఎల్.సాయి తన్విశ్రీ, ఎం.సంజన, ఎన్.హర్షిక, బి.దశ్వంత్, ఆకాశ్, జి.జతిన్, కె.వినయ్, వై.రుత్విక్‌రాజ్, టి.తారక ప్రవీణ్, కేఆర్‌వీ ప్రసాద్, కె.నిహారిక, ఎం.కేతనశ్రీ, కొంగర సింధుర, మాల్వాలు ఎంపికయ్యారన్నారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నాం

▸▸ గ్రీవెన్స్ వేదికలో రిటైర్డ్ ఉద్యోగుల గోడు

మచిలీపట్నం టౌన్, జూన్ 24 : తమ సమస్యలు పరిష్కరించాలంటూ నాలుగేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని బాధితులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి విన్నవించుకున్నారు. మార్చి 4 తరువాత నాలుగు నెలల అనంతరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదికలో రిటైర్డు బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు మీడియా ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. పోతేపల్లిలో పది ఎకరాల భూమిలో 26 మంది ప్లాట్లు కొనుగోలు చేశామని, ఆ భూములు అసైన్డ్ కేటగిరిలో ఉన్నందు వల్ల విక్రయించుకోలేకపోతున్నామని రిటైర్డు బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు బి. జయప్రకాష్, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు, బి.సురేశ్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

- ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, టైలు, బ్యాడ్జీలతో ఇష్టారాజ్యంగా పేదపిల్లల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయంలో వైఎస్‌ఆర్ విగ్రహ ఏర్పాటుకు పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించారని, దీనిపై విచారణ జరపాలన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కృష్ణా విశ్వవిద్యాలయ భవన నిర్మాణానికి రూ. 71 కోట్లు మంజూరు చేశారన్నారు. బాలికలకు హాస్టల్ నిర్మించలేకపోవడం వల్ల అవస్థలకు గురవుతున్నారన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

- తాగునీరు, సాగునీరు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేత గౌరిశెట్టి నాగేశ్వరరావు, మలిశెట్టి శివప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మీడియా ముందు రైతు సంఘ నాయకులు మాట్లాడారు. భారీ వర్షాల సమయంలో 2020 ఏప్రిల్‌లో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో నష్టపోయిన 4500 మంది రైతులకు రూ.3 కోట్ల బకాయిలు చెల్లించాలని, దీనిపై నాలుగేళ్లుగా కలెక్టరేట్‌కు తిరుగుతూనే ఉన్నామన్నారు. నూతన ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.
- గుడివాడ పట్టణంలో నెహ్రూచౌక్, మూడెడ్ల రామారావు సెంటర్‌లో బారికేడ్లు పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫ్యూచర్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రతినిధి మురళీకృష్ణ కోరారు.

డీఎస్సీ (ఎస్‌జీటీ) ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, జూన్ 24 : వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆదేశాల మేరకు ఏపీ డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్షకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు బీసీ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ ఎన్టీఆర్ జిల్లా డైరెక్టర్ కుమారి ఇ.కిరణ్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందని ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందని తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలు మించని వారు ఇందుకు అర్హులని సంబంధిత సర్టిఫికెట్‌లను నిబంధనల ప్రకారం విజయవాడ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు విజయవాడ పండిపీపురం రోడ్డు నెంబర్-8లో గల అశోక్‌నగర్‌లోని స్టడీ సర్కిల్ కార్యాలయంలో గాని 950094349, 7981448836 నెంబర్‌లలో గాని సంప్రదించవచ్చన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలపై వినతి

మొగల్రాజపురం, జూన్ 24 : ప్రజా పంపిణీ వ్యవస్థలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రేషన్ డీలర్ల సంఘం నేతలు వినతి పత్రం రూపంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అందజేశారు. శనివారం అశోక్‌నగర్‌లోని పౌరసరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రికి డీలర్ల సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ప్రజాపంపిణీలో ఎండీయూ వ్యవస్థ చట్ట విరుద్ధంగా ప్రవేశపెట్టారని దీనిని పునఃపరిశీలించాలని, సంక్షేమ నిధి ఏర్పాటు, 2021లో డీలర్ల నుంచి తీసుకున్న గన్నీ సంచులకు డబ్బులు ఇప్పించాలని, కరోనాతో చనిపోయిన డీలర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని తదితర అంశాలను వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్, విజయవాడ వర్కింగ్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల పునరుద్ధరణ

రైల్వేస్టేషన్, జూన్ 24 : విజయవాడ రైల్వే డివిజన్‌లోని నిడదవోలు-కడియం మధ్య ట్రాఫిక్ నిర్వహణ కారణంగా రద్దుచేసిన పలు రైళ్ళను మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నారు. 12805 విశాఖపట్నం లింగపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నారు. 12806 రైలును ఈ నెల 26 నుంచి పునరుద్ధరిస్తున్నారు. 17643 చంగల్‌పట్టు కాకినాడ పోర్టు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి, 17644 ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24 నుంచి పునరుద్ధరిస్తున్నట్టు డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూప్కర్ తెలియజేశారు. 17258, 17257 ఎగువ, దిగువ విజయవాడ-కాకినాడ పోర్ట్ రైలును కూడా పునరుద్ధరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ సంపత్ కుమార్

సమస్యలకు సత్వర పరిష్కారం

వన్‌టౌన్, జూన్ 24 : అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నుంచి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మొత్తం 69 అర్జీలను జాయింట్ కలెక్టర్, డీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయిలకు సమర్పించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా ఉన్న సంపత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్య పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. వినతులను కులంకషగా పరిశీలించి జిల్లా స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని కోరారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా నిర్వహించిన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో రెవెన్యూకు సంబంధించి 31, పోలీసులకు సంబంధించి 9, ఎన్‌ఏయూడీకు సంబంధించి 7, ఏపీఎస్ డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌కు సంబంధించి 5, విద్యావిభాగానికి సంబంధించి 3, ఉపాధి విభాగానికి సంబంధించి 2, ఆరోగ్యానికి సంబంధించి 2, వ్యవసాయానికి సంబంధించి 1, సర్వే సెటిల్‌మెంట్‌కు సంబంధించి 1, డీఆర్‌డీఏ, ఎండోమెంట్, పంచాయితీ రాజ్, తదితర విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ కె.ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు!



మరమ్మతులకు నోచని వేదాద్రి ఎత్తిపోతల పథకం

అన్నదాతకు జలసిరులందించి వ్యవసాయరంగానికి ఆసరాగా నిలిచిన ఎత్తిపోతల పథకాలు బలోపేతం దిశగా అడుగులు పడుతున్నాయి. శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆ దిశగా చొరవ తీసుకోవడంతో మెట్ట రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన పథకాలు సీఎం చంద్రబాబు సహకారంతో తిరిగి జీవం పోసుకోనున్నాయి.

▸▸ మెట్ట రైతుకు ఊరట

▸▸ ఎత్తిపోతలకు తీరనున్న కష్టాలు

▸▸ ఐదేళ్లుగా మరమ్మతులకు నోచని పథకాలు

▸▸ సీఎం చంద్రబాబు దృష్టికి ప్రస్తుత పరిస్థితి

▸▸ సౌమ్య చొరవతో అన్నదాతల హర్షాతిరేకాలు



ధ్వంసమైన పైపులైన్లు

నందిగామ : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సుమారు ఎనభై ఎత్తిపోతల పథకాలు ఉండగా, ఒక్క నందిగామ నియోజకవర్గంలోనే 63 పథకాలు ఉన్నాయి. వీటి ఆయకట్టులో సుమారు 74 వేల ఎకరాల భూమి సాగవుతుంది. 70వ దశకంలో డాక్టర్ కేఎల్‌రావు చొరవతో ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాల నిర్మాణం జరిగింది. పక్కనే కృష్ణా నది పరవళ్లు తొక్కుతున్నా వ్యవసాయానికి చుక్క నీరు పొందలేక రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. ఎత్తిపోతల పథకాలతో ఆయకట్టు రైతుల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి.

- 1995 తరువాత నియోజకవర్గ సాగునీటి వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఎమ్మెల్యేగా ఉన్న దేవినేని వెంకటరమణ ఎత్తిపోతల పథకాల నిర్మాణంపై దృష్టి సారించారు. అప్పట్లోనే రూ.8 కోట్ల వ్యయంతో వేదాద్రి ఎత్తిపోతల నిర్మాణానికి నడుంబిగించారు. ఆయన హయాంలో పలు పథకాలు ప్రారంభమయ్యాయి. ఆయన మరణంతో ఎమ్మెల్యేగా దేవినేని ఉమామహేశ్వరరావు పదేళ్లపాటు కృష్ణా, మునేరు నదులపై ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి కృషి చేశారు. ఫలితంగా నియోజకవర్గంలో 74 వేలఎకరాల భూమి స్థిరీకరించబడింది. తంగిరాల ప్రభాకర్ హయాంలోనూ పథకాల అభివృద్ధి పనులు కొనసాగాయి. పథకాలను రైతు కమిటీలకు అప్పగించినా వాటి అలనా పాలన విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం ఒక కంట కనిపెట్టుకొని ఉండేది.
- గత టీడీపీ పాలనలో పలు పథకాలు మరమ్మతులకు గురికాగా ఆయకట్టుకు నీరందించలేక పోవడంతో అప్పట్లో జలవనరుల శాఖా మంత్రిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు రెండు విడతలుగా 80 కోట్ల రూపాయలతో పథకాలకు మరమ్మతులు చేయించి అన్నదాతలకు ఆసరాగా నిలిచారు. దాంతో కొంతకాలం ఆయకట్టుకు సమర్థవంతంగా నీరందించాయి.

వైసీపీ పాలనలో పథకాలకు గ్రహణం

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఎత్తిపోతల పథకాలకు గ్రహణం పట్టింది. రైతు ప్రభుత్వం అంటూ కోతలు తప్ప ఎత్తిపోతలకు ఆ ప్రభుత్వంలో ఆదరణ లభించలేదు. పథకాలు ఏటేటా దెబ్బతింటున్నా కనీస నిధులు కూడా కేటాయించలేదు. ఫలితంగా యాభైకి పైగా పథకాలు పని చేయడం లేదు. 17వేలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరందించే ప్రతిష్ఠాత్మకమైన వేదాద్రి ఎత్తిపోతల మూతపడింది. అనేక పథకాలలో మోటార్లు మరమ్మతులు లేక నిలిచిపోయాయి. కొన్నిచోట్ల మోటార్లు, విద్యుత్ సరఫరా పరికరాలు చోరీకి గురయ్యాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంఘాలు కూడా అందినకాడికి దోచుకొని పథకాలను మూలనపెట్టాయి.

చంద్రబాబు రాకతో చిగురిస్తున్న ఆశలు



ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులివ్వాలని చంద్రబాబును కోరుతున్న ఎమ్మెల్యే సౌమ్య

మెట్ట ప్రాంతంలో ఏ నియోజకవర్గానికి లేని వనరుగా నందిగామకు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఆ వనరుల పరిరక్షణ ద్వారా రైతుకు అండగా నిలవడం ఎమ్మెల్యేగా సౌమ్య బాధ్యత. సాగునీటి రంగం పట్ల చిత్తశుద్ధి గల చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల శిథిలావస్థకు చేరిన పథకాలకు జీవం పోయడమే తొలి ప్రాధాన్యంగా ఆమె భావిస్తోంది. ఈక్రమంలోనే తొలిగా వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు అంచనాలు రూపొందించి అసెంబ్లీ సమావేశాలలో తన అభ్యర్థనను చంద్రబాబుకు అందజేశారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. వేదాద్రితో ప్రారంభమైన ఈ యజ్ఞం కృష్ణా, మునేరు నదులపై ఉన్న 63 పథకాల మరమ్మతుల వరకూ కొనసాగాలని రైతులు కోరుతున్నారు. అధికారుల అంచనా ప్రకారం నందిగామలోని అన్ని పథకాలు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించాలంటే కనీసం రూ. 100 కోట్లు అవసరమౌతాయని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి సమర్థవంతమైన కమిటీలకు అప్పగిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమౌతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే ఎమ్మెల్యే వెంట తాము కూడా నడిచి తమ విజ్ఞప్తిని చంద్రబాబుకు విన్నవించాలని భావిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

గ్రీష్మితకు అభినందనలు

లబ్బీపేట, జూన్ 24: ఆంధ్రప్రదేశ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19నుంచి 23 వరకు నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని టి.గ్రీష్మిత మూడు స్వర్ణపతకాలు సాధించినట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రీష్మితను డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, కళాశాల యాజమాన్యం తదితరులు అభినందించారు.



నిబంధనలకు విరుద్ధంగా
షటిల్‌కోర్టు నిర్మాణాలు

- ఆంధ్రరత్న పార్కులో 25 అడుగుల మేర రాడ్లు ఏర్పాటు
- అనధికారికంగా విశ్రాంతి గది నిర్మాణం
- వాకర్స్ అసోసియేషన్ పేరుతో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- స్పందించని సంబంధిత అధికారులు




పార్కులో జరుగుతున్న షటిల్‌కోర్టు నిర్మాణాలు

సత్యనారాయణపురం, జూన్ 24: సత్యనారాయణపురం ఆంధ్రరత్న పార్కులో వాకర్స్ అసోసియేషన్ పేరుతో ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా షటిల్‌కోర్టు పేరుతో నిర్మాణాలు చేపట్టారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ స్పందించలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికే పార్కులో అనధికారికంగా విశ్రాంతి గది నిర్మించారు. వైసీపీ నాయకుల అండదండలతో గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడే వన భోజనాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. నగరపాలక సంస్థ పార్కులో కాంక్రీట్ దిమ్మలు వేసి సుమారు 25 అడుగుల మేర రాడ్లు ఏర్పాటు చేశారు. దాని చుట్టూ గ్రీన్ మెస్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని వల్ల దాని పక్కనే వ్యాయామం చేసుకొనే వారికి, పార్కుకు వచ్చేవారికి కనీసం గాలి ఆడే పరిస్థితి లేదు. గతంలో షటిల్ ఆడే వారు మెస్ ఏర్పాటు చేసుకున్నా పది అడుగుల లోపు ఉండేది. కాని ఇప్పుడు 25 అడుగుల నిర్మాణం చేపట్టడంతో పార్కులో గాలి వచ్చే అవకాశం లేదని, గతంలో పార్కులో పంపింగ్ స్టేషన్ నిర్మాణం జరుపుతుంటే అడ్డుకున్నామని, ఇదే నిర్మాణం జరిగితే పార్కుకు వచ్చే వారి సంఖ్య క్రమంగా తగ్గి పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏదైనా ప్రమాదం జరిగితే ....

పార్కులో పిల్లలు, మహిళలు వ్యాయామం చేసుకొనేందుకు పరికరాలు ఏర్పాటు చేశారు. దాని సమీపంలోనే ఈ షటిల్ కోర్టును 25 అడుగుల మేర రాడ్లు నిర్మిస్తున్నారు. ఏదైనా పెద్ద గాలి వస్తే అవి పడిపోతే పెను ప్రమాదం సంభవిస్తుందని తక్షణ నిర్మాణాన్ని ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

ఇప్పటికే విగ్రహం ఏర్పాటు...

వైసీపీ నాయకులు కౌన్సిల్‌లో తీర్మానం చేసి నగరపాలక సంస్థ పార్కులో కొంత భాగంలో విగ్రహం ఏర్పాటు చేశారు. వాకర్స్ అసోసియేషన్ పేరుతో అనుమతులు లేకపోయినా నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు ఏకంగా 25 అడుగుల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయ్యడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే నగర కమిషనర్ పార్కులో జరిగే నిర్మాణాలపైన తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపేదలకు శాశ్వత ఇళ్లు నిర్మిస్తాం

మున్సిపల్ కమిషనర్‌తో కలిసి గుడిసెలను పరిశీలించిన ఎమ్మెల్యే గద్దె



ఆటోనగర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె, కమిషనర్ దినకర్

పటమట, జూన్ 24 : ఇళ్ల లేని నిరుపేదలకు శాశ్వత ఇళ్ల నిర్మిస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్ల వెంబడి, డ్రెయినేజి పక్కన తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న వారికి శాశ్వత గృహాలు నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని ఆటోనగర్ గేటు, ఏపీఐఐసీ కాలనీ, గమేళా పాకలు, కామినేనినగర్ డొంక రోడ్డు ప్రాంతాల్లో రహదారుల పక్కన గుడిసెల్లో ఉండే ప్రాంతాలను కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో ఎటువంటి సౌకర్యాల్లేక రహదారుల్లు,డ్రెయిన్ల వెంబడి ప్రమాదరస్థితుల్లో జీవనం సాగిస్తున్న వారికి పక్కా గృహాలు కేటాయించడానికి 2014-19లో సీఎం చంద్రబాబు హయాంలో ప్రణాళికలు రూపొందించారని, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులన్నింటిని అటకెక్కించిందన్నారు. త్వరలోనే అర్హులైన పేదలందరికీ పక్కా భవనాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, గద్దె రమేష్, సిటీ ప్లానర్ ప్రసాద్, ఈఈ సామ్రాజ్యం, సీఈ ప్రభాకర్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ వసీం బేగ్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

పటమట, జూన్ 24 :

విద్యుత్ తీగలకు మరమ్మతు చేసేందుకు అడ్డుగా ఉన్న చెట్లను నరికివేసేందుకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఓల్డ్ చెక్‌పోస్టు, ఆటోనగర్ గేటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

అంగరంగ వైభవంగా నగరోత్సవం

పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు



పుష్పయాగం చేస్తున్న అర్చకులు



వెస్ట్ డీసీపీ హరికృష్ణను శాలువాతో సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చిట్టినగర్, జూన్ 24: పద్మావతి, గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామి దేవస్థానం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామికి పుష్పయాగం నిర్వహించి, భక్తుల హరినామస్మరణ నడుమ శ్రీవారిని మాడవీధుల్లో ఊరేగించారు. ఉదయం నిత్యహోమం, బలిహరణాదులు, మహాశాంతి హోమం వంటి పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారిని విశేషంగా అలంకరించి చిట్టినగర్ నుంచి కోమల విలాస్ వరకు వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి వచ్చి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శ్రీవారిని దర్శించుకున్న పశ్చిమ జోన్ డీఎస్పీ హరికృష్ణ

పద్మావతి, గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామి దేవస్థానం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారిని పశ్చిమ జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ హరికృష్ణ దర్శించుకొని పూజలు చేశారు. ఆయనకు కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి జ్ఞాపికతోపాటు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మరుపిళ్ల హనుమంతరావు, లింగిపిల్లి అప్పారావు, పిళ్లా శ్రీనివాసరావు (పీసీ) మజ్జి శ్రీనివాసరావు, ధర్మారావు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి



కమిషనర్ స్వప్నిల్ దినకర్

చిట్టినగర్, జూన్ 24: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 8 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజన, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ శివనాథ్ ప్రమాణస్వీకారం సందర్భంగా
40వ డివిజన్‌లో సంబరాలు

విద్యాధరపురం, జూన్ 24: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సోమవారం డిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా భవానీపురం 40వ డివిజన్‌లో పీవీ చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి.

ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచారు. శివనాథ్‌కు శుభాకంక్షలు తెలిపారు. గుడూరు కొండయ్య, మాల్యాద్రి, వెంకటరెడ్డి, సుదిగుంట్ల శ్రీనివాస్, గాడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసిన టీడీపీ నాయకులు

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్, జూన్ 24 : 57వ డివిజన్ న్యూ ఆర్‌ఆర్‌పేటలోని దేవినేని వెంకటరమణ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కిట్లు పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు 650 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, బూట్లతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. డివిజన్ ఇన్‌చార్జ్ ఎరుబోతు రమణారావు, ఎఈవో బి. వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తుకు బానిసలు కావొద్దు

అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జయరాజు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న టి.జయరాజు

భవానీపురం, జూన్ 24 : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని భవానీపురం అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ టి. జయరాజు అన్నారు. విద్యాధరపురంలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా వినూత్నంగా డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జయరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నవ జీవన్ బాల భవన్ జోనల్ కో-ఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ సోమవారం నుంచి(ఈ నెల 24) 30 వరకు విజయవాడ, పరిసర ప్రాంతాల్లో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కాంటెస్ట్‌లో విజేతకు రూ.5వేలు నగదు బహుమతిని అందించారు. ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్, లెక్చరర్లు పాల్గొన్నారు.

సింగ్‌నగర్ ప్రాంతంలో కర్మల భవనం నిర్మించండి

ఎమ్మెల్యే బొండా ఉమాకు సీపీఐ నేతల వినతి

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 24 : సుమారు రెండు లక్షల మంది జనాభా ఉంటున్న అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో కర్మల భవనం నిర్మించాలని సీపీఐ నేతలు సోమవారం బొండా ఉమాకు వినతి పత్రం అందజేశారు. సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో కలిసిన సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బొండా ఉమా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. సీపీఐ నేతలు లింగా బత్తిన శివకుమార్, ఆదినారాయణ, బాష, తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

విద్యాధరపురం, జూన్ 24: తన కుమార్తె కనిపించడం లేదని రామరాజ్యనగర్ కబేళా ప్రాంతానికి చెందిన వ్యక్తి సోమవారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం తనకు ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలని, పెద్ద కుమార్తె (22) చదువు మానేసి ఇంటి వద్ద ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 5 గంటలకు లేచి చూడగా ఆమె కనిపించలేదని, చుట్టు పక్కల, తెలిసిన వారిని విచారించినా ఆమె ఆచూకీ లభించలేదని తెలిపాడు.

జాతీయ క్రీడాకారులకు సత్కారం



బోటులో నదీ విహారం నడుమ జాతీయ క్రీడాకారులను సత్కరిస్తున్న శ్రీరామ్, తరుణ్

విజయవాడ స్పోర్ట్సు,జూన్ 24 : ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు తరుణ్ కాకానీ ఆధ్వర్యంలో దుర్గాఘాట్‌లో బోటులో ఆదివారం ఘనంగా అంతర్జాతీయ ఒలింపిక్ డే జరిగింది. నదీ విహారం చేస్తూ అమవరావతి బోటింగ్ క్లబ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న బి. నిహారిక (రెజ్లింగ్), వి.గీత(రగ్బీ),సీహెచ్. జాహ్నవి(సైక్లింగ్), మోహన్ వంశీ (రెజ్లింగ్), రోహిత్‌కుమార్ (బాక్సింగ్) లను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ ఒలింపిక్ అసోసియేషన్ సేవా దృక్పథంతో క్రీడారంగంలోని వివిధ క్రీడాకారుల అభ్యున్నతికి తరుణ్ కాకానీ ద్వారా తీసుకుంటున్న చర్యలను కొనియాడారు. క్రీడాభివృద్ధికి కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏలు కృషి చేస్తాయ న్నారు. తరుణ్ కాకానీ మాట్లాడుతూ రానున్న ఒలింపిక్స్‌లోను భారత్ సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గౌరవ అతిథులు బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ బి.శ్రీధర్, సెక్రటరీ గణేష్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పవన్, ప్రతినిధులు బోస్, సింహాచలం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సులభ కాంప్లెక్సు నిర్వాహకుడు మృతి

విద్యాధరపురం, జూన్ 24: చికిత్స పొందుతూ సులభ కాంప్లెక్సు నిర్వాహకుడు రాజన్ కుమార్ ఆదివారం రాత్రి మృతి చెందాడు.ఆంధ్రప్రభ కాలనీకి చెందిన రాజన్ కుమార్ అతని స్నేహితుడు శశి దుర్గాఘాట్‌లో సులభ కాంప్లెక్స్‌ను లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నారు ప్రతి రోజు ఉదయం శశి, రాత్రిళ్ల రాజన్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 21వ తేదీ రాత్రి 8 గంటలకు రాజన్‌కుమార్ సులభ కాంప్లెక్సు వద్దకు వచ్చాడు. 11 గంటల సమయంలో రాజన్ కుమార్ భార్యకు ఫోన్ చేసి వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా ఐరన్ రాడ్ తన ఎడమ ఛాతీలో గుచ్చుకుందని చెప్పాడు. కొద్దిసేపటికి రాజన్‌కుమార్ ఇంటికి శశి వెళ్లి అతని భార్యను, పిల్లలను తీసుకుని జీజీహెచ్‌కు వెళ్లారు. అప్పటికే అపస్మారకంలో ఉన్న అతను చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు. మృతుడి భార్య జ్యోతిదేవి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులకు కేసు నమోదు చేశారు.

పదిమంది పేకాటరాయుళ్ల అరెస్టు

రూ. 85 వేలు స్వాధీనం

విద్యాధరపురం, జూన్ 24:

విద్యాధరపురం నాలుగు స్థంభాల సెంటర్‌లోని ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం వచ్చింది.

దీంతో శిబిరంపై దాడి చేశారు. పదిమందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 85 వేలు స్వాధీనం చేసుకున్నారు అనంతరం వారిని తదుపరి చర్య నిమిత్తం భవానీపురం పోలీసులకు అప్పగించారు.

ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

మంగళవారం • 25 జూన్ 2024

cinema@andhrajyothy.com

ఒకే తెరపై రజనీ, సల్మాన్



'రాజారాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' చిత్రాలతో సూపర్‌హిట్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీ కుమార్.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి షారుక్ ఖాన్ చిత్రం 'జవాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఆయన ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఈ సినిమాలో రజనీకాంత్ కూడా నటించనున్నారు. ఇలా ఒకే తెరపై వీరిద్దరూ కనపడితే.. వారి అభిమానుల ఆనందాలకు హద్దులు ఉండకపోవడమే కాకుండా అది బాక్సాఫీస్‌కు కూడా పండుగ వాతావరణాన్ని తెప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇందులో రజనీ ఏ పాత్రను పోషిస్తున్నారో ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చిత్ర నిర్మాత, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్‌కు సూపర్‌స్టార్‌తో ఉన్న సత్సంబంధాల వల్లే ఈ ప్రాజెక్టులో నటించేందుకు రజనీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్, 'కూలీ' చిత్రీకరణలో బిజీగా ఉన్న రజనీ.. ఆ ప్రాజెక్ట్స్ పూర్తి కాగానే ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.



పవన్‌కల్యాణ్‌ను కలసిన తెలుగు సినిమా నిర్మాతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినీ పరిశ్రమ తరఫున అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ తరఫున పవన్ కల్యాణ్‌ను అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదేవిధంగా సీఎం చంద్రబాబుతో భేటీ కావడానికి అపాయింట్ ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని పవన్ కల్యాణ్ తెలిపినట్టు వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించ లేదని, త్వరలోనే మరోసారి కలసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ(చినబాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీకృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)



విశ్వంభర సెట్‌కు వినాయక్

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. దర్శకుడు వి.వి.వినాయక్ సోమవారం ఈ సెట్‌కు వెళ్లారు. మెగాస్టార్ చిరంజీవిని కలసి కాసేపు ముచ్చటించారు. ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకున్నారు. దర్శకుడు వశిష్టకు, చిత్ర నిర్మాతలకు అభినందనలు తెలిపారు వినాయక్. మెగాస్టార్ చిరంజీవి, వినాయక్, వశిష్ట కలసి ఉన్న ఫొటోని చిత్రం టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మిస్తున్నారు.

బాలీవుడ్‌లోకి శ్రీలీల



క్యూట్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్‌ధావన్ నటించబోయే చిత్రానికి శ్రీలీలను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథాంశంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీని ఎంచుకున్నారని.. కన్‌ఫ్యూజన్, కామెడీ కలగలసిన ఈ చిత్రం ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందట. టైటిల్, ఇతర తారాగణం, సాంకేతిక సిబ్బంది ఇంకా ఖరారు కాని ఈ చిత్రాన్ని రమేశ్ తౌరని నిర్మించనున్నారు. ఇటువంటి క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి ఎంటర్ అవుతున్నందున.. ఇక బీ టౌన్‌లో కూడా ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదని అంటున్నారు. డేవిడ్ ధావన్, వరుణ్ ధావన్ కలయికలో ఇదివరకు 'మై తేరా హీరో', 'జుడ్వా 2' చిత్రాలు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి.

28 ఏళ్ల తర్వాత...





సరిగ్గా 28 ఏళ్ల క్రితం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైంది. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్‌కు, ఏయన్నార్ మనవరాలు సుప్రియకు ఇదే తొలి సినిమా. ఈవీవీ సత్యనారాయణ దర్శకుడు , అల్లు అరవింద్ నిర్మాత. ఆ సినిమా తర్వాత హీరోగా ఎదిగి పవన్‌కల్యాణ్ పవర్‌స్టార్ అయ్యారు. సుప్రియ మాత్రం నటనకు క్రమంగా దూరమై, నిర్మాణరంగంలోకి ప్రవేశించి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం ఇతర నిర్మాతలతో పాటు సుప్రియ కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ దిగిన ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. కొందరైతే 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రంలోని వీరిద్దరి ఫొటోను.. ఇప్పటి ఫొటోను జతచేసి.. సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



వైజయంతి పాత్రలో మళ్లీ!

విజయతార విజయశాంతి 34 ఏళ్ల క్రితం 'కర్తవ్యం' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రను పోషించారు. ఆ చిత్రం ఆమె నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు తెచ్చి పెట్టింది. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో విజయశాంతి 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర పేరు కూడా వైజయంతి కావడం గమనార్హం. విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె గెటప్ రివీల్ చేశారు. ఈ పోస్టర్‌తోనే ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేశారు. అలాగే గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకే ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో విజయశాంతి పాత్రను పరిచయం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం అమరావతిలో కలసి అభినందించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సమావేశమై సినీ రంగ సమస్యలను చర్చిద్దామని దుర్గేశ్ రామారావుకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందనీ, అందుకు సహజమైన లొకేషన్లు, ప్రోత్సహించే ప్రభుత్వం ఉన్నాయని రామారావు తెలిపారు. సినిమా పరిశ్రమ పట్ల అవగాహన కలిగిన దుర్గేశ్ మంత్రిగా ఉన్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.



ట్రెండ్‌కు అనుగుణంగా..



'హను-మాన్' చిత్రంతో ఈ ఏడాది ప్రారంభంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నిర్మిస్తున్న 'డార్లింగ్' చిత్రం జులై19న విడుదల కానుంది. అశ్విన్‌రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాతో మరోసారి హిట్ సాధిస్తామని నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్య చెబుతున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణమైన అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నరేశ్ రామదురై సినిమాటోగ్రాఫర్. హేమంత్ సంభాషణలు రాశారు.

ద్విభాషా చిత్రంలో శివరాజ్‌కుమార్



కన్నడ హీరో శివరాజ్‌కుమార్, 'పాయుమ్ ఒలి నీ యెనక్కు' ఫేమ్ కార్తీక్ అద్వైత్ దర్శకత్వంలో ఓ ద్విభాషా చిత్రంలో నటిస్తున్నట్లు ప్రకటించారు. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని ఎస్.ఎన్.సుధీర్‌రెడ్డి, పి.సుధీర్ నిర్మించనున్నారు. ఇతర నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ సినిమా షూటింగ్‌ను ఆగస్టులో మొదలుపెట్టనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: దీపు.ఎస్.కుమార్, సినిమాటోగ్రఫీ: ఎ.జె.శెట్టి, సంగీతం: సామ్.సీ.ఎస్.



భయపెడుతూ.. నవ్విస్తూ..

ఇప్పుడు హారర్, కామెడీ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. ఆడియన్స్‌ను నవ్విస్తూ, భయపెడుతూ క్యాష్ చేసుకోవడానికి దర్శకనిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. ఆ కోవలో వస్తున్న మరో చిత్రం 'మందిర'. 'ఓ మై ఘోస్ట్' చిత్రానికి ఇది తెలుగు అనువాదం.గ్లామర్ సంచలనం సన్నీ లియోన్ ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఆర్. యువన్ దర్శకత్వంలో సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను జులై 19న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సన్నీ లియోన్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది.

మన్నారా చోప్రా మాస్ సాంగ్

బాలీవుడ్ సంచలనం మన్నారా చోప్రా 'తిరగబడరా సామీ' చిత్రంలో ఓ విభిన్న పాత్ర పోషిస్తున్నారు. రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మాల్వీ మల్హోత్రా కథానాయిక. ఎ.ఎస్.రవి కుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. యూత్‌ని ఆకట్టుకొనే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీ సెంటిమెంట్, హై ఓల్టేజ్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మన్నారాపై చిత్రీకరించిన 'రాధాభాయ్' పాటను విడుదల చేశారు. సంగీత దర్శకుడు భోలే షావలి రచించి, స్వరపరిచిన ఈ మాస్ సాంగ్‌ను శ్రావణ భార్గవి పాడారు. ఇందులో మన్నారా డ్యాన్స్ మూమెంట్స్ చూసి ఆడియన్స్ చిందులు వేయడం ఖాయం అంటున్నారు నిర్మాత.





ప్రేమ, పెళ్లి గొప్పతనాన్ని చాటేలా...

సుమన్‌తేజ్, గరిమ చౌహాన్ జంటగా నటించిన చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే'. సతీశ్ పరమవేద దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాచాల యుగంధర్ నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం థియేటర్లో అందర్నీ ఆకట్టుకుంటూ.. హిట్ టాక్‌లో దూసుకుపోతోంది. ప్రేమ, పెళ్లి గొప్పతనాన్ని చాటేలా ఉన్న చిత్ర కథాంశం యూత్‌ను, ఫ్యామిలీని విపరీతంగా ఆకట్టుకుంటోందని చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సినిమాలో గగన్ విహారి, నాగినీడు, శివాజీ రాజా, ప్రభావతి కీలక పాత్రలు పోషించారు. చిత్రానికి ఎడిటర్: వెంకటప్రభు, కెమెరామెన్: పరశురామ్, సంగీతం: చరణ్‌అర్జున్





కేన్సర్ కేర్

గర్భసంచి ముఖద్వార కేన్సర్‌కు సమర్థమైన చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. అంతర్గత రేడియేషన్‌తో సర్వైకల్ కేన్సర్‌ను సమూలంగా నయం చేయగలిగే వీలుంది. ఆ చికిత్సా విధానం, ఫలితాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

గురి తప్పని రేడియేషన్... బ్రాకీ థెరపీ

సాధారణంగా సర్వైకల్ కేన్సర్ నడివయసులో బయల్పడుతూ ఉంటుంది. దాంతో రక్తస్రావాన్నీ, ఇతరత్రా లక్షణాలనూ పెరిమెనోపాజల్ దశతో ముడిపెడుతూ, ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేసి చివరి దశలో వైద్యులను కలిసే మహిళలే ఎక్కువ. ఫలితంగా మూడు, నాల్గో దశ సర్వైకల్ కేన్సర్లతో వైద్యులను కలిసినప్పుడు వ్యాధి చికిత్సకు లొంగని పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. మునుపు అంతర్గతంగా అందించే రేడియేషన్‌తో కేన్సర్ కణితిని కవర్ చేయలేని పరిస్థితి ఉండేది. ఒకవేళ చేసినా దుష్ప్రభావాలు కూడా ఎక్కువగా ఉండేవి. కానీ తాజాగా ఎమ్ఆర్ బ్రాకీ థెరపీ అందుబాటులోకొచ్చింది.

సర్వైకల్ కేన్సర్ చికిత్సలో బాహ్య, అంతర్గత అనే రెండు రకాల రేడియేషన్ చికిత్సలుంటాయి. వాడుక భాషలో ఈ రేడియేషన్ చికిత్సలను పెద్ద కరెంట్, చిన్న కరెంట్ అంటూ ఉంటారు. చిన్న కరెంటులో భాగంగా రేడియేషన్ గదిలో పడుకోబెట్టి, నేరుగా కేన్సర్ సోకిన ప్రదేశానికి రేడియేషన్ ఇస్తారు. దీన్లో నొప్పి, అసౌకర్యం ఏమాత్రం ఉండదు. పెద్ద కరెంటులో, వెజైనా ద్వారా గర్భాశయ ముఖద్వారం దగ్గరకు చేరుకుని, అక్కడ కొన్ని అప్లికేటర్లను అమర్చి, రేడియేషన్‌ను అందిస్తారు. ఇదే బ్రాకీ థెరపీ.

రేడియేషన్‌తో కేన్సర్ సోకిన కణాలతో పాటు ఆ భాగాన్ని ఆవరించి ఉండే ఇతర ఆరోగ్యకరమైన కణాలు కూడా చనిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సూటిగా కేన్సర్ సోకిన కణాలే లక్ష్యంగా, ప్రభావవంతంగా, గరిష్ఠ మోతాదు రేడియేషన్‌ను అందించడం బ్రాకీ థెరపీ ప్రత్యేకత. ఇది నైపుణ్యంతో కూడిన చికిత్సా విధానం. గతంలో కూడా ఈ చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ, అది మహిళలకు చాలా అసౌకర్యంగా, అమానుషంగా ఉండేది. కానీ ఇప్పుడు వైద్యులు, తాజా సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన బ్రాకీ థెరపీలో, రోగికి నొప్పి తెలియకుండా, అనస్థీషియా ఇచ్చి, బ్రాకీ థెరపీ చేయగలుగుతున్నారు. ఈ చికిత్సలో ఉపయోగించే పరికరాలు కూడా ఎమ్మారై కంపాటిబుల్‌తో కూడిన ప్రత్యేకమైన అప్లికేటర్లు. వీటి సహాయంతో రేడియేషన్‌ను అందించి, చికిత్స పూర్తయి, రోగి మెలకువలోకి వచ్చిన తర్వాత అప్లికేటర్లను అలాగే శరీరంలోనే ఉంచి, తిరిగి ఎమ్మారై చేయవలసి ఉంటుంది. దాన్లో ట్యూమర్‌ను కరెక్టుగా గుర్తించి, దాన్ని మార్క్ చేసుకుని, ఎంత మోతాదులో రేడియేషన్‌ను ఇవ్వాలో వైద్యులు నిర్ధారించుకుంటారు. ఇలా ప్రణాళికాబద్ధంగా రేడియేషన్‌ను లెక్కించిన తర్వాత తిరిగి రోగిని రేడియేషన్ గదిలోకి తీసుకువెళ్లి, అంతర్గత రేడియేషన్ ఇవ్వడం జరుగుతుంది.

రేడియేషన్ ప్రక్రియ క్లిష్టమైనదిగా కనిపించినా, నిజానికి రేడియేషన్ అందించే సమయం ఎంతో స్వల్పం. అన్ని విధాలా కేన్సర్ గడ్డను అంచనా వేసి, రేడియేషన్ గదిలోకి తీసుకువెళ్లిన తర్వాత, రేడియేషన్‌ను కేవలం రెండు నిమిషాల మేరకే అందిస్తారు. ఈ బ్రాకీ థెరపీ నాలుగు ఫ్రాక్షన్లలో సాగుతుంది. ఉదయం, సాయంత్రం రేడియేషన్ ఇచ్చి, తిరిగి వారం తర్వాత ఉదయం, సాయంత్రం ఇవ్వవలసి ఉంటుంది. బ్రాకీ థెరపీ అందించిన తర్వాత సర్జరీ అవసరం కూడా ఉండదు. రెండు, మూడు దశల్లో ఉన్న సర్వైకల్ కేన్సర్‌కు బ్రాకీ థెరపీ (ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్) సమర్థమైన ఫలితాన్ని అందిస్తుంది. మొదటి దశలో కేన్సర్‌ను గుర్తించగలిగితే, రేడియేషన్, కీమోథెరపీ అవసరం లేకుండా కేవలం సర్జరీతోనే సమస్యను సరిదిద్దే వీలుంది. చివరి దశ సర్వైకల్ కేన్సర్ స్టేజ్4 ఎ, 4బి. 4ఎ దశలో కేన్సర్ పురీషనాళం, మూత్రాశయంలోకి విస్తరించి ఉంటుంది. ఈ దశలో కూడా బ్రాకీ థెరపీతో చికిత్స తీసుకోవచ్చు. కానీ ఫలితం తక్కువగా ఉంటుంది. స్టేజ్4 బిలో ప్రధాన అంతర్గత అవయవాలకు పాకిపోయి ఉంటుంది. ఈ దశలో వైద్యులు కీమోథెరపీ, ఇమ్యునోథెరపీలనే సూచిస్తూ ఉంటారు.

ప్రయోజనాలు ఇవే!

బ్రాకీ థెరపీతో కేన్సర్ రోగులకు ఒరిగే ప్రయోజనాలు ఇవే!

- సర్జరీ అవసరం ఉండదు
- కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకోగలుగుతారు
- దుష్ప్రభావాలు తక్కువ
- నొప్పి ఉండదు
- చికిత్స తదనంతర అసౌకర్యం ఉండదు
- మరే ఇతర చికిత్సలతో పని లేకుండా సాధారణ జీవితాన్ని గడపవచ్చు

లైంగిక సంపర్కం వల్లే హ్యూమన్ పాపిలోమా వైరస్ సోకుతుందంటే, ఆ వైరస్ కేవలం మగవాళ్లకే పరిమితం అనుకుంటే పొరపాటు. ఈ వైరస్ పురుషులతో పాటు మహిళల శరీరాల మీద కూడా ఉంటుంది. అయితే అది చర్మాన్ని దాటి శరీరంలోకి ప్రవేశించనంత వరకూ ఎటువంటి ప్రమాదం ఉండదు. లైంగిక క్రీడ ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తే, అది సర్వైకల్ కేన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంది కాబట్టి ఆ అవకాశం లేకుండా, సురక్షితమైన అలవాట్లను



అలవరుచుకోవాలి. జననావయాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు లైంగిక చర్య తర్వాత శుభ్రం చేసుకోవం, భాగస్వామి చేత కండోమ్స్ వాడించడం, మల్టిపుల్ పార్ట్‌నర్స్ లేకుండా చూసుకోవడం లాంటి జాగ్రత్తలు పాటించాలి.

కేన్సర్ టీకా

పాతికేళ్ల క్రితం 45, 50, 60 ఏళ్ల మహిళల్లోనే ఈ వ్యాధి కనిపిస్తూ ఉండేది. కానీ ఇప్పుడు 30 ఏళ్ల మహిళల్లో సైతం కనిపిస్తోంది. కేన్సర్ ఉధృతి పెరగడానికీ, చిన్న వయసులోనే దాడి చేయడానికీ నిర్దిష్ట కారణాలు ఇవీ అని స్పష్టంగా చెప్పలేక పోయినప్పటికీ, హెచ్‌పివి వైరస్ (హ్యూమన్ పాపిలోమా వైరస్) చిన్న వయసు మహిళల్లో తీవ్రంగా విజృంభించడాన్ని ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు ఈ వైరసే ప్రధాన కారణం. ఈ వైరస్ చిన్న వయసులోనే మహిళల శరీరాల్లోకి చొరబడితే, కేన్సర్ కూడా తక్కువ వయసులోనే సోకుతుంది. కాబట్టి సర్వైకల్ కేన్సర్‌కు దారి తీసే హెచ్‌పివి వైరస్‌కు అడ్డుకట్ట వేయడం ద్వారా కేన్సర్ నుంచి రక్షణ పొందాలి. అందుకోసం హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇప్పిస్తే, సర్వైకల్ కేన్సర్‌ను 90% నివారించుకోవచ్చు. అందుకోసం లైంగిక జీవితం మొదలుపెట్టని వయసులో, 13, 14 ఏళ్ల వయసులోనే వ్యాక్సిన్ ఇప్పించాలి. ఈ వయసులో



వ్యాక్సిన్ ఇప్పించడం వల్ల, తర్వాతి కాలంలో వైరస్ శరీరంలోకి చొరబడినప్పటికీ, అది కేన్సర్‌గా అభివృద్ధి చెందే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

ప్రత్యామ్నాయాలు ఇవే!

చిన్న వయసులో టీకా తీసుకోని మహిళలు, పాప్‌స్మియర్ టెస్ట్‌తో పాటు హెచ్‌పివి డిఎన్ఎ టెస్ట్ క్రమం తప్పకుండా చేయించుకుంటూ ఉండాలి. ఇలా అప్రమత్తంగా ఉండగలిగితే, గర్భాశయ ముఖద్వారంలో ఒకట్రెండు కేన్సర్ కణాలు కనిపించినా, వెంటనే పసిగట్టి, స్వల్ప చికిత్సతో ఆ వ్యాధిని సమూలంగా తొలగించుకోవచ్చు. ఇలాంటి ప్రారంభ దశల్లో సర్జరీ అవసరం కూడా ఉండదు. ఒకవేళ కేన్సర్ కణాలు కాస్త ఎక్కువగా ఉంటే, హిస్ట్రక్టమీ ద్వారా గర్భాశయాన్ని తొలగించుకుంటే సమస్య తొలగిపోతుంది. ఈ చికిత్సతో నూరు శాతం ఫలితం ఉంటుంది.

నియంత్రణ మార్గాలున్నాయి

- 13 ఏళ్ల వయసు ఆడపిల్లలకు హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించాలి
- వ్యాక్సిన్ వేయించుకోని వాళ్లు పాప్‌స్మియర్, హెచ్‌పివి డిఎన్ పరీక్షలు చేయించుకోవాలి
- శరీరంలో ఇమ్యూనిటీ తగ్గకుండా చూసుకోవాలి.
- తీవ్ర వ్యాధులున్నవాళ్లు (కేన్సర్, హెచ్ఐవి) క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకుంటూ ఉండాలి
- వ్యాధుల ఫలితంగా ఇమ్యూనిటీ తగ్గిన మహిళలు, అరక్షిత లైంగిక చర్యల్లో పాల్గొనకూడదు.
- కండోమ్ ఉపయోగించని భాగస్వామితో శారీరక సంపర్కం పెట్టుకోకూడదు
- ఒకరి కంటే ఎక్కువ మందితో లైంగికంగా కలవకూడదు
- ప్రతి మహిళా సురక్షితమైన లైంగిక అలవాట్లను అలవరుచుకోవాలి
- లైంగికంగా కలిసిన వెంటనే, జననాంగాలను శుభ్రం చేసుకోవాలి
- కండోమ్స్‌కు బదులుగా ఐపిల్స్‌లాంటి వాటిని వాడుకోకూడదు
- ధూమపానం, మద్యపానం వల్ల కూడా ఇమ్యూనిటీ తగ్గుతుంది. కాబట్టి ఈ అలవాట్లు మానుకోవాలి

డాక్టర్ ఎం. సునీత
సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ అండ్ క్లినికల్ డైరెక్టర్,
యశోద హాస్పిటల్స్
హైటెక్ సిటీ, హైదరాబాద్.



హెల్త్ వెల్త్

రక్తపోటు హఠాత్తుగా పెరుగుతూ, తరుగుతూ ఉంటే, దాన్ని స్థిరంగా ఉంచే మార్గాలను అనుసరించాలి. అందుకోసం తోడ్పడే ఉపాయాలు ఇవి.

రక్తపోటు ఇలా దూరం

పొటాషియం

పొటాషియం ఎక్కువగా దొరికే అరటిపళ్లు, పాలకూర, బ్రొకొలి, టమాటాలు, పళ్లు ఎక్కువగా తినాలి. పాలకూర పచ్చి వాసన వస్తుందని దూరం పెట్టవలసిన అవసరం లేదు. మరిగే నీళ్లలో వేసి, రెండు నిమిషాల పాటు ఉడికించి, స్మూదీల్లో కలుపుకుని తాగవచ్చు. అలాగే సలాడ్‌తో కలిపి తినవచ్చు.



అవిసె గింజలు

వీటిలో ఉండే ఒమేగా3, పీచు రక్తనాళాల ఆరోగ్యానికి తోడ్పడతాయి. మట్టి వాసన వేసే వీటిని ఎలా తినాలబ్బా? అని కంగారు పడకుండా, వీటిని దోరగా వేయించి, పొడి కొట్టుకుని పండ్లరసాల్లో, స్మూదీల్లో కలుపుకుని తాగండి. ఓట్‌మీల్, సలాడ్లలో కూడా కలుపుకోవచ్చు.

ఇవి దూరం

మాంసం, చక్కెర, పాల ఉత్పత్తులు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ కారకాలు. కాబట్టి వీటికి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. మాంసకృత్తుల కోసం అవకాడో, పప్పులు, పుట్టగొడుగులను తీసుకోవచ్చు. క్యాల్షియం కోసం నువ్వులు, మెంతులు, ఆకుకూరలు వాడుకోవచ్చు. తీపి కోసం ఖర్జూరం, ఇతరత్రా పండ్లు తినవచ్చు.

పీచు

శరీరంలోని బోలెడన్ని జీవక్రియలకు పీచు అవసరం. పోషకాలను శరీరం శోషించుకోవాలన్నా, పేగుల ఆరోగ్యం మెరుగ్గా ఉండాలన్నా, త్వరగా ఆకలి వేయకుండా ఉండాలన్నా పీచు తినాలి. పొట్టు తీయని ధాన్యాలు, అవకాడో, అవిసె గింజలు, షియా విత్తనాలు, యాపిల్స్‌లలో పీచు ఎక్కువ.

సిజేరియన్ తర్వాత తొలి నెలసరి

సిజేరియన్ తర్వాత తొలి నెలసరి శరీర తత్వం, పాలిచ్చే ఫ్రీక్వెన్సీ, హార్మోన్ల స్థితిగతుల మీద ఆధారపడి ఉంటుంది. సాధారణ ప్రసవమైతే త్వరగా నెలసరి మొదలవుతుందనేది అపోహ! సిజేరియన్ చేయించుకున్నా, సాధారణ ప్రసవం ద్వారా బిడ్డను కన్నా, తర్వాత తొలిసరి నెలసరి భిన్నమైన అంశాల ఆధారంగా మొదలవుతుంది.

సి సెక్షన్ తర్వాత ఇలా...

ప్రసవం తర్వాత ప్రొజెస్టరాన్, ఈస్ట్రోజన్ హార్మోన్ల మోతాదులు తగ్గుతాయి. పాలిస్తున్నంత కాలం ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఫలితంగా నెలసరి ఆలస్యమవుతుంది. ఒకవేళ బిడ్డకు పాలివ్వకపోతే, సి సెక్షన్ తర్వాత ఐదు నుంచి ఆరు వారాల్లోనే తొలి నెలసరి మొదలవుతుంది.

ప్రభావితం చేసే అంశాలు

కొన్ని ఆరోగ్య పరిస్థితులు నెలసరి మీద ప్రభావం చూపిస్తాయి. మరీ ముఖ్యంగా గర్భధారణకు పూర్వ ఆరోగ్య పరిస్థితులు సి సెక్షన్ తదనంతర నెలసరిని ప్రభావితం చేస్తాయి.

- గర్భధారణకు పూర్వం ఉన్న ఆరోగ్య సమస్యలు
- హార్మోన్ల హెచ్చుతగ్గులు
- గర్భధారణకు పూర్వం నెలసరిలో అవకతవకలు

ఇతరత్రా కారణాలు

- ఒత్తిడి
- బరువు పెరగడం/ తగ్గడం
- థైరాయిడ్ సమస్యలు
- చురుకుదనం మందగించడం

నెలసరి ఇలా...

గర్భధారణకు ముందు నెలసరికీ, తర్వాతి నెలసరికీ తేడా ఉంటుంది. ప్రసవం తర్వాత శరీరం తిరిగి నెలసరికి అడ్జస్ట్ అవుతూ ఉంటుంది. కాబట్టి ప్రసవానికి ముందు నెలసరిలా ప్రసవం తర్వాత ఉండదు.

- **అధిక స్రావం:** సి సెక్షన్ తర్వాత కనిపించే తొలి నెలసరిలో ఎక్కువ రక్తస్రావం కావొచ్చు. సర్జరీ సమయంలో గర్భాశయ గోడలకు కోత పెట్టడమే ఇందుకు కారణం.
- **ముదురు ఎరుపు:** ప్రసవం లేదా సి సెక్షన్ తర్వాత, గర్భాశయంలో తిరిగి తాజా కణజాలం తయారవుతుంది. కాబట్టి స్రావం ముదురు ఎరుపు రంగులో ఉంటుంది.
- **ఎక్కువ రోజులు:** నెలసరి ప్రారంభంలో నాలుగు రోజుల పాటు ఎక్కువ స్రావం కనిపించి, తర్వాత తీవ్రత తగ్గుతుంది.
- **అవకతవకలు:** బరువు పెరగడం, ఒత్తిడి, హార్మోన్ సమస్యల మూలంగా నెలసరిలో అవకతవకలు తలెత్తవచ్చు.
- **రక్తపు గడ్డలు:** ముదురు రంగుతో కూడిన రక్తపు గడ్డలు స్రావంలో కనిపించవచ్చు. మరీ ముఖ్యంగా తొలి నెలసరిలో ఈ పరిస్థితి సర్వసాధారణం. అలాగే థైరాయిడ్ లేదా అడినోమయోసిస్ సమస్యలు ఉన్నవాళ్లలో హెవీ బ్లీడింగ్ కనిపిస్తుంది. ఎండోమెట్రియోసిస్ (గర్భాశయం వెలుపల కణజాలం పెరిగే పరిస్థితి) ఉన్నవాళ్లలో లైట్ బ్లీడింగ్ కనిపిస్తుంది.

పాలిచ్చినంత కాలం...

బిడ్డకు పాలిస్తున్నంత కాలం తల్లిలో నెలసరి కనిపించక పోవడానికి కారణం, ఆ సమయంలో శరీరంలో హార్మోన్లు ఉత్పత్తి అవుతూ ఉండడమే! పాల ఉత్పత్తికి తోడ్పడే ప్రొలాక్టిన్ అనే హార్మోన్ పునరుత్పత్తి హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తుంది. దాంతో అండాల తయారీ, విడుదల జరగవు. ఫలితంగా బిడ్డకు పాలిచ్చినంత కాలం తల్లుల్లో నెలసరి కనిపించదు.

గైనిక్ కేర్



నెలసరి నొప్పులు దూరం

సి సెక్షన్ లేదా ప్రసవం తర్వాత నెలసరి నొప్పులు అదుపులోకొస్తాయి. గర్భధారణతో శరీరంలో చోటుచేసుకునే మార్పులే ఇందుకు కారణం.

ప్రమాద సూచనలు

నెలసరి మొదలైన తర్వాత కొన్ని సూచనలను నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రతించాలి. అవేంటంటే...

- ఒకటి రెండు గంటల్లో ప్యాడ్ మార్చవలసి రావడం
- నొప్పితో కూడిన తీవ్ర స్రావం
- హఠాత్తుగా జ్వరం, తలనొప్పి
- అతి పెద్ద రక్తపు గడ్డలు
- మూత్రవిసర్జన సమయంలో నొప్పి
- దుర్వాసనతో కూడిన నెలసరి స్రావం.



యోగా

మోకీళ్ల నొప్పులు మాయం!

మోకాలి నొప్పులుంటే యోగాసనాలు వేయకూడదు అనేది అపోహ. మోకీళ్ల నొప్పులతో వేయదగిన, వేయవలసిన ఆసనాలు ఉన్నాయి. వాటితో నొప్పులు తగ్గడంతో పాటు, కీళ్ల కదలికలు మెరుగవుతాయి.

వీరాసనం

- **ఇలా వేయాలి:** అరికాళ్ల పిరుదులకు ఆనేలా మోకాళ్లను లోపలికి మడిచి నేల మీద కూర్చోవాలి. రెండు అర చేతులను మోకాళ్ల మీద ఉంచాలి. ఈ ఆసనంలో 30 - 60 సెకన్ల పాటు ఉండాలి.
- **ప్రయోజనం:** దీర్ఘ సమయాల పాటు ఒకే ప్రదేశంలో కూర్చుని పని చేయడం వల్ల కీళ్లు బిగుతుగా మారతాయి. వీరాసనం వల్ల కటి ప్రదేశం, మోకీళ్లు వదులై కదలికలు తేలికవుతాయి. ఫలితంగా నొప్పి అదుపులోకి వస్తుంది.

త్రికోణాసనం

- **ఇలా వేయాలి:** కాళ్ల మధ్య 3 అడుగుల దూరం ఉండేలా నిలబడాలి. కుడి పాదం కుడి పక్కకు తిప్పాలి. నడుము కదల్చకుండా, నడుము పైభాగాన్ని కుడి వైపుకు వంచి, కుడి చేతిని కుడి పాదం దగ్గర నేలకు ఆనించాలి. ఇలా చేస్తున్నప్పుడే, ఎడమ చేతిని నిటారుగా గాల్లోకి లేపి ఉంచాలి. ముఖాన్ని పైకి లేపిన చేతి వైపు తిప్పాలి. ఇదే విధంగా ఎడమ వైపు కూడా చేయాలి.
- **ప్రయోజనం:** మెకాలిలోని టెండాన్లు, కండరాలు, లిగమెంట్లు సాగి, కీలుకు అదనపు ఆసరా అందిస్తాయి. దాంతో మోకాళ్ల నొప్పులు అదుపులోకొస్తాయి.

న్యూట్రిషన్

భలే... బయోటిన్

బి విటమిన్లలో కీలకమైన బి7 విటమిన్... బయోటిన్. నీళ్లలో కరిగే ఈ విటమిన్ ఎనర్జీకీ, జీర్ణశక్తికీ అవసరం. ఈ విటమిన్ ఉపయోగాలు ఏవంటే...

- ఆహారం మెరుగ్గా జీర్ణమై, పోషకాల శోషణ సక్రమంగా జరుగుతుంది.
- వెంట్రుకలు, గోళ్లు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి.
- టైప్ 2 మధుమేహం అదుపులో ఉంటుంది.
- నాడీ వ్యవస్థ మెరుగ్గా ఉంటుంది.



బయోటిన్ తగ్గితే?

- చర్మం ఎర్రబడి, దురద పెడుతుంది
- వెంట్రుకలు చిట్లి, రాలిపోతూ ఉంటాయి.
- నీరసం, నిస్సత్తువ ఆవరిస్తుంది
- కండరాలు, ఎముకల నొప్పులు వేధిస్తాయి
- అరికాళ్లలో, అరచేతుల్లో తిమ్మిర్లు మొదలవుతాయి.

వేటిలో దొరుకుతుంది?

- కాలేయం, మూత్రపిండాలు (మాంసాహారం)
- ఈస్ట్
- ఆకుకూరలు
- కాలీఫ్లవర్
- నట్స్, నట్ బటర్
- కోడి గుడ్డు పచ్చ సొన
- పుట్టగొడుగులు

గృహ వైద్యం

అలవోకగా అరుగుదల

భారీ భోజనం బాధ, తిన్న తర్వాత మొదలవుతుంది. వరస వేడుకలతో అజీర్తి ఏర్పడి, పొట్టలో అసౌకర్యం వేధిస్తూ ఉంటే ఈ గృహ వైద్యాలు అనుసరించవచ్చు.

మెంతి లడ్డు: ఉదయం అల్పాహారంతో పాటు బెల్లం, నెయ్యి కలిపి తయారుచేసిన మెంతి లడ్డు ఒకటి తినాలి.

మజ్జిగ: మధ్నాహ్న భోజనం ముగించిన వెంటనే, ఇంగువ, నల్ల ఉప్పు కలిపిన గ్లాసు మజ్జిగ తాగాలి.

చ్యవన్‌ప్రాశ్: రాత్రి నిద్రకు ముందు పాలలో ఒక టీస్పూను చ్యవన్‌ప్రాశ్ కలుపుకుని తాగాలి.



స్పోర్ట్స్

విజయవాడ ● మంగళవారం 25 జూన్ 2024

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్

అఫ్ఘానిస్థాన్ x బంగ్లాదేశ్ (ఉ.6. గం.)

సూపర్ హిట్‌మ్యాన్

41 బంతుల్లో 92 రన్స్‌తో రోహిత్ హవా

ఆస్ట్రేలియాపై భారత్ గెలుపు

27న ఇంగ్లండ్‌తో సెమీస్ పోరు



గ్రాస్ ఐలెట్: కోట్లాది అభిమానుల ఆశలకు తగ్గట్టే.. అదరగొట్టే ఆటతీరుతో టీమిండియా టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో ప్రవేశించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (41 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 92) వీర విహారంతో ప్రత్యర్థి బౌలర్లను కంగారెత్తించాడు. అయితే భారీ లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో కాస్త ఉత్కంఠ నెలకొన్నా.. భారత బౌలర్లు తమ తడాఖా చూపారు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆసీస్‌పై 24 రన్స్‌తో భారత్ ఘనవిజయం సాధించింది. తద్వారా సూపర్-8 గ్రూప్-1లో ఆరు పాయింట్లతో నాకౌట్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. ఇక ఆసీస్ సెమీస్ చేరాలంటే.. మంగళవారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అఫ్ఘాన్ ఓడాల్సి ఉంటుంది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. సూర్యకుమార్ (31), దూబే (28), హార్దిక్ (27 నాటౌట్) రాణించారు. స్టార్క్, స్టొయినిస్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 181 పరుగులు చేసి ఓడింది. హెడ్ (43 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 76), మార్ష్ (37) మాత్రమే ఆకట్టుకున్నారు. అర్ష్‌దీప్‌నకు 3, కుల్దీప్‌నకు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రోహిత్ నిలిచాడు.

హెడ్ పోరాడినా..: భారీ ఛేదనలో ఆసీస్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ వార్నర్ (6) వికెట్ కోల్పోయినా.. మరో ఓపెనర్ హెడ్ మాత్రం ఎదురుదాడి ఆపలేదు. కెప్టెన్ మార్ష్ కూడా ధాటిని చూపడంతో ఆసీస్ ఆత్మవిశ్వాసంతో కనిపించింది. కానీ కీలక సమయాల్లో వికెట్లు తీసిన భారత బౌలర్లు కంగారూల పనిబట్టారు. మూడో ఓవర్‌లో మార్ష్ 4,4,6 బాదగా.. తర్వాతి ఓవర్‌లో హెడ్ 3 ఫోర్లతో పరుగుల వేట ఆరంభమైంది. హార్దిక్ ఓవర్‌లోనూ హెడ్ రెండు సిక్సర్లు సాధించగా పవర్‌ప్లేలో ఆసీస్ 65/1 స్కోరుతో భారత్ శిబిరంలో గుబులు రేపింది. అయితే మార్ష్‌ను కుల్దీప్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు పదో ఓవర్‌లో మరో 3 ఫోర్లతో హెడ్ 24 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. మ్యాక్స్‌వెల్ (20) తర్వాతి ఓవర్‌లోనే 4,6,4తో బ్యాట్‌కు పనిచెప్పాడు. కానీ అతడిని కూడా కుల్దీప్ బౌల్డ్ చేసి కాస్త రిలీఫ్‌నిచ్చాడు. వీరి మధ్య మూడో వికెట్‌కు 41 రన్స్ వచ్చాయి. ఆ తర్వాత 15వ ఓవర్‌లో స్టొయినిస్ (2)ను అక్షర్ అవుట్ చేశాక పరుగుల వేగం తగ్గింది. దీనికి తోడు 17వ ఓవర్‌లో బుమ్రా కీలక హెడ్ వికెట్ తీయడంతో భారత్ సంబరాల్లో మునిగింది. చివర్లో టెయిలెండర్ల నుంచి కనీస పోరాటం కూడా లేకపోవడంతో వారికి ఓటమి తప్పలేదు.

రోహిత్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రోహిత్ విధ్వంసకర ఆటతీరుతో అదరగొట్టాడు. ఆసీస్ బౌలర్లను చెడుగుడు ఆడేశాడు. తొలి 11 ఓవర్లపాటు తన హవా కొనసాగించాడు. బంతి ఎలా వేసినా బౌండరీ బాదడమే లక్ష్యంగా క్రీజులో చెలరేగాడు. హాజెల్‌వుడ్ మాత్రమే పరుగులను కట్టడి చేయగలిగాడు. ఓపెనర్ కోహ్లీ (0) రెండో ఓవర్‌లోనే డకౌట్ అయినా.. మరో ఎండ్‌లో రోహిత్ దూకుడుకు పరుగుల వరద పారింది. స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనైతే 6,6,4,6,6తో ఏకంగా 29 పరుగులు రాబట్టాడు. అలాగే ఐదో ఓవర్‌లో వర్షంతో పది నిమిషాలు బ్రేక్ వచ్చినా.. రోహిత్ మాత్రం అదే ఓవర్‌లో 6,4,4తో 19 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఈ జోరుతో పవర్‌ప్లేలో జట్టు 60/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. ఆ తర్వాత కూడా ఆసీస్ బౌలర్లను రోహిత్ వదల్లేదు. ఎనిమిదో ఓవర్‌లో 4,6,6తో 17 రన్స్ రాబట్టాడు. కానీ పంత్ (15) వికెట్‌ను కోల్పోవడంతో రెండో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే 8.4 ఓవర్లలోనే స్కోరు 100కి చేరడంతో భారత శిబిరంలో జోష్ కనిపించింది. అటు సూర్యకుమార్ సైతం కమిన్స్ ఓవర్‌లో 4,6తో జోరు చూపాడు. కానీ స్టార్క్ తన రెండో స్పెల్‌లో ఆకట్టుకున్నాడు. సెంచరీకి సమీపంలో ఉన్న రోహిత్‌ను 12వ ఓవర్‌లో యార్కర్‌తో బౌల్డ్ చేసిన స్టార్క్.. కుదురుకున్న సూర్యకుమార్‌ను కూడా తన తర్వాతి ఓవర్‌లోనే పెవిలియన్ చేర్చాడు. దూబే, హార్దిక్ కాస్త నెమ్మదించడంతో చివరి ఐదు ఓవర్లలో భారత్ ఆటతీరులో ఆశించిన వేగం కనిపించలేదు. 19వ ఓవర్‌లో హార్దిక్ రెండు సిక్సర్లు బాదినా.. దూబేను స్టొయినిస్ అవుట్ చేశాడు. వీరి మధ్య ఐదో వికెట్‌కు 35 పరుగులు జత చేరాయి. ఆఖరి ఓవర్‌లో జడేజా (9 నాటౌట్) సిక్సర్‌తో ఈ టోర్నీలో జట్టు స్కోరు తొలిసారి 200 దాటింది.

1 అంతర్జాతీయ టీ20ల్లో 200 సిక్సర్లు బాదిన ఏకైక బ్యాటర్‌గా రోహిత్. అలాగే ఓ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో భారత్ నుంచి రోహిత్‌వే అధిక సిక్సర్లు (8). యువరాజ్ (7)ను అధిగమించాడు.

ఒకే జట్టు (ఆసీస్)పై టీ20ల్లో ఎక్కువ సిక్సర్లు (132) బాదిన బ్యాటర్‌గా రోహిత్.

2 వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు (92) సాధించిన రెండో కెప్టెన్‌గా రోహిత్. గేల్ (98) ముందున్నాడు.

3 భారత్ తరపున టీ20ల్లో మూడో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ (19 బంతుల్లో) నమోదు చేసిన రోహిత్. గంభీర్‌తో సమంగా నిలిచాడు. యువరాజ్ (12), రాహుల్, సూర్యకుమార్ (18) ముందున్నారు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (బి) స్టార్క్ 92, కోహ్లీ (సి) డేవిడ్ (బి) హాజెల్‌వుడ్ 0, పంత్ (సి) హాజెల్‌వుడ్ (బి) స్టొయినిస్ 15, సూర్యకుమార్ (సి) వేడ్ (బి) స్టార్క్ 31, దూబే (సి) వార్నర్ (బి) స్టొయినిస్ 28, హార్దిక్ (నాటౌట్) 27, జడేజా (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 205/5; వికెట్ల పతనం:** 1-6, 2-93, 3-127, 4-159, 5-194; **బౌలింగ్:** స్టార్క్ 4-0-45-2, హాజెల్‌వుడ్ 4-0-14-1, కమిన్స్ 4-0-48-0, జంపా 4-0-41-0, స్టొయినిస్ 4-0-56-2.

ఆస్ట్రేలియా: వార్నర్ (సి) సూర్య (బి) అర్ష్‌దీప్ 6, హెడ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 76, మార్ష్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 37, మ్యాక్స్‌వెల్ (బి) కుల్దీప్ 20, స్టొయినిస్ (సి) హార్దిక్ (బి) అక్షర్ 2, టిమ్ డేవిడ్ (సి) బుమ్రా (బి) అర్ష్‌దీప్ 15, వేడ్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 1, కమిన్స్ (నాటౌట్) 11, స్టార్క్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 181/7; వికెట్ల పతనం:** 1-6, 2-87, 3-128, 4-135, 5-150, 6-153, 7-166; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-3, బుమ్రా 4-0-29-1, అక్షర్ 3-0-21-1, హార్దిక్ 4-0-47-0, కుల్దీప్ 4-0-24-2, జడేజా 1-0-17-0.

పాయింట్ల పట్టిక — గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	3	3	0	0	6	2.017
ఆస్ట్రేలియా	3	1	2	0	2	-0.331
అఫ్ఘాన్	2	1	1	0	2	-0.650
బంగ్లాదేశ్	2	0	2	0	0	-2.489

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

అఫ్ఘాన్‌కు సెమీస్ చాన్స్..

భారత్ చేతిలో ఆసీస్ ఓడడంతో సెమీఫైనల్‌కు చేరే అరుదైన అవకాశం అఫ్ఘానిస్థాన్ ఎదుట నిలిచింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, అఫ్ఘాన్ చెరో రెండు పాయింట్లతో ఉన్నాయి. మంగళవారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో గెలిస్తే అఫ్ఘాన్ 4 పాయింట్లతో నేరుగా సెమీస్ చేరుతుంది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయి ఒక పాయింట్ వస్తే..3 పాయింట్లతో అఫ్ఘానిస్థాన్ ముందడుగు వేస్తుంది. కాగా.. బంగ్లాదేశ్‌కు కూడా చాన్సు ఉందండోయ్. ఎలాగంటే..బంగ్లా 160 రన్స్ చేసి, 62 పరుగులతో అఫ్ఘాన్‌పై నెగ్గితేనే.

సెమీస్‌కు సఫారీలు

వెస్టిండీస్ నాకౌట్

చేజ్ శ్రమ వృథా



షంసీ (3/27)

నార్త్‌సౌండ్ (అంటిగ్వా): వర్ష ప్రభావిత మ్యాచ్‌లో.. ఉత్కంఠ విజయం సాధించిన దక్షిణాఫ్రికా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సూపర్-8లో భాగంగా గ్రూప్-2లో సోమవారం జరిగిన కీలక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 3 వికెట్ల (డ/లూ పద్ధతి) తేడాతో ఆతిథ్య వెస్టిండీస్‌ను ఓడించింది. ఈ ఓటమితో కరీబియన్ జట్టు టోర్నీ నుంచి నాకౌట్ కాగా.. మొత్తం 6 పాయింట్లతో సఫారీలు గ్రూప్ టాపర్‌గా నిలిచారు. షంసీ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 135/8 స్కోరు చేసింది. విండీస్ 5/2తో ఇబ్బందుల్లో పడగా, మేయర్స్ (35), రోస్టన్ చేజ్ (52) మూడో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. ఛేదనలో సౌతాఫ్రికా 16.1 ఓవర్లలో 124/7 స్కోరు చేసి గెలిచింది. సఫారీలు 15/2తో ఉన్నప్పుడు వర్షం ఆటంకం కలిగించడంతో డ/లూ విధానం ప్రకారం లక్ష్యాన్ని 17 ఓవర్లలో 123 పరుగులకు కుదించారు. చేజ్ 3 వికెట్లు తీయగా.. రస్సెల్, జోసెఫ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఓపెనర్లు హెండ్రిక్స్ (0), డికాక్ (12)ను అవుట్ చేసిన రస్సెల్ షాకిచ్చాడు. అయితే, ఈ సమయంలో వాన రావడం ఒకరకంగా సఫారీలకు కలిసి వచ్చింది. స్టబ్స్ (29).. క్లాసెన్ (22)తో కలసి నాలుగో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యంతో జట్టును మ్యాచ్‌లో నిలిపాడు. అయితే, మిల్లర్ (4), స్టబ్స్ అవుట్ కావడంతో ఒక్కసారిగా ఉత్కంఠ రేగింది. కానీ, జాన్సెన్ (21 నాటౌట్) మరో 5 బంతులు విగిలుండగానే జట్టుకు విజయాన్ని అందించాడు.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్: 20 ఓవర్లలో 135/8 (చేజ్ 52, మేయర్స్ 35; షంసీ 3/27); **సౌతాఫ్రికా:** 16.1 ఓవర్లలో 124/7 (స్టబ్స్ 29, క్లాసెన్ 22; చేజ్ 3/12, రస్సెల్ 2/19).

పాయింట్ల పట్టిక — గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
సౌతాఫ్రికా	3	3	0	0	6	0.599
ఇంగ్లండ్	3	2	1	0	4	1.992
వెస్టిండీస్	3	1	2	0	2	0.963
అమెరికా	3	0	3	0	0	-3.906

నితీశ్‌కు పిలుపు



కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

పరాగ్, అభిషేక్‌లకు చోటు

జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు భారత జట్టు

న్యూఢిల్లీ: తాజా వరల్డ్‌కప్ ముగిసిన వెంటనే భారత క్రికెట్ జట్టు ఐదు టీ20ల సిరీస్ కోసం జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. వచ్చే నెల 6 నుంచి 14 వరకు జరిగే ఈ సిరీస్ కోసం యువ ఆటగాళ్లతో కూడిన 15 మంది సభ్యుల జట్టును ఎంపిక చేశారు. దీనికి శుభ్‌మన్ గిల్ నేతృత్వం వహిస్తుండగా.. తొలిసారిగా ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి జాతీయ జట్టులో చోటు దక్కడం విశేషం. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరపున విశేషంగా రాణించి 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచాడు. 21 ఏళ్ల నితీశ్ లీగ్‌లో 142.92 స్ట్రయిక్ రేట్‌తో 303 పరుగులు సాధించడంతో పాటు రెండు వికెట్లు కూడా తీశాడు. ఆంధ్ర జట్టు నుంచి అంతర్జాతీయ టీ20లకు ఎంపికైన తొలి ఆటగాడిగా నితీశ్ నిలిచాడు. అలాగే ఐపీఎల్‌లో రాణించిన మిగతా ఆటగాళ్లలో రియాన్ పరాగ్, అభిషేక్ శర్మ, వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, పేసర్ తుషార్ పాండేలకు తొలిసారి చోటు లభించింది. ప్రస్తుత టీ20 జట్టులో ఉన్న జైస్వాల్, సంజూ శాంసన్ మినహా మిగిలిన సీనియర్ ఆటగాళ్లందరికీ విశ్రాంతినిచ్చారు. రిజర్వ్ ప్లేయర్లు రింకూ, ఖలీల్, అవేశ్ సైతం టూర్‌కు వెళ్లే జట్టులో ఉన్నారు.

నాన్న త్యాగాలకు ప్రతిఫలమిది

భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనే తన కల 50 శాతం నెరవేరగా, మరో 50 శాతం ఇంకా విగిలే ఉందని జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఎంపికైన విశాఖ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి చెప్పాడు. తన తండ్రి త్యాగాలకు లభించిన ప్రతిఫలమే భారత జట్టుకు తన ఎంపికని నితీశ్ తెలిపాడు.

షెడ్యూల్

తేదీ	మ్యాచ్
జూలై 6	తొలి టీ20
జూలై 7	రెండో టీ20
జూలై 10	మూడో టీ20
జూలై 13	నాలుగో టీ20
జూలై 14	ఐదో టీ20

(మ్యాచ్‌లన్నీ హరారేలో మధ్యాహ్నం 1 గంట నుంచి)

భారత టీ20 జట్టు

గిల్ (కెప్టెన్), జైస్వాల్, రుతురాజ్, అభిషేక్, రింకూ సింగ్, సంజూ శాంసన్, ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్, ఖలీల్, ముకేశ్, తుషార్.

పారిస్ ఒలింపిక్స్‌కు ధీరజ్

న్యూఢిల్లీ: భారత పురుషులు, మహిళల రికర్వ్ ఆర్చరీ జట్లు పారిస్ ఒలింపిక్స్ కోటా దక్కించుకొన్నాయి. సోమవారం తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అర్హత సాధించని టీమ్‌ల్లో.. భారత జట్లు టాప్‌లో నిలిచి విశ్వక్రీడల బెర్త్‌ను సొంతం చేసుకొన్నాయి. దీంతో పారిస్‌లో జరిగే ఐదు పతక ఈవెంట్లలోనూ మన ఆర్చర్లు బరిలో నిలవనున్నారు. దీంతో తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర, అంకిత భక్త్, భజన్ కౌర్‌లు తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడనుండగా.. తరుణ్‌దీప్ రాయ్, దీపిక కుమారిలకు నాలుగోసారి అవకాశం దక్కనుంది.

బిజినెస్

మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులు

570 కోట్ల డాలర్లు



10 త్రైమాసికాల తర్వాత తొలిసారిగా మిగులు నమోదు

ముంబై: దేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులు నమోదైంది. జనవరి-మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా (ఎగుమతులు, దిగుమతుల వ్యత్యాసం) మిగులు 570 కోట్ల డాలర్లు లేదా జీడీపీలో 0.6 శాతంగా ఉన్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. సుమారుగా 10 త్రైమాసికాల తర్వాత దేశంలో కరెంట్ ఖాతా మిగులు నమోదు కావటం విశేషం. ఇదిలా ఉండగా గత ఏడాది ఇదే త్రైమాసికంలో 130 కోట్ల డాలర్ల (0.2 శాతం) కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) నమోదైంది. అలాగే డిసెంబరు త్రైమాసికంలో క్యాడ్ 870 కోట్ల డాలర్లుగా (1 శాతం) ఉంది. కాగా 2024 ఆర్థిక సంవత్సరం మొత్తానికి మాత్రం క్యాడ్ జీడీపీలో 0.7 శాతానికి (2320 కోట్ల డాలర్లు) తగ్గింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)లో క్యాడ్ జీడీపీలో 2 శాతంగా (6,700 కోట్ల డాలర్లు) ఉంది. మరిన్ని వివరాలు..

- ఈ ఏడాది జనవరి - మార్చి త్రైమాసికంలో వాణిజ్య లోటు ముందు ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5,260 కోట్ల డాలర్ల నుంచి 509 కోట్ల డాలర్లకు తగ్గింది.
- సేవల రంగం ద్వారా ఆదాయం 3,910 కోట్ల డాలర్ల నుంచి 4,270 కోట్ల డాలర్లకు పెరిగింది. ఇది కరెంట్ ఖాతా మిగులులోకి రావడానికి దోహదపడినట్టు ఆర్‌బీఐ తెలిపింది.
- పెట్టుబడి ఆదాయాలకు దర్పణం పట్టే ప్రాథమిక ఆదాయ ఖాతా 1,260 కోట్ల డాలర్ల నుంచి 1,480 కోట్ల డాలర్లకు పెరిగింది.
- మార్చి త్రైమాసికంలో విదేశాల్లోని భారతీయులు బదిలీ చేసిన ప్రైవేట్ నిధులు 1,190 కోట్ల డాలర్ల నుంచి 3,200 కోట్ల డాలర్లకు, ఎన్ఆర్ఐ డిపాజిట్లు 360 కోట్ల డాలర్ల నుంచి 540 కోట్ల డాలర్లకు పెరిగాయి. అయితే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మాత్రం 640 కోట్ల డాలర్ల నుంచి 200 కోట్ల డాలర్లకు తగ్గాయి.
- ఎఫ్‌పీఐ పెట్టుబడుల విషయానికి వస్తే ముందు ఏడాది నాలుగో త్రైమాసికంలో 170 కోట్లు తరలించుకుపోగా 2023-24 క్యూ4లో నికరంగా 1,140 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేశారు. ఇదే కాలంలో విదేశీ వాణిజ్య రుణాల రాక 170 కోట్ల నుంచి 260 కోట్ల డాలర్లకు పెరిగింది.
- ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2022-23 ఆర్థిక సంవత్సరంలో 520 కోట్ల డాలర్ల మేరకు పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోగా2023-24 ఆర్థిక సంవత్సరంలో నికరంగా 4,410 కోట్లు దేశంలోకి వచ్చాయి. అయితే ఇదే కాలంలో ఎఫ్‌డీఐలు మాత్రం 2,800 కోట్ల డాలర్ల నుంచి 980 కోట్ల డాలర్లకు తగ్గాయి.

చిక్కుల్లో quant క్వాంట్ ఎంఎఫ్



సంస్థలో ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలు! ● విచారణ ప్రారంభించిన సెబీ

- ముంబై, హైదరాబాద్‌లోని కంపెనీ కార్యాలయాల్లో సోదాలు
- మొబైళ్లు, కంప్యూటర్లతో పాటు ఇతర డిజిటల్ పరికరాల స్వాధీనం
- పూర్తిగా సహకరిస్తామన్న సంస్థ

న్యూఢిల్లీ: గడిచిన కొన్నేళ్లలో శరవేగంగా వృద్ధి చెందుతూ వచ్చిన క్వాంట్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) ప్రస్తుతం చిక్కుల్లో ఇరుక్కుంది. సంస్థలో ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలు జరిగాయన్న అనుమానంతో క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ విచారణ ప్రారంభించింది. అందులో భాగంగా కంపెనీకి చెందిన ముంబై, హైదరాబాద్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన సెబీ.. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర డిజిటల్ పరికరాలను జప్తు చేసింది. స్టాక్ మార్కెట్లో ఈ మ్యూచువల్ ఫండ్ కంపెనీ పెట్టుబడులకు సంబంధించిన గోప్య సమాచారాన్ని లీక్ చేస్తున్నదెవరు, తద్వారా లబ్ధి పొందుతున్నది ఎవరనే విషయాన్ని రాబట్టేందుకు వాటిని తన ఆధీనంలోకి తీసుకుంది. క్వాంట్ ఎంఎఫ్‌కు చెందిన డీలర్ లేదా ఏ బ్రోకర్ ద్వారానైతే క్వాంట్ ఈక్విటీ పెట్టుబడులు పెడుతున్నదో వారి నుంచి సమాచారం బయటికి పొక్కి ఉండవచ్చని సెబీ అనుమానిస్తున్నది. ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాల ఆరోపణలకు సంబంధించిన తమపై సెబీ విచారణ కొనసాగిస్తున్నదని ధ్రువీకరించిన క్వాంట్ ఎంఎఫ్.. ఈ విషయంలో నియంత్రణ మండలికి పూర్తిగా సహకరిస్తామని, అవసరమైన సమాచారాన్ని అందిస్తామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. 80 లక్షలకు పైగా కస్టమర్లున్న క్వాంట్ ఎంఎఫ్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.93,000 కోట్ల పైమాటే.

ఇన్వెస్టర్లపై ప్రభావం ఉంటుందా..?

క్వాంట్ ఎంఎఫ్ ఫండ్ పథకాల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవాల్సి రావచ్చు. ఎందుకంటే, తాజా ఘటనతో క్వాంట్ ఎంఎఫ్ పెట్టుబడులు కలిగిన కంపెనీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగితే, ఇన్వెస్టర్ల నెట్ అసెట్ వాల్యూ (ఎన్‌ఏవీ) తగ్గిపోయే ప్రమాదం ఉంది. క్వాంట్ ఎంఫ్ ప్రధానంగా స్మాల్, మిడ్ క్యాప్ షేర్లలో అధిక పెట్టుబడులను కలిగి ఉంది. అయితే, సంస్థ ఫండ్లలోని పెట్టుబడులు జప్తయ్యే ప్రమాదం లేదని విశ్లేషకులు పేర్కొన్నారు. సంస్థలో ఫ్రంట్ రన్నింగ్ వ్యవహారం జరిగినట్లు సెబీ విచారణలో తేలితే క్వాంట్‌పై క్రమశిక్షణ చర్యలతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది.

క్వాంట్‌లో ఏం జరిగింది..?

క్వాంట్ ఎంఎఫ్ ఏయే కంపెనీల షేర్ల క్రయ, విక్రయాలు జరుపబోతోందన్న ముందస్తు సమాచారం ఆధారంగా ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలు జరిగినట్లు సెబీ నిఘా వ్యవస్థ సంకేతాలిచ్చింది. క్వాంట్ కొనుగోలు చేయబోయే కంపెనీ షేర్లు, సంఖ్య, సమయానికి సంబంధించిన సమాచారం తెలిసిన మ్యూచువల్ ఫండ్ కంపెనీ ఉద్యోగులే విషయాన్ని లీక్ చేసి ఉంటారని సెబీ అనుమానిస్తోంది. దాంతో సెబీ.. క్వాంట్ ఎంఫ్ ఎగ్జిక్యూటివ్‌లు, బ్రోకర్లను ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

ఎంఎఫ్ రంగంలో ఇదే మొదటి సంఘటనా..?

దేశీయ మ్యూచువల్ ఫండ్ రంగంలో గతంలోనూ ఫ్రంట్ రన్నింగ్ వ్యవహారాలు వెలుగుచూశాయి. 2022లో యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ పైనా ఈ విషయంలో విచారణ జరిపి ఫండ్ డీలర్‌తో పాటు మరో 20 సంస్థలను సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిషేధించింది. 2007లోనూ హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్‌లో ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలు జరిగినట్లు తేలింది.

ఫ్రంట్ రన్నింగ్ అంటే..?

బ్రోకర్ లేదా మార్కెట్ విశ్లేషకుల నుంచి అందుకున్న ముందస్తు సమాచారం ఆధారంగా వ్యక్తులు లేదా సంస్థ సంబంధిత షేరులో లావాదేవీ నెరపడం ద్వారా అయాచిత లబ్ధి పొందడాన్ని ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలుగా పరిగణిస్తారు. ఉదాహరణకు, బడా సంస్థ లేదా మ్యూచువల్ ఫండ్ ఏదైనా కంపెనీ షేర్లను భారీ సంఖ్యలో కొనుగోలు చేయబోతున్నదన్న సమాచారం తెలిసిన బ్రోకర్ లేదా బ్రోకింగ్ సంస్థలోని ఉద్యోగి ఆ కంపెనీ షేర్లను ముందుగానే కొనిపెట్టుకోవడం ద్వారా లబ్ధిపొందడమే ఫ్రంట్ రన్నింగ్. ఇది అనైతిక, అక్రమ వ్యవహారం. సెబీ దీన్ని నిషేధించింది కూడా.

జీఐబీ ఎనర్జీఎక్స్‌తో అమర రాజా జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లిథియం అయాన్ సెల్స్ టెక్నాలజీ కోసం స్లోవేకియాకు చెందిన జీఐబీ ఎనర్జీ ఎక్స్ కంపెనీతో అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్ఏసీటీ) లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సోమవారం ఇరు కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం కింద జీఐబీ ఎనర్జీ ఎక్స్ అనుబంధ కంపెనీ అయిన గోషియాన్ హైటెక్ కో లిమిటెడ్.. లిథియం అయాన్ సెల్స్‌కు చెందిన "ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీ" లైసెన్సును తమకు అందిస్తుందని అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈ అండ్ ఎం) తెలిపింది. ఈ సమగ్ర ఒప్పందం కింద సిలిండ్రికల్, ప్రీస్మాటిక్ ఫ్యాక్టర్లు రెండింటిలోనూ అమరరాజా ప్రపంచ శ్రేణి ఎల్ఎఫ్‌పి సెల్స్ తయారీని చేపడుతుంది. అలాగే గోషియాన్ కంపెనీ అమరరాజాకు సెల్ టెక్నాలజీ ఐపీని అందుబాటులో ఉంచడంతో పాటు కొత్త తరానికి చెందిన ప్రాసెస్ టెక్నాలజీల ఆధారంగా గోషియాన్ ప్రపంచ సరఫరా వ్యవస్థల సమన్వయంతో గిగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరం అయిన మద్దతు, కస్టమర్ సొల్యూషన్లకు టెక్నికల్ మద్దతు అందిస్తుందని పేర్కొంది.

ధరలు పెంచిన హీరో మోటోకార్ప్

హీరో మోటోకార్ప్.. ఎంపిక చేసిన మోటార్ సైకిల్, స్కూటర్ మోడళ్ల ధరలను రూ.1,500 వరకు పెంచినట్లు ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు గణనీయంగా పెరిగిపోవటంతో ధరలు పెంచక తప్పలేదని కంపెనీ పేర్కొంది. పెంచిన ధరలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

పామాయిల్ కంటే చౌకగా సన్‌ఫ్లవర్ ఆయిల్

పోటీపడి ధర తగ్గించిన రష్యా,ఉక్రెయిన్



ముంబై: రష్యా-ఉక్రెయిన్ పోరాటం సన్‌ఫ్లవర్ ఆయిల్‌కీ విస్తరించింది. ఈ రెండు దేశాలు తమ సన్‌ఫ్లవర్ ఆయిల్ నిల్వలను వదిలించుకునేందుకు పోటీ పడి ధరలు తగ్గించాయి. ప్రస్తుతం టన్ను శుద్ధి చేయని సన్‌ఫ్లవర్ ఆయిల్‌ని ఈ రెండు దేశాలు ఇన్సూరెన్స్, రవాణా ఖర్చులతో కలిపి 940 డాలర్లకే (సుమారు రూ.78,452) విక్రయిస్తున్నాయి. ఇదే సమయంలో టన్ను ముడి పామాయిల్ ధర 950 డాలర్లు పలుకుతోంది. బీమా, రవాణా ఖర్చులు దీనికి అదనం. సాధారణంగా ముడి సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర పామాయిల్ కంటే 100 డాలర్లు ఎక్కువగా ఉంటుంది.

దిగుమతులు పెంచిన భారత్

ధర తగ్గడంతో భారత కంపెనీలు పెద్ద ఎత్తున సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ నెలలో రికార్డు స్థాయిలో ఐదు లక్షల టన్నుల ఆయిల్ దిగుమతి కోసం ఆర్డర్ పెట్టాయి. ఇందులో ఇప్పటికే 3.2 లక్షల టన్నులు భారత రేవులకు చేరింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో లీటర్ సన్‌ఫ్లవర్ వంట నూనె రూ.110 నుంచి రూ.120 మధ్య పలుకుతోంది. ఈ ధర ఇంకా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

సముద్ర ఉత్పత్తుల రవాణాలో విశాఖ పోర్టు టాప్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): సముద్ర ఉత్పత్తుల రవాణాలో విశాఖపట్నం పోర్టు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.17,984 కోట్ల విలువైన 3,14,199 టన్నుల సముద్ర ఉత్పత్తులను రవాణా చేసి మొదటి స్థానం దక్కించుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు (ముంబై) రూ.6,395.70 కోట్లతో ద్వితీయ స్థానంలో, కొచ్చిన్ పోర్టు రూ.6,120 కోట్లతో మూడవ స్థానంలో నిలిచాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ రూ.60,523.89 కోట్ల విలువ చేసే 17,81,602 టన్నుల సముద్ర ఉత్పత్తులు ఎగుమతి చేసింది. భారత్ నుంచి 132 దేశాలకు ఈ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి.

- అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న స్రైట్ ఆగ్రో.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.44.8 కోట్లు సమీకరించనుంది. రైట్స్ ఇష్యూలో భాగంగా 3.34 కోట్ల ఈక్విటీ షేర్లను రూ.13.4 ఇష్యూ ధరతో ఆఫర్ చేస్తోంది. ఈ నెల 24న ప్రారంభమైన ఈ ఇష్యూ జూలై 12న ముగియనుంది.

నష్టాల్లోంచి స్వల్ప లాభాల్లోకి..

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో సోమవారం నష్టాల్లో ప్రారంభమైన ప్రామాణిక ఈక్విటీ సూచీలు.. మళ్లీ తేరుకుని స్వల్ప లాభాల్లో ముగిశాయి. విద్యుత్, వాహన, ఇండస్ట్రియల్ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో అమ్మకాలు మార్కెట్ లాభాలను పరిమితం చేశాయి. దాంతో సెన్సెక్స్ 131.18 పాయింట్ల లాభంతో 77,341.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 36.75 పాయింట్ల వృద్ధితో 23,537.85 వద్ద క్లోజైంది.

జీపీ ఎకో సొల్యూషన్స్ లిస్టింగ్ అదరహో!

గత వారంలో ఐపీఓ ముగించుకుని, సోమవారం ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్టయిన సోలార్ రంగ కంపెనీ జీపీ ఎకో సొల్యూషన్స్ ఇండియాకు మార్కెట్ వర్గాల నుంచి అపూర్వ స్పందన లభించింది. పబ్లిక్ ఇష్యూ ధర రూ.94తో పోలిస్తే, 299 శాతం ప్రీమియంతో లిస్టయిన కంపెనీ షేరు.. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి 304 శాతం లాభంతో రూ.393.75 వద్ద ముగిసింది. జీపీ ఎకో సొల్యూషన్స్ ఐపీఓకు సైతం ఇష్యూ సైజుతో పోలిస్తే ఏకంగా 856.37 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,230 ▼	66,250 ▼	96,200 ▼
ముంబై	71,615 ▼	65,599 ▼	88,671 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	515
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	132
వరంగల్	119	గుంటూరు	132
కరీంనగర్	119	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	126
కర్నూలు	119	నెల్లూరు	126
విశాఖపట్నం	138	అనంతపురం	132
గోదావరి	132		

ప్రజల ప్రాణాలకు ఆరోగ్యశాఖే జవాబుదారీ!

- గతం సర్కారులో మాదిరిగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదు
- 'డయేరియా'పై అధికారులకు మంత్రి సత్యకుమార్ వార్నింగ్

అమరావతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలకు ఆరోగ్యశాఖ అధికారులు జవాబుదారులుగా ఉండాలని, ఉద్యోగ ధర్మమే కాకుండా సామాజిక బాధ్యతగా కూడా వ్యవహరించాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లతో డయేరియాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్లోరినేషన్ సరిగా జరుగుతోందా..? లేదా అనే విషయంపై ఆరోగ్యశాఖ అధికారులు మిగిలిన శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతే కాకుండా వ్యక్తిగత శుభ్రత విషయంలో కూడా ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. 271 వాటర్ సోర్సులు కలుషితమైనట్లు గుర్తించిన వెంటనే ప్రజల్లో అవగాహన కలిగించి ఉంటే ఈ పరిస్థితి ఎందుకు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 27 ఏళ్ల యువకుడు డయేరియా వల్ల చనిపోయాడంటే ఏం సమాధానం చెప్తారన్నారని ప్రశ్నించారు. మీడియాలో వార్తలొస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటని, ఇటువంటి పరిస్థితిని చూసి సిగ్గుపడాలని మండిపడ్డారు. డయేరియా ప్రబలిన తర్వాత చేపట్టే చర్యల కంటే ముందస్తు చర్యల వల్ల ప్రాణాల్ని కాపాడినవారవుతారన్నారు. గతంలో మాదిరిగా ఈ ప్రభుత్వ హయాంలో వ్యవహరిస్తే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధుల విషయంలో కూడా అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ఆరోగ్యశాఖలో సేవల్ని మరింత మెరుగుపర్చడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సీఎం చంద్రబాబు చెప్పారని, ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఆరోగ్యశాఖను ప్రక్షాళన చేసే దిశగా చర్యలుంటాయన్నారు. త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటించి ఆస్పత్రుల బలోపేతానికి ఏమేమి చర్యలు తీసుకోవాలో తెలుసుకుంటానని, లోటుపాట్లను సరిదిద్దుతామని చెప్పారు. ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఆరోగ్యశాఖ కమిషనర్ ఎం.వెంకటేశ్వర్, ఆరోగ్యశ్రీ సీఈవో లక్ష్మీశ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పవన్ వారాహి దీక్ష

అమరావతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం (ఈ నెల 26) నుంచి వారాహి అమ్మవారి దీక్ష చేపట్టనున్నారు. 11 రోజుల పాటు.. వచ్చే నెల 6వ తేదీ వరకూ ఆయన దీక్ష కొనసాగనున్నారు. దీక్ష సమయంలో కేవలం పాలు, పండ్లు, ద్రవ ఆహారం మాత్రమే తీసుకుంటారు. గత ఏడాది జూన్‌లో కూడా ఆయన వారాహి విజయ యాత్ర చేపట్టారు. ఆయాత్ర సందర్భంలోనూ వారాహి అమ్మ వారికి పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు.

9 గంటల కరెంటుతోనే ప్రయోజనం: గొట్టిపాటి

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): తొమ్మిది గంటల నిరంతర విద్యుత్తుతోనే రైతుకు ప్రయోజనం చేకూరుతుందని విద్యుత్తు మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వెలగపూడి సచివాయలంలో సోమవారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జెన్కో సీఎండీ కేవీఎస్ చక్రధరరావు, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, జాయింట్ సెక్రటరీ బీఏపీపీ కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్ తదితర అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'వినియోగదారులకు మేలైన విద్యుత్తును అందించేందుకు ఇంధన సంస్థలు కార్యాచరణను సిద్ధం చేసుకోవాలి. గిరిజన గ్రామాల్లో 100 శాతం కరెంటు సరఫరా చేసేలా కార్యాచరణను అమలు చేయాలి. వేలాడుతున్న విద్యుత్తు స్తంభాలు, వైర్లు లేకుండా నిరంతరం డిస్కమ్‌లు చర్యలు తీసుకోవాలి' అని మంత్రి ఆదేశించారు.

డీవైఈవో మెయిన్స్‌కు నిష్పత్తి పెంచాలి: టీడీపీ

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీవైఈవో) పోస్టులకు సంబంధించి మెయిన్స్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని టీడీపీ ఎమ్మెల్సీలు ఏపీపీఎస్సీని కోరారు. ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి సోమవారం ఏపీపీఎస్సీ ఛైర్మన్‌కు లేఖ రాశారు. 17 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఈ పోస్టుల భర్తీ చేపట్టారని, ఈ నేపథ్యంలో ఎక్కువ మంది అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేస్తున్నందున దానిని మార్చాలని సూచించారు.

పార్టీ కోసం కష్టపడిన వారికే ప్రాధాన్యం: బాబు

త్వరలో నామినేటెడ్ పోస్టులు

అమరావతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడి టీడీపీ కూటమి విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికలను ప్రతి ఒక్కరూ సవాల్‌గా తీసుకుని పోరాడడం వల్లే ఘన విజయం సాధ్యమైందన్నారు. పార్టీ పిలుపిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొని, పోరాడిన వారికి తప్పకుండా నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు. సోమవారం టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, పార్లమెంట్ అధ్యక్షులు, పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ విజయం కోసం కష్టపడినవారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. పార్టీ నేతల నివేదికలతో పాటు, ఇతర మార్గాల్లో కూడా రిపోర్టులు తెప్పించుకుని, కష్టపడిన వారికే పదవులు వచ్చేలా చేస్తామని తెలిపారు. 'ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్ల పాటు బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, యువగళం, రా.. కదలిరా, ప్రజాగళం వంటి వివిధ కార్యక్రమాలతో ప్రజలతోనే ఉన్నాం. సాగునీటి ప్రాజెక్టులను కూడా సందర్శించి, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాం. గత ఐదేళ్లు కార్యకర్తలు, నాయకులపై వైసీపీ సర్కార్ ఎన్నో అక్రమ కేసులు పెట్టింది. వీటన్నింటినీ తట్టుకుని నిలబడ్డారు. ఎన్నికల్లో మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు కలిసి పని చేయడం వల్ల 57% ఓట్లు సాధించి, 93% స్ట్రైక్ రేట్‌తో గెలిచామరు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, పార్టీకి, కార్యకర్తలకు నష్టం చేసి, వేధించిన వైసీపీ నేతలకు టీడీపీలోకి ఎంట్రీ లేదని స్పష్టం చేశారు. పార్టీకి అన్యాయం చేసిన వారిని ఉపేక్షించేది లేదు. పొత్తులో భాగంగా 31 మంది పార్టీ ఇన్‌చార్జులకు సీట్లు రాలేదు. అయినా వెనకడుగు వేయకుండా కూటమి గెలుపే లక్ష్యంగా పని చేశారు. అందువల్లే చరిత్రలో లేని విధంగా ఫలితాలు వచ్చాయి. నేను కూడా ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళ్లి, కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నా. రైట్ మ్యాన్, రైట్ పొజిషన్ అనే విధంగా భవిష్యత్‌లో నిర్ణయాలు ఉంటాయి. 2029 ఎన్నికల్లో విజయానికి కూడా ఇప్పటి నుంచే ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేస్తే మనకు అనుకూల ఫలితాలు వస్తాయి. ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చుతున్నాం. మెగా డీఎస్సీ ప్రకటించాం.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం.. పెన్షన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచాం. గత ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పెన్షన్లు ఇవ్వడం అసాధ్యమని చెప్పింది. సాధ్యం అవుతుందని చెప్పడానికే సచివాలయ సిబ్బందితో పెన్షన్లు ఇవ్వబోతున్నాం. పల్లా శ్రీనివాసరావు గాజువాకలో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారని, చరిత్రలో ఇంత మెజారిటీ ఎప్పుడూ రాలేదని చంద్రబాబు తెలిపారు. అధికారంలోకి వచ్చాక బీసీలకు ప్రాధాన్యం ఇచ్చామని.. బీసీ వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించామని గుర్తుచేశారు. ఇప్పుడు బీసీ నేత అయ్యన్నపాత్రుడిని స్పీకర్ చేశాం. కేబినెట్ కూర్పులోనూ సామాజిక సమతూకం పాటించాం' అని వివరించారు.

హంగూ ఆర్భాటాలొద్దు.. ప్రజల్లో కలిసిపోండి

- పాలకులం కాదు.. వారికి సేవకులం.. కొత్త మంత్రులు శాఖలపై అధ్యయనం చేయాలి.. కేబినెట్ తొలి భేటీలో చంద్రబాబు హితవు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మంత్రులు హంగూ ఆర్భాటాలు ప్రదర్శించవద్దు. ప్రజల్లో కలిసిపొండి. వారు మీ వద్దకు రాలేని పరిస్థితులు తెచ్చుకోవద్దు. పాలకులమన్న భావంతో కాకుండా ప్రజలకు సేవకులం అన్నట్లుగా మెలగండి' అని కొత్త మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. సోమవారమిక్కడ సచివాలయంలో జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఎజెండా అంశాలపై సమీక్ష ముగిసి అధికారులు వెళ్లిపోయిన తర్వాత ఆయన మంత్రులతో కొంతసేపు మాట్లాడారు. 'ఎన్నికల్లో ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారు. సభలో మొత్తం 175 సీట్లు ఉంటే 164 సీట్లు మనకే ఇచ్చారు. ప్రజలకు మనపై చాలా అంచనాలు ఉన్నాయి. దాని కోసం మనం చాలా ఎక్కువ కష్టపడాలి. కొత్త మంత్రులు తమ శాఖలపై పట్టు తెచ్చుకోవాలంటే అవగాహన బాగా పెంచుకోవాలి. నిరంతరం నేర్చుకుంటూ ఉండాలి. మీ శాఖలకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయండి' అని తెలిపారు. బూతుల భాష వాడవద్దని మంత్రులను హెచ్చరించారు. 'గతంలో ఎవరు ఎలా మాట్లాడారో చూశాం. ప్రజలు వారిని అసహ్యించుకున్నారు. ఎదుటివారు ఎంత రెచ్చగొట్టినా రాజకీయంగా సమాధానం ఇవ్వండి. బూతుల ప్రయోగాలు వద్దు. అధికారులతో సౌమ్యంగా మాట్లాడండి. పనులు కాకపోతే మన ప్రాధాన్యాలు ఏమిటో ఒకటికి రెండుసార్లు చెప్పండి. పనులు జరగని చోట ఒత్తిడి పెంచండి' అని సూచించారు. అలాగే అధికారులతో సుదీర్ఘ సమీక్షలు నిర్వహించవద్దని, సాయంత్రం ఆరు గంటల తర్వాత వారితో సమావేశాలు పెట్టవద్దని కోరారు. క్రమం తప్పకుండా రాష్ట్ర సచివాలయానికి రావాలని.. శాఖాధిపతుల కార్యాలయాలు కూడా సందర్శించాలని అన్నారు. 'కార్యాలయ సిబ్బందిగా మంచి వాళ్లను పెట్టుకోండి. మీ శాఖలకు సంబంధించి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పెట్టుకుని దాని ప్రకారం పనిచేయండి. ప్రతి సమావేశానికీ సన్నద్ధమై వెళ్లండి. ఏదైనా ఒక పొరపాటు దొర్లితే అల్లరి చేయడానికి జగన్ మీడియా సదా సిద్ధంగా ఉంటుంది' అని చెప్పారు. వచ్చే వారం నుంచి శాఖలవారీ సమీక్షలు మొదలుపెడతానన్నారు.

28న పోలవరంపై శ్వేతపత్రం

పోలవరం ప్రాజెక్టుపై ఈ నెల 28న శ్వేతపత్రం విడుదల చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. సమావేశంలో ప్రాజెక్టు నిర్మాణ పురోగతిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. సీఎం స్పందిస్తూ.. ఈ నెలాఖరుకల్లా కేంద్ర జలశక్తి శాఖ నియమించిన అంతర్జాతీయ నిపుణుల బృందం వస్తుందని.. వారి అధ్యయన నివేదికను బట్టి పనులు చేపడదామని చెప్పారు. అన్న క్యాంటీన్ల పునఃప్రారంభ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులను కూడా భాగస్వాములను చేస్తే బాగుంటుందని, వాటిని ఎక్కువగా వాడుకునేది వారేనని పవన్ తెలిపారు. దానికి చంద్రబాబు అంగీకరించారు. అన్న క్యాంటీన్లకు ఒక ట్రస్టు ఏర్పాటు చేస్తే.. విరాళాలు వస్తాయని, తద్వారా పేదలకు భోజన వసతిని నిరాటంకంగా కొనసాగించవచ్చని మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. తిరుమలలో అన్నదాన కార్యక్రమానికి ట్రస్టు ఏర్పాటు చేయడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వచ్చే నెలలో నిర్వహించాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ గడువు జూలై నెలాఖరు వరకూ ఉంది. ఆర్డినెన్స్ ద్వారా దీని గడువును రెండు నెలలు పొడిగించవచ్చని అధికారులు చెప్పారు. ముఖ్యమంత్రి విముఖత చూపారు. పూర్తి బడ్జెట్‌ను తయారు చేసి జూలైలో అసెంబ్లీలో పెట్టి ఆమోదం తీసుకుందామన్నారు.


రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి వస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

✔ పింఛన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనాలి..

జూలై 1న పెంచిన పింఛన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనాలని చంద్రబాబు ఆదేశించారు. ఎక్కడైనా వారు రాకపోయినా పంపిణీ ఆపవద్దని అధికారులకు సూచించారు. ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాలకు బదిలీ అయిన ఎమ్మార్వోలు గతంలో పనిచేసిన జిల్లాలకు తిరిగి రావడానికి అవకాశం కల్పించాలని కేబినెట్ నిర్ణయించింది.

✔ అసలే వర్షాకాలం.. రోడ్లపై గుంతలు పూడ్చండి

రహదారులపై ఉన్న గుంతలు పూడ్చేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రోడ్లు-భవనాల (ఆర్‌అండ్‌బీ) శాఖను ఆదేశించారు. మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై ఆయన మాట్లాడారు. అసలే వర్షాకాలమని, ప్రమాదకర గుంతలను గుర్తించి వాటిని పూడ్చేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, వాటిని బాగుచేయాలని చెప్పారు. రహదారుల స్థితిగతులపై తక్షణమే పరిశీలన చేయాలని, గుంతలు పూడ్చడానికి ఎంత ఖర్చవుతుందో అంచనావేసి.. నిధులు సమకూర్చుకుని.. పూడ్చే కార్యక్రమం ప్రారంభించాలని తెలిపారు. పలువురు మంత్రులు కూడా తమ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా.. రహదారుల నిర్వహణ, మరమ్మతులపై చీఫ్ ఇంజనీర్లతో మంత్రి సమావేశం కానున్నట్లు సమాచారం.

తప్పుల తడక రీసర్వేను ఏం చేద్దాం?

రాష్ట్రంలో భూముల రీసర్వేపై ప్రభుత్వం త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనుంది. రీసర్వే ఆధారంగానే ఆంధ్రప్రదేశ్ టైటిలింగ్ చట్టం అమలు చేయాలని గత జగన్ సర్కారు భావించింది. అయితే ఇది రైతుకంటక చట్టమని టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే రద్దుచేసింది. సోమవారంనాటి కేబినెట్ సమావేశంలో ఆ చట్టం రద్దుపై తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదించారు. ఈ నేపథ్యంలో దీనికి మూలమైన భూముల రీసర్వే గురించి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ భేటీలో లేవనెత్తినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ సర్వే-సరిహద్దుల చట్టంను అనుసరించి భూముల కొలతలు వేయలేదని, అడ్డగోలుగా రికార్డులు తయారుచేశామని సర్వేయర్లే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రీసర్వే పేరిట తయారుచేసిన రికార్డుల్లో తప్పులున్నాయని, ఇవి తమ దృష్టికి తీసుకురావొద్దని సర్వే ఉన్నతాధికారి బెదిరించేవారని కూడా నివేదించారు. మరోవైపు రీసర్వేను కూడా రద్దుచేసి, 2020 డిసెంబరు నాటికి ఉన్న రికార్డులను కొనసాగించేలా విధాన నిర్ణయం తీసుకోవాలని రైతులు, రెవెన్యూ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. ఇవే అంశాలను చంద్రబాబు ప్రస్తావిస్తూ.. త్వరలో సమీక్ష చేస్తానని చెప్పినట్లు తెలిసింది.

1న మెగా డీఎస్సీ షెడ్యూల్!

16,347 పోస్టుల భర్తీకి సిద్ధం

- అదే రోజు టెట్ పరీక్షకు కూడా
- కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ.. ఆమోదం

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ కొలువుల భర్తీకి టీడీపీ కూటమి సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. నిరుద్యోగుల కలలను సాకారం చేసేందుకు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన మెగా డీఎస్సీ హామీని సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్, టెట్ నిర్వహణకు జూలై 1న షెడ్యూలు విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. మెగా డీఎస్సీకి సోమవారం కేబినెట్ ఆమోదం లభించింది. దీంతో మొత్తం 16,347 పోస్టులు భర్తీ చేసేందుకు మార్గం సుగమమైంది. ఎన్నికలకు ముందు గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన 6,100 పోస్టుల డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేయనున్నారు. జీవో త్వరలో జారీ కానుందని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు ఎన్నికలకు ముందు నిర్వహించిన టెట్ పరీక్షల ఫలితాలను రెండు రోజుల్లో విడుదల చేయనున్నారు. ఆ ఫలితాలు విడుదల చేసిన తర్వాత మళ్లీ టెట్ నిర్వహిస్తారు. తొలుత టెట్ నిర్వహించాలా? లేదా? అనే విషయంపై కేబినెట్‌లో చర్చించారు. తాజాగా బీఈడీ, డీఎడ్ కోర్సులు పూర్తిచేసిన వారికి మేలు చేసేలా మరోసారి టెట్ నిర్వహించాలని నిర్ణయించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీచేయనందున ఈ ప్రభుత్వం మెగా డీఎస్సీని వీలైనంత వేగంగా పూర్తిచేయాలని భావిస్తోంది. గత ఐదేళ్లపాటు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూశారు. ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో హడావుడిగా నోటిఫికేషన్ జారీచేసినా పరీక్షలు నిర్వహించేలోగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. మరోవైపు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారు. గత ప్రభుత్వం తరహాలో అదిగో ఇదిగో అని నిరుద్యోగులను మభ్యపెట్టకుండా ఇచ్చిన హామీ ప్రకారం వీలైనంత వేగంగా భర్తీ పూర్తిచేయాలని ప్రయత్నిస్తోంది. తొలి కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై ఎక్కువ సేపు చర్చ జరిగింది. టెట్ నిర్వహిస్తే ఎలా చేయాలి? లేకుండా ఎలా చేయాలి? అనే దానిపై పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ రెండు ఆప్షన్లతో ప్రతిపాదనలు తయారుచేశారు. మంత్రి లోకేశ్ సూచనతో టెట్ నిర్వహణకే కేబినెట్ ఆమోదం తెలిపింది.

జిల్లాల వారీగా ఖాళీలు

జిల్లా	ఎస్జీటీ	మొత్తం
శ్రీకాకుళం	144	543
విజయనగరం	267	583
విశాఖపట్నం	551	1134
తూర్పుగోదావరి	480	1346
పశ్చిమగోదావరి	434	1067
కృష్ణా	508	1213
గుంటూరు	501	1159
ప్రకాశం	124	672
నెల్లూరు	104	673
చిత్తూరు	946	1478
కడప	298	709
అనంతపురం	183	811
కర్నూలు	1801	2678

సబ్జెక్టుల వారీగా పోస్టులు

రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీలను పాఠశాల విద్యాశాఖ రెండు కేటగిరీలుగా విభజించింది. జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, గిరిజన సంక్షేమం(ఆశ్రమ) పాఠశాలల్లో 14,066 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపింది. వీటిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 655, హిందీ 536, ఇంగ్లిష్ 1086, గణితం 726, ఫిజికల్ సైన్స్ 706, బయోలాజికల్ సైన్స్ 957, సోషల్ స్టడీస్ 1368, వ్యాయామ విద్య 1691, ఎస్జీటీ 6,341 పోస్టులున్నాయి. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, మోడల్ స్కూల్స్, బీసీ, గిరిజన(గురుకులాలు), దివ్యాంగ, జువెనల్ విభాగాల్లో 2,281 పోస్టులున్నాయి. వీటిని జోన్ల వారీగా పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోస్టులు 266, జోన్-1లో 405, జోన్-2లో 355, జోన్-3లో 573, జోన్-4లో 682 పోస్టులు ఉన్నాయి.

'వైఎస్ఆర్' పోయె.. 'ఎన్టీఆర్' వచ్చె..!

- హెల్త్ యూనివర్సిటీకి మళ్లీ ఎన్టీఆర్ పేరు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ వర్సిటీకి వైఎస్ఆర్ పేరు పెడుతూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని సరిదిద్దింది. దీనికి తాజాగా కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది. తొలి కేబినెట్ సమావేశంలోనే.. అప్పటి ప్రభుత్వం పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీచేసిన 20 నెలల తర్వాత.. మళ్లీ పాత పేరునే నిర్ణయిస్తూ నిర్ణయం తీసుకుంది. జగన్ ప్రభుత్వ నిర్ణయంపై అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పేరు మార్పు వల్ల ఇప్పటి వరకూ చదువుకుని సర్టిఫికెట్లు పొందిన వారు ఇబ్బందులు పడతారని అనేక మంది ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కానీ.. వైసీపీ ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించి ఎన్టీఆర్ పేరును తొలగించింది. ఇప్పుడున్న ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు హెల్త్ వర్సిటీ పేరు మార్పులో కీలకంగా వ్యవహరించారు. అప్పటి వీసీ శ్యామ్‌ప్రసాద్ ఇతర వర్సిటీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైసీపీ ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందించారు. వర్సిటీలో ఉన్న ఎన్టీఆర్ బొమ్మను కూడా తొలగించాలని నిర్ణయించారు. కానీ.. ఉద్యోగుల నుంచి వ్యతిరేక రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించారు. అయితే వర్సిటీ ప్రాంగణంలో ఎన్టీఆర్ బొమ్మకు పోటీగా పెద్ద వైఎస్ఆర్ విగ్రహాన్ని పెట్టారు. ఆ విగ్రహం ప్రారంభం పేరుతో వర్సిటీ డబ్బులు వెచ్చించి భారీగా హడావుడి చేశారు. కాగా, అప్పట్లో అత్యుత్సాహం ప్రదర్శించిన ఉన్నతాధికారులపై కూడా దృష్టిపెట్టాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు.


మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న లోకేశ్, మాజీ ఎంపీ జయదేవ్ అభినందన

మా ప్రభుత్వంలో వేధింపులుండవు

- విద్యా ప్రమాణాల మెరుగుకు సహకరించండి
- ఉపాధ్యాయులు, అధికారులకు లోకేశ్ సూచన

అమరావతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తరహాలో తమ హయాంలో వేధింపులు ఉండవని అధికారులు, ఉపాధ్యాయులతో మంత్రి లోకేశ్ అన్నారు. మానవ వనరుల అభివృద్ధి (విద్య) శాఖ మంత్రిగా సోమవారం సచివాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. పూజలు చేసి చాంబర్‌లోకి ప్రవేశించారు. మెగా డీఎస్సీ విధివిధానాలకు సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం ఆ ఫైలును కేబినెట్ సమావేశానికి పంపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ఐదేళ్లలో అనాలోచిత విధానాల వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతిన్నాయన్నారు. మళ్లీ విద్యా రంగాన్ని గాడిలో పెట్టేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. గతంలో మాదిరిగా వారిపై అనవసరమైన పనిభారం, వేధింపులు ఉండవన్నారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.సవిత, టీజీ భరత్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బొండా ఉమ, భాష్యం ప్రవీణ్, నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీలు పి.అశోక్‌బాబు, వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, టీడీపీ నేతలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో తన చాంబర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై లోకేశ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో మంత్రులు సచివాలయానికి వచ్చేవారా అని అధికారులను ప్రశ్నించగా.. వచ్చేవారే కాదని బదులిచ్చారు. జగనే సచివాలయానికి రానప్పుడు ఇక మంత్రులేం వస్తారులే అని లోకేశ్ వ్యంగ్యంగా అన్నారు. కేబినెట్ సమావేశానికి వచ్చినా సంతంకం పెట్టి వెళ్లడమే కదా అప్పట్లో అని వ్యాఖ్యానించారు. సచివాలయ నిర్వహణకు నిధుల్లేవని ఉద్యోగులు తెలుపగా, వాటిని కూడా మళ్లించి ఉంటారని మంత్రి అన్నారు. తనను సామాన్య వ్యక్తిగానే చూడాలని, ప్రత్యేకతలు అవసరం లేదని స్పష్టం చేశారు. తన చాంబర్‌లోకి ప్రవేశించిన వెంటనే కుర్చీకి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తెలుపు రంగు వస్త్రాన్ని స్వయంగా తొలగించారు. ఇలాంటి ప్రత్యేకతలు వద్దని చెప్పారు.

మహిళల భద్రతలో ప్రభుత్వ నిబద్ధత భేష్: భువనేశ్వరి

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల భద్రత పట్ల ప్రభుత్వ నిబద్ధతను సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రశంసించారు. చీరాల ఘటనలో త్వరితగతిన చర్యలు తీసుకున్న హోం మంత్రి అనిత, ఏపీ పోలీస్-100 విభాగాన్ని ఆమె అభినందించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.

ప్రజల మంత్రి లోకేశ్‌కు అభినందనలు: భువనేశ్వరి

- కంగ్రాట్స్ డియర్.. మా సహకారం ఎప్పుడూ ఉంటుంది: బ్రాహ్మణి

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన లోకేశ్‌కు ఆయన తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణి ఎక్స్‌లో అభినందనలు తెలిపారు. 'ప్రజల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నీకు అభినందనలు. హెచ్‌ఆర్‌డీ, ఐటీ మంత్రిగా రాణిస్తావని, విద్య రంగాన్ని మెరుగుపరుస్తావని, రాష్ట్ర ఐటీ సామర్థ్యాన్ని పెంచుతావని విశ్వసిస్తున్నా' అని భువనేశ్వరి పేర్కొన్నారు. బ్రాహ్మణి స్పందిస్తూ... 'అంతా పల్లెల్లో నుండి అమెరికా వెళితే, అక్కడ చదివి పల్లె గడపల వద్దకు వచ్చి, సిమెంట్ రోడ్లతో, ఎల్‌ఈడీ వెలుగులతో వాటి రూపురేఖలు మార్చేశావు. పనిలో పడి విమర్శలను పట్టించుకోకుండా అవార్డుల పంట పండించావు. కుటుంబపరంగా ఎల్లవేళలా మీకు మా సహకారం ఉంటుంది. కంగ్రాట్స్ డియర్ నారా లోకేశ్' అని పేర్కొన్నారు.

హామీల అమలుకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిపోయిందనీ, కళాశాలలు, పాఠశాలలను కూడా ఈ మహమ్మారి వదిలిపెట్టలేదని కొలుసు అన్నారు. దీని నివారణకు చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని తెలిపారు. "రాష్ట్రంలో గంజాయి నియంత్రణకు తగు సూచనలు చేసేందుకు హోమ్,గిరిజన సంక్షేమం, విద్యాశాఖ, ఎక్సైజ్, వైద్యఆరోగ్యశాఖలకు చెందిన మంత్రులతో కమిటీని ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది" అని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును పునరుద్ధరిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. "గత వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీగా దాని పేరు మార్చింది. దీనివల్ల గతంలో ఈ యూనివర్సిటీలో చదివిన డాక్టర్లకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అందువల్ల యూనివర్సిటీ పేరును తిరిగి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీగా పేరు మార్చాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రజలకు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన ఐదు అంశాలకు కేబినెట్ తొలి సమావేశంలో ఆమోదం లభించిందన్నారు. మెగా డీఎస్సీ, ఏపీ భూహక్కుచట్టం- 2022 రద్దు, వృద్ధాప్య పింఛన్ల పెంపు, ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సెన్సస్-2024 నిర్వహణ, అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తూ కేబినెట్ సమావేశం నిర్ణయం తీసుకుంది. 'కూటమి పార్టీలు ఎన్నికల ముందే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చాయి. ఆ మేరకు 16,347 ఉపాధ్యాయ నియామకాల కోసం కేబినెట్ ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం టెట్ పరీక్షలను ప్రతి ఆర్నెల్లకోసారి నిర్వహించకపోవడం వల్ల లక్షలాది మంది అభ్యర్థులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఇకపై టెట్ పరీక్షను కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది" అని కొలుసు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టం- 2022 రద్దు ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపిందని కొలుసు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు తదితరుల పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలనుంచి రూ.4 వేలకు పెంచుతూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుందన్నారు. "పెన్షన్ పెంపుదల నిర్ణయంతో 28 కేటగిరీలకు చెందిన దాదాపు 66 లక్షల మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరనుంది. పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం ఏడాదికి రూ.33 వేల కోట్లకు పైగా ఖర్చు చేయనుంది. రూ.4 వేలకు పెంచిన పింఛన్ మొత్తాన్ని ఏప్రిల్, మే, జూన్‌లకు పెరిగిన రూ.1000 చొప్పున కలిపి ప్రతి పింఛన్‌దారుకు మొత్తంగా రూ.7 వేల పింఛన్ మొత్తాన్ని జూలై 1న అందిస్తాం. సచివాలయ ఉద్యోగులతో ఇంటివద్దనే పంపిణీ చేయించాలని మంత్రిమండలి నిర్ణయించింది. దివ్యాంగులు, క్షయ వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు ప్రభుత్వం పెంచింది. పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఇస్తున్న రూ.5వేల పింఛన్‌ను రూ.15 వేలకు, కిడ్నీ, లివర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇస్తున్న పింఛన్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు ప్రభుత్వం పెంచింది. ఈ విధంగా సామాజిక భద్రతా పింఛన్ల పెంపుదల వల్ల ప్రభుత్వంపై నెలకు రూ.819 కోట్లు అదనపు భారం పడుతుంది. బకాయిలతో కలిపి నెలకు రూ.4408 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుంది" అని కొలుసు వివరించారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ.. తొలిదశలో 183 క్యాంటీన్లు

గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను కక్షపూరితంగా మూసేసి నిరుపేదల నోటి దగ్గర ముద్ద తీసేసిందని మంత్రి కొలుసు ఆవేదన వ్యక్తం చేశారు. "పేదవాడి ఆకలి తీర్చేందుకు సీఎం చంద్రబాబు బాధ్యతలను స్వీకరించిన రోజునే అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరిస్తూ సంతకం పెట్టారు. వీటిని పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. 203 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలిదశలో 183 క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మిగిలిన 20 క్యాంటీన్లు తదుపరి దశలో ప్రారంభమవుతాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం సబ్సిడీ ధరకు రూ.5లకే అన్న క్యాంటీన్లలో అందుతుంది" అని తెలిపారు.

- పూర్వ అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి రాజీనామాలను ఆమోదిస్తూ, అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి శ్రీనివాస్‌ను నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదించింది.
- గత ప్రభుత్వ అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 7 శ్వేతపత్రాలను విడుదల చేస్తారు. పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం(ల్యాండ్, శాండ్, మైన్స్, జియాలజీ మొదలైనవి) మద్యం, శాంతిభద్రతలు, ఆర్థిక రంగంపై ఈ శ్వేతపత్రాలు ఈ నెల 28 నుంచి జూలై 18 వరకు విడుదల అవుతాయి.

3, 4 నెలల్లో నైపుణ్య సర్వే పూర్తి..

ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సెన్సస్-2024 నిర్వహణకు సిద్ధమవుతోందని మంత్రి కొలుసు తెలిపారు. దీనిపై కేబినెట్ ఆమోదం లభించిందన్నారు. "భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మన యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా చేసి ప్రపంచ యవనికపై మన ముద్ర పడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేబినెట్ భావించింది. ఆయా సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య సర్వేని 3 నుంచి 4 నెలల వ్యవధిలో పూర్తి చేస్తాం. అంతిమంగా మన రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ సంకల్పం" అని వివరించారు.

వలంటీర్లకు 'రోత పత్రిక' కట్!

» సచివాలయ ఉద్యోగులకు కూడా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మాజీ సీఎం జగన్ కుటుంబానికి చెందిన మీడియాకు మేలు చేసేలా గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు రద్దు చేసింది. ప్రజాధన దోపిడీకి అడ్డుకట్ట వేసింది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు సుమారు మూడేళ్లకుపైగా గత ప్రభుత్వం రోత పత్రికను పంపిణీ చేసింది. ఈ క్రమంలో ప్రజాధనాన్ని అలవెన్సు రూపంలో రూ.200 చొప్పున వారికి ఇచ్చి.. మరో చేత్తో జగన్ మీడియా సొంతం చేసుకుంది. ప్రతి నెలా జీతాలతో పాటు పేపర్ బిల్లును కలిపి ట్రెజరీలకు పంపేవారు. తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నెల కూడా అదే విధంగా పంపారు. అయితే, వచ్చే నెల నుంచి రోత పత్రిక బిల్లును నిలిపివేయాలని సర్కారు నిర్ణయించింది. పేపర్ బిల్లును మినహాయించి మిగిలిన జీతాలను మాత్రమే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు చెల్లించనున్నారు.

సచివాలయాల కంటే రోత పత్రికకే ప్రాధాన్యం

వైసీపీ హయాంలో సచివాలయాలకంటే జగన్ కుటుంబానికి చెందిన రోత పత్రికకే ప్రాధాన్యమిచ్చారు. ప్రతి నెలా రెండన్నర లక్షల మంది వలంటీర్లకు, ఒకటన్నర లక్షల మంది సచివాలయ ఉద్యోగులకు రోత పత్రికను పంపిణీ చేశారు. తద్వారా బిల్లుల రూపంలో ఏటా రూ.100 కోట్లు జగన్ మీడియా సొంతం చేసుకుంది. మరోవైపు, సచివాలయాలను ఏర్పాటు చేసిన వైసీపీ సర్కార్.. వాటి నిర్వహణను మాత్రం గాలికి వదిలేసింది. దీంతో ప్రతి నెలా నిర్వహణ వ్యయం కింద రూ.5 వేల నుంచి రూ.15 వేల దాకా పంచాయతీ కార్యదర్శులు భరించారు. కాగా, వైసీపీ ప్రభుత్వంలో జనాల సొమ్ముతో జగన్ మీడియా పబ్బం గడుపుకొంది. అప్పటి సీఎం సొంత మీడియాకు ప్రతి నెలా సుమారు రూ.10 కోట్ల చొప్పున ప్రకటనల రూపంలో ప్రజాధనం పారేది. దీంతో ఏటా రూ.100 కోట్లకు పైబడి జగన్ మీడియా లాభపడింది. దీంతో పాటు రెండన్నర లక్షల మంది వలంటీర్లకు, ఒకటన్నర లక్షల మంది సచివాలయ ఉద్యోగులకు నెలకు రూ.200ల చొప్పున ఇచ్చి.. రోత పత్రికను అంటగట్టింది. దీంతో ఏటా మరో రూ.100 కోట్ల ప్రజాధనం జగన్ మీడియాకు చేరింది. ఇప్పుడు ఈ దోపిడీకి టీడీపీ కూటమి ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది.

తిరుమల శారదమఠంలో అక్రమ కట్టడాలు

» ఫైవ్ స్టార్ రేంజ్‌లో గదులు

» అనుమతి 5 వేల చదరపు అడుగులకే

» నిర్మాణాలు 10,050 దాటిన వైనం.. వాటిని వెంటనే కూల్చివేయాలి

» టీటీడీ ఈవోకు ఫిర్యాదు చేస్తాం: కిరణ్‌రాయల్



మఠం ముందు అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న కిరణ్‌రాయల్

తిరుమల, జూన్ 24(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలోని శారదమఠంలో గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి. దీనిపై టీటీడీ ఈవో శ్యామలరావుకు ఫిర్యాదు చేస్తాం' అని జనసేన నేత కిరణ్‌రాయల్ తెలిపారు. గోగర్భం డ్యాం వద్ద ఉన్న విశాఖ శారదమఠాన్ని కిరణ్‌రాయల్ స్థానిక కార్యకర్తలతో కలిసి సోమవారం పరిశీలించారు. అనుమతులు లేకుండా భారీ స్థాయిలో ఎలాంటి అదనపు నిర్మాణాలు చేస్తారంటూ నిర్వాహకులను ప్రశ్నించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి అరాచకాలకు తిరుమల కూడా బలైంది. గత ఈవో ధర్మారెడ్డి, ఛైర్మన్, పోలీసులు, అధికారులందరూ కలిసి తిరుమలను పూర్తిగా సర్వనాశనం చేశారు. ప్రతి మఠం నుంచి తలనీలాలు సమర్పించే కల్యాణకట్టల స్థలం వరకు కబ్జా చేసి వైసీపీ చేతుల్లో పెట్టారు. స్వరూపానంద స్వామి నిబంధనలకు విరుద్ధంగా ఫైవ్ స్టార్ హోటల్‌ను తలపించేలా మఠం వెనుకభాగంలో గదులు కడుతున్నారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవు. ఐదువేల చదరపు అడుగులకు మాత్రమే అనుమతి ఉంటే దాదాపు 10,050 చదరపు అడుగుల నిర్మాణం చేశారు. ఈవో అనుమతి ఇచ్చారని చెబుతున్నారు. అయితే దానికి సంబంధించిన పత్రాలు మాత్రం మఠం నిర్వాహకుల వద్ద లేవు. తిరుపతిలో కూడా లేని విధంగా తిరుమలలో జీ ప్లస్ సిక్స్ కట్టడాలను శారదమఠంలో చేస్తున్నారు. దీన్ని జనసేన తీవ్రంగా ఖండిస్తోంది. ఈ అక్రమ కట్టడాలపై పెద్ద పోరాటం చేస్తాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పినట్టుగా తిరుమలను ప్రక్షాళన చేయడంలో భాగంగా ప్రతి మఠానికీ వెళ్లి అక్రమాలను బయటకి తీస్తాం. శారదమఠంలోని అక్రమ కట్టడాలను కూలదోస్తేనే భవిష్యత్తులో మఠాల్లో అక్రమంగా నిర్మాణాలు చేయాలంటే భయపడతారు. మఠాల ద్వారా ఏడాదికి దాదాపు రూ.500 కోట్ల స్కామ్ జరుగుతున్నట్టు తెలిసింది. తిరుమలలోని 80 శాతం మఠాలను వైసీపీ నాయకులు భయపెట్టి తమ చేతుల్లోకి తీసుకున్నారు. నెలకు రూ.లక్షలు దండుకుంటున్నారు' అని కిరణ్ అన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక జనసేన నేతలు పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లినా.. బిల్లుల గోలే!

» జగన్‌కు చుక్కలు చూపుతున్న వైసీపీ కార్యకర్తలు

» కోర్టు ద్వారా బిల్లుల కోసం పోరాటం చేద్దాం

» పులివెందుల నేతలకు మాజీ సీఎం సూచన

» యలహంక ప్యాలెస్ వద్దా శ్రేణుల ఆందోళన

» సైకో జగన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు

బెంగళూరు/అమరావతి-ఆంధ్రజ్యోతి/పులివెందుల, జూన్ 24: పెండింగ్ బిల్లుల కోసం వైసీపీ నేతలు, కార్యకర్తలు చేస్తున్న ఆందోళనలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పనులు చేసినవారు పులివెందులలో ఆయన సమక్షంలోనే ఆందోళనకు దిగారు. శనివారం నుంచి సోమవారం వరకు మూడ్రోజులపాటు నిరసన తెలిపారు. ఆయన బెంగళూరు వెళ్లినా అక్కడకు వెళ్లి ఆగ్రహంతో నినాదాలు చేశారు. పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) పనులు చేపట్టిన స్థానిక ఛోటామోటా నేతల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు జగన్ మాజీ అవడంతో తమ పరిస్థితేంటని శని, ఆదివారాల్లో ఆయన్ను నిలదీశారు. సోమవారం కూడా పలువురు ఆయన్ను కలిసి వాపోయారు. బిల్లులు ఆగిపోతే తమ పరిస్థితి దయనీయంగా మారుతుందని ఎంపీ అవినాశ్‌రెడ్డికి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డికి ఎన్నిసార్లు చెప్పుకొన్నా లాభం లేకపోయిందన్నారు. ఎన్నికల వరకు సాగదీసి.. చివరకు చేతులెత్తేశారని వాపోయారు. జగన్ స్పందిస్తూ ఎవరు అధైర్యపడొద్దని.. అందరికీ బిల్లులు వచ్చేలా కోర్టు ద్వారా సాధించుకుందామని సూచించారు. రాబోయే ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వం మనదేనన్నారు. భయపడాల్సిన అవసరం లేదని.. అందరికీ అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజాద్‌బాషా, రఘురామిరెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు, వైఎస్ మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం అనిమెల సంగిరెడ్డి, వైఎస్ పురుషోత్తంరెడ్డి కుటుంబాలను జగన్ పరామర్శించారు. తర్వాత ప్రత్యేక హెలికాప్టర్లో భార్యాసమేతంగా బెంగళూరు యలహంక ప్యాలెస్‌కు వెళ్లారు. అయితే పులివెందులకు చెందిన వైసీపీ అభిమానులు, కార్యకర్తలు అక్కడకు కూడా పెద్దసంఖ్యలో చేరుకున్నారు. పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల చేయించాలంటూ ఆయన్ను ఘెరావ్ చేసినట్లు తెలిసింది. అయితే జగన్‌ను కలిసేందుకు వీలులేకుండా సిబ్బంది ప్యాలెస్ గేట్లు మూసివేయడంతో కార్యకర్తలు మండిపడ్డారు. 'సైకో జగన్ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.



బెంగళూరులోని జగన్ ప్యాలెస్ వద్ద నినాదాలు చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

పదేళ్ల తర్వాత బెంగళూరు ప్యాలెస్‌కు జగన్!

» ఆరు రోజులు ఇక్కడే మకాం!

ఆంధ్రప్రదేశ్ శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయిన దరిమిలా.. మాజీ సీఎం, ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరులోని తన యలహంక ప్యాలెస్‌కు వచ్చారు. దాదాపు పదేళ్ల తర్వాత ఆయన ఇక్కడకు రావడం గమనార్హం. భార్య భారతితో కలిసి పులివెందుల నుంచి సోమవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా ప్యాలెస్ ప్రాంగణంలో దిగారు. ఇక్కడ ఆరు రోజులపాటు బస చేస్తారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో పరాజయం, కనీసం ప్రతిపక్ష నేత హోదా కూడా దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు లోనైన జగన్.. గత శుక్రవారం అసెంబ్లీకి హాజరై శాసనసభ్యుడిగా ప్రమాణం చేశారు. కానీ సభలో కూర్చోకుండా వెళ్లిపోయారు. తర్వాతి రోజు స్పీకర్ ఎన్నికలో ఆయనతో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా పాల్గొనలేదు. జగన్ శనివారం పులివెందుల వెళ్లారు. సోమవారం యలహంక ప్యాలెస్‌కు చేరుకున్నారు. ఉమ్మడి ఆంధ్ర సీఎంగా వైఎస్ ఉన్నప్పుడు జగన్ యలహంకలో ప్రత్యేక ఆసక్తితో సుమారు 23 ఎకరాల విస్తీర్ణంలో సకల సదుపాయాలతో ప్యాలెస్ నిర్మించుకున్నారు. వైసీపీ ఏర్పాటుకు ముందు జగన్ ఎక్కువగా ఇక్కడే గడిపేవారు. పార్టీ ప్రారంభించాక ఏపీలోనే ఉన్నారు. పదేళ్ల తర్వాత మళ్లీ ఇక్కడకు వచ్చారు.

వైసీపీ భవనాలన్నీ అక్రమమే

» 18 నిర్మాణాలకు దరఖాస్తులే చేయలేదు

» మరో 4 ఆఫీసులకూ అనుమతులు లేవు

» ఇప్పుడు చర్యలు తీసుకుంటుండటంతో గగ్గోలు

» నోటీసులు జారీ చేస్తున్న స్థానిక సంస్థలు

అమరావతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను వైసీపీ కార్యాలయాల నిర్మాణాల కోసం రాష్ట్రవ్యాప్తంగా కారుచౌకగా లీజుకు తీసుకున్నారు. అనుమతులు లేకుండానే జిల్లా కేంద్రాల్లో నిర్మాణాలు చేపట్టారు. 18 జిల్లాల్లో వైసీపీ కార్యాలయాల భవనాలకు స్థానిక సంస్థల నుంచి అనుమతులు తీసుకోలేదు. శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తాడేపల్లి, నరసరావుపేట, బాపట్ల, నెల్లూరు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి, తిరుపతిలో భవన నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తు కూడా చేయలేదు. విశాఖ, విజయనగరం, మచిలీపట్నం, కర్నూలులో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసినా.. వాటికి ఇంకా అనుమతులు రాలేదు. ఒక్క ఒంగోలులోనే అన్ని అనుమతులు తీసుకుని వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించారు. అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, చిత్తూరు జిల్లాల్లో వైసీపీ కార్యాలయాల నిర్మాణాల కోసం కేటాయించిన భూములు ఖాళీగానే ఉన్నాయి. సాధారణంగా భవన నిర్మాణాలు చేపట్టే ముందు స్థానిక సంస్థల అనుమతులు తీసుకుంటారు. అధికారంలో ఉన్నామన్న ధీమానో ఏమో కానీ వైసీపీ కార్యాలయాల నిర్మాణాల కోసం స్థానిక సంస్థల నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోలేదు.

నాడు జగన్ ఏమన్నారంటే...

ముఖ్యమంత్రిగా జగన్ అధికారపగ్గాలు చేపట్టిన కొత్తలో ప్రజా వేదికకు అనుమతులు లేవంటూ కూల్చివేయించారు. అనుమతులు లేని కార్యాలయంలో కలెక్టర్లు, ఎస్పీలు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మంత్రులతో కూర్చుని ముఖ్యమంత్రి హోదాలో సమీక్షలు నిర్వహించడం ఏమిటంటూ అప్పట్లో జగన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు లేని కట్టడాలను కూల్చేస్తామని ప్రకటించారు. అయితే అక్రమ కట్టడాల పేరిట ప్రతిపక్ష నేతలను వేధించారు. పలువురు నేతలకు చెందిన కట్టడాలను కూల్చేశారు. కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వైసీపీ కార్యాలయాల భవనాల నిర్మాణాలు చేపట్టారు. జగన్ ప్రభుత్వంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరి జగన్ చెప్పిన నిబంధనలు ఈ భవనాలకు వర్తించవా? ఆయన చెప్పినట్టు ఈ అక్రమ కట్టడాలనూ కూల్చివేయాలి కదా?

తప్పు చేసి గగ్గోలు

స్థానిక సంస్థలు అనుమతులు లేని భవనాలకు నోటీసులు జారీ చేస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ నిందిస్తోంది. తన తప్పులు కప్పిపెట్టి చంద్రబాబు ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తోంది. అక్రమ నిర్మాణాలను కూల్చేస్తుంటే జగన్, ఆయన రోత పత్రిక గతాన్ని మరిచి అన్యాయమంటూ గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందని జగన్ భావించారు. కానీ వాస్తవ విషయాలను ప్రజలు గుర్తించడంతో వ్యతిరేకత రావడం లేదు. దీంతో వైసీపీకి పాలుపోవడం లేదు. కిందస్థాయి నేతలు కూడా అక్రమ కట్టడాల కూల్చివేతలపై నోరు మెదపలేకపోతున్నారు. గతంలో చేసిన తప్పులకు వైసీపీ ఇప్పుడు మూల్యం చెల్లిస్తోంది.

కార్యాలయాలకు నోటీసులు

» విజయనగరం, పుట్టపర్తిలో గోడలకు అతికింపు

» అనుమతులు లేవంటూ హెచ్చరిక



పుట్టపర్తిలో వైసీపీ జిల్లా కార్యాలయ భవనానికి అతికించిన నోటీసులు

విజయనగరం/పుట్టపర్తి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, పుట్టపర్తిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయాలకు స్థానిక సంస్థలు నోటీసులు జారీ చేశాయి. విజయనగరం నడిబొడ్డున దాసన్నపేట రింగురోడ్డును ఆనుకుని నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం భవనానికి సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. భవనం గోడకు నోటీసులను అతికించారు. సర్వే నంబరు 569లో చేపడుతున్న నిర్మాణానికి అనుమతులు లేవని అందులో పేర్కొన్నారు. వెంటనే నిర్మాణ ప్రక్రియ ఆపాలని, వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనాన్ని ఎందుకు కూల్చివేయకూడదో చెప్పాలంటూ పుట్టపర్తి పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు.



అనంతపురంలో నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద జగన్ చిత్రపటానికి చెప్పులదండ వేసి నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

జనం సొమ్ముతో వైసీపీ ప్యాలెస్‌ల నిర్మాణమా?

» రాష్ట్రవ్యాప్తంగా అన్నీ స్వాధీనం చేసుకోవాలి

» వాటిని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించాలి

» అనంతలో తెలుగు మహిళల ఆందోళన

» జగన్ చిత్రపటానికి చెప్పులదండ వేసి నిరసన

అనంతపురం అర్బన్, జూన్ 24: ప్రజల సొమ్ముతో విలాసవంతమైన ప్యాలెస్‌ల మాదిరిగా వైసీపీ కార్యాలయాలు నిర్మిస్తారా అని తెలుగు మహిళలు మండిపడ్డారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని హెచ్చెల్సీ కాలనీ సమీప ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనం ఎదుట వారు సోమవారం ఆందోళనకు దిగారు. మాజీ సీఎం జగన్ చిత్రపటానికి చెప్పులదండ వేసి ఊరేగించారు. జగన్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని మాట్లాడుతూ... అనంతపురంలో జలవనరుల శాఖకు చెందిన 1.50 ఎకరాల భూమిని వైసీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం కోసం తీసుకున్నారని అన్నారు. ఏడాదికి ఎకరానికి కేవలం రూ.వెయ్యి చెల్లించేలా 33 ఏళ్ల పాటు భూమిని లీజుకు తీసుకోవడం ఏంటని మండిపడ్డారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసి ప్యాలెస్‌లు కట్టుకోవడం దుర్మార్గమని, నిబంధనలను అతిక్రమించిన మాజీ సీఎం జగన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న వైసీపీ కార్యాయాలను ప్రభుత్వం స్వాధీనం చేసకోవాలని, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ స్థలాల లీజు రద్దు చేసుకుంటున్నాం!

» టెండర్ల కోసం ఎవరినీ బెదిరించలేదు

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వివరణ

» రద్దు కోరుతూ దరఖాస్తు రాలేదు: ఆర్టీసీ

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 24: ఆర్టీసీ స్థలాల లీజును రద్దుచేసుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డి ప్రకటించారు. 'చెవిరెడ్డి చేతికి ఆర్టీసీ స్థలాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. మరలా వైసీపీనే అధికారంలోకి వస్తుందన్న ధీమాతో ఆర్టీసీ స్థలాలను లీజు పేరుతో కొట్టేసేందుకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి నడిపిన వ్యవహారం వెలుగు చూడడంతో వైసీపీ శ్రేణుల్లోను, ఆర్టీసీ అధికారుల్లోనూ గుబులు రేపింది. ఈ నేపథ్యంలో మోహిత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాము ఆర్టీసీ స్థలాలను నిబంధనల మేరకు తీసుకున్నామని, మార్కెట్ ధర కంటే అధికంగా ఆర్టీసీకి చెల్లిస్తున్నట్లు తెలిపారు. టెండర్ల వ్యవహారంలో తాము ఎవరినీ బెదిరించలేదని, ప్రలోభాలకు గురిచేయలేదని పేర్కొన్నారు. తాము వీలేరు, అద్దంకి, తెనాలి, ఒంగోలులోని స్థలాల కోసం దరఖాస్తు చేసుకోగా, అద్దంకి, ఒంగోలులో తమకు అనుమతులు వచ్చాయని తెలిపారు. గడిచిన ఆరునెలలుగా తాము రూ.లక్షల్లో సొమ్మును ఆర్టీసీకి చెల్లించామని, తద్వారా తమకే నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కాగా, తమకు కేటాయించిన స్థలాల లీజును రద్దుచేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని మోహిత్‌రెడ్డి కోరారు. ఈ విషయమై ఆర్టీసీ ఆర్.ఎం. సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ అంతా ఈడీ పరిధిలోనే జరిగిందన్నారు. అగ్రిమెంట్ నిబంధనల మేరకు తాము ముందుకెళతామని, అయితే ఇంతవరకు ఎవరూ లీజు రద్దు కోరుతూ దరఖాస్తు చేయలేదని తెలిపారు. అలాంటిదేమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం, పూలమొక్క ఇచ్చి సత్కరిస్తున్న సీపీ రామకృష్ణ, డీసీపీ రాణా

డిప్యూటీ సీఎంను కలిసిన సీపీ, డీసీపీ

విజయవాడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను జిల్లా పోలీసు కమిషనరేట్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. జలవనరుల శాఖ ప్రాంగణంలో ఉన్న పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయానికి పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ, డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా సోమవారం వెళ్లారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలింపు..!



అర్ధరాత్రి లారీలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

రాణిగారితోట: కృష్ణానదిలో ఇసుక అక్రమ రవాణా మరో అడుగు ముందుకు వేసి అర్ధరాత్రి లారీల్లో తరలించే స్థాయికి ఎదిగింది. ఇసుక రీచ్‌లు ప్రస్తుతం మూత పడడంతో ఇసుకకు గిరాకీ పెరగి అక్రమ రవాణా మొదలైంది. దీంతో ఇసుకను రాత్రివేళల్లో కృష్ణలంక ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు టిప్పర్ లారీతో తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. వీరు రెండు మార్గాలు ఎంచుకున్నారు. ఒకటి రామలింగేశ్వర నగర్ స్మశానవాటిక వైపు నుంచి నదిలోకి, మరొకటి కనకదుర్గవారధి నుంచి నదిలోకి వెళ్లి ఇసును తరలించుకుపోతున్నారు. ఈ తతంగమంతా అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 4గంటల మధ్యలో జరుగుతుంది. ముందుగా ఆయా వ్యక్తులు పలుమార్లు రెక్కీ నిర్వహించి ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత పని ముగిస్తారు. లారీ ఇసుక నింపేందుకు అవసరమయ్యే కూలీలను అదేలారీలో తీసుకువెళతారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగుతారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి రెండు రోజుల క్రితం వెళ్లగా సదరు సెక్టార్ ఎస్‌ఐ ఇసుక తరలిస్తున్న వారిని పిలిపించి ఇకపై ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్టు సమాచారం. అయితే ఈ వ్యవహారం పోలీసులకు ముందుగానే తెలుసని స్థానికులు అంటున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కంట్రీ అండ్ టౌన్ ప్లానింగ్ రిటైర్డ్ డైరెక్టర్ రాముడు

టౌన్‌ప్లానింగ్ స్కీమ్‌లు మెగా పట్టణాల అభివృద్ధికి ఉపయోగం

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 24: టౌన్ ప్లానింగ్ స్కీమ్‌లు మెగా పట్టణాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర కంట్రీ అండ్ టౌన్ ప్లానింగ్ రిటైర్డ్ డైరెక్టర్ వి.రాముడు అన్నారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని డాక్టర్ కేఎల్ రావు భవనంలో టౌన్ ప్లానింగ్ స్కీంలపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన టౌన్ ప్లానింగ్ స్కీమ్స్ ద్వారా పట్టణాల్లో కలిగే ఉపయోగాలను వివరించారు. ఇనిస్టిట్యూట్ సభ్యులు సీవీ శ్రీరామ్, ఎంఎల్ఎస్ దేవకుమార్, రమేష్‌కుమార్, సీహెచ్. నాగమల్లేశ్వరరావు, అడుసుమిల్లి ఉమా పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ తదితరులు

29న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్

ధర్నాచౌక్, జూన్ 24: ఈ నెల 29న జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సంఘం జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్‌ను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులను చర్చించేందుకు స్థానిక బాలోత్సవ్ భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నీట్ పరీక్షలను రద్దు చేసి రాష్ట్రస్థాయిలో ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో 14సార్లు పేపర్ లీక్ అయిందన్నారు. సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కిరణ్‌కుమార్, రాష్ట్రనేతలు కే.బాను ప్రసాద్, రవితేజ, దినేష్, సాయికుమార్, వంశీ పాల్గొన్నారు.



ఎన్.ఎస్ఎం స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గం

'ఎన్ఎస్ఎం' పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా నల్లూరి

లబ్బీపేట, జూన్ 24: ఎన్.ఎస్.ఎం పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా నల్లూరి వెంకట జగదీష్, కార్యదర్శిగా గుర్జీత్ సింగ్ సహని ఎన్నికయ్యారు. పటమటలోని స్కూల్ ఆవరణలో సోమవారం పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెంట్ బ్రదర్ రాయప్ప రెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం నూతన అధ్యక్షుడు నల్లూరి వెంకట్ జగదీష్ మాట్లాడుతూ స్కూల్ ప్రారంభమై 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా తమ సంఘం ఆధ్వర్యంలో వివిధ సేవ, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఆఫీస్ బేరర్స్ మూడేళ్ల పాటు అంటే 2027 మార్చి 31 వరకు కొనసాగుతుందన్నారు. ఇటీవల పాఠశాల ఓల్డ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఆరు కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా జయనారాయణ కురేటి, జూనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా జయదీప్ ఆర్యా, సీనియర్ సెక్రటరీగా అయేషా, జూనియర్ సెక్రటరీగా సుహృతి దుర్గా, ట్రెజరర్‌గా కౌతా వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

వీఎంసీలో 'స్టాండింగ్' ముసలం

గ్రూపులుగా విడిపోయిన మేయర్, కార్పొరేటర్లు

- కొంతమంది కార్పొరేటర్లతో మేయర్, మరికొంతమందితో డిప్యూటీ మేయర్ భేటీలు
- పోటీ చేయాలని భావిస్తున్న టీడీపీ..?
- అనివార్యం కానున్న ఎన్నిక..!



ఆంధ్రజ్యోతి - చిట్టినగర్: వీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక వైసీపీలో ముసలం పెడుతోంది. స్టాండింగ్ కమిటీ ఎన్నికకు కమిషనర్ కొద్దిరోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో తమ ప్రాబల్యాన్ని, బలాన్ని చూపించుకోవాలని మేయర్, డిప్యూటీ మేయర్లు గ్రూపులుగా విడిపోయినట్టు తెలుస్తోంది. స్టాండింగ్ కమిటీ ఎన్నికే ప్రధాన అజెండాగా ఎవరికి వారు వేర్వేరు సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. ఇందుకు వీఎంసీ వేదికైంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి కొంతమంది కార్పొరేటర్లతో తన చాంబర్‌లో సమావేశమయ్యారు. అదే సమయంలో డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి మరికొంతమంది కార్పొరేటర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మరో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ లేకపోయినప్పటికీ ఆమెను నడిపిస్తున్న తండ్రి ఆళ్ల చెల్లారావు పాల్గొనడం గమనార్హం. జూలై 9న స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించడానికి వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ ఈనెల 21న నోటిఫికేషన్ విడుదల చేశారు. సోమవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. వచ్చే నెల 1న నామినేషన్ల దాఖలుకు తుది గడువు. ఇప్పటి వరకు ఒకమాటగా సాగిన స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎంపిక ఈసారి ఎన్నిక నిర్వహించే పరిస్థితిని తెచ్చేలా కనిపిస్తున్నాయి. నగరంలో మొత్తం 64 డివిజన్లున్నాయి. ఇందులో టీడీపీ కార్పొరేటర్లు 14మంది కాగా 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య వైసీపీకి వెళ్లారు. 11వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న కేశినేని శ్వేత రాజీనామా చేయడంతో ఖాళీగా ఉంది. కార్పొరేషన్‌లో టీడీపీకి 12 మంది కార్పొరేటర్లున్నారు. వైసీపీకి 50 మంది కార్పొరేటర్లున్నారు. 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ ఎన్నికలకు ముందు బీజేపీలోకి వెళ్లారు. దీనితో వైసీపీకి 49 మందే ఉన్నారు.

మేయర్‌పై తిరుగుబాటు

స్టాండింగ్‌లో ఆరుగురు సభ్యులుంటారు. ఈ కమిటీకి మేయర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. నగరంలో మూడు నియోజకవర్గాలుండగా ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు కార్పొరేటర్లను స్టాండింగ్ కమిటీలోకి ఎన్నుకుంటారు. ప్రతి 10 మంది కార్పొరేటర్లకు ఒకరిని స్టాండింగ్ కమిటీకి ఎంపిక చేస్తారు. ఈ స్టాండింగ్ కమిటీ పదవీకాలం ఏడాదిపాటు ఉంటుంది. కొద్దిరోజుల క్రితం వరకు ఈ 3 నియోజకవర్గాల్లో రెండింటిలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉండేవారు. ఆ ఎమ్మెల్యేలు సూచించిన కార్పొరేటర్లను స్టాండింగ్ కమిటీకి ఎంపిక చేశారు. పోటీ లేకుండా ఏకగ్రీవం చేసేవారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మూడు నియోజకవర్గాల్లో రెండు చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలున్నారు. ఒకచోట బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. ఎన్నికల తర్వాత వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు రాజకీయ కార్యకలాపాలు నిర్వహించలేదు. మౌనంగా ఉన్నారు. వాస్తవానికి ఫ్లోర్ లీడర్ ఎవరిని స్టాండింగ్ కమిటీకి ఎంపిక చేయాలన్న దానిపై మేయర్‌తో చర్చించాలి. ఎన్నికల తర్వాత నుంచి ఫ్లోర్ లీడర్ సత్యనారాయణ ఛాయలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో మేయర్, డిప్యూటీమేయర్లు ఎవరి బలాన్ని వారు చూపించుకోవాలనుకుంటున్నారు. మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు అండదండలు పుష్కలంగా ఉండడంతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఇష్టానుసారంగా వ్యవహరించారన్న అసంతృప్తితో వైసీపీ కార్పొరేటర్లున్నారు. మేయర్ దూకుడుకు ఇప్పుడు జరగబోయే స్టాండింగ్ కమిటీ ఎన్నికలో చెక్ పెట్టాలని భావిస్తున్నారు. తన వర్గం కార్పొరేటర్లతో మేయర్ భాగ్యలక్ష్మి చాంబర్‌లో సమావేశం నిర్వహిస్తే, డిప్యూటీ మేయర్ అవుతు శైలజ చాంబర్‌లో తన వర్గ కార్పొరేటర్లతో భేటీ అయ్యారు. తాజా భేటీల్లో ఎలాంటి ప్రత్యేకత లేదని చెబుతున్నా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో తన వర్గం వారిని ఎన్నుకోవాలన్న అజెండాతో భేటీలు జరిగాయని తెలుస్తోంది. ఈసారి స్టాండింగ్ కమిటీకి పోటీ చేయాలన్న ఆలోచనలో టీడీపీ ఉన్నట్టు సమాచారం. ఇదే కనుక జరిగితే ఎన్నిక అనివార్యమవుతుంది.

రామోజీరావు సంస్మరణ సభ

ఏర్పాట్లు వేగవంతం చేయండి

- అధికారులకు మంత్రి పార్థసారథి ఆదేశం



ఏర్పాట్లు పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సారథి

పెనమలూరు, జూన్ 24: పద్మవిభూషణ్ గ్రహీత, రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఈనెల 27న రామోజీరావు సంస్మరణ నేపథ్యంలో సోమవారం సాయంత్ర మండలంలోని తాడిగడప వందడుగుల రోడ్డులో అనుమోలు గార్డెన్స్ వద్ద జరుగుతున్న సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈసభకు సీఎం చంద్రబాబు వస్తున్నందున ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కోరారు. సభా ప్రాంగణంలో పందిరి, ప్రధాన వేదిక, గ్యాలరీలు, బారికేడ్లు కట్టుదిట్టంగా చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే అతిథులకు, ప్రజలకు, జర్నలిస్టులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను సజావుగా చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు, రహదారిలో ఎలాంటి చెత్త చెదారం లేకుండా పారిశుధ్యం నిర్వహించాలన్నారు. మంత్రి వెంట ఉయ్యూరు ఆర్డీవో రాజు, టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనరు వెంకటేశ్వరరావు, ఈఈ విజయలక్ష్మి ఉన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఉన్నతాధికారులు

ఈనెల 27న తాడిగడప వందడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన దివంగత ఈనాడు రామోజీ రావు సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీఆర్డీయే కమిషనర్ కాటంనేని భాస్కర్, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. వందడుగుల రోడ్డులోని సభాస్థలాన్ని సోమవారం ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టరు సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్, కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నఈం అస్మి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు. సీఆర్డీయే అదనపు కమిషనర్ అలీంబాషా, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కస్తూరి, ప్రొటోకాల్ అదనపు డైరెక్టరు వాణి, ఉద్యాన శాఖ డీడీ ధర్మజ, ఉయ్యూరు ఆర్డీవో రాజు, తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఎస్వో పార్వతి, డీహెచ్‌వో జ్యోతి, విద్యుత్‌శాఖ ఎస్ఈ మురళీమోహన్, ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనధికార ఫుడ్ డెలివరీ రాకెట్‌ను ఛేదించిన రైల్వే

రైల్వేస్టేషన్, జూన్ 24: రైల్వే ప్రయాణికులకు అనధికారికంగా ఫుడ్‌డెలివరీ చేస్తున్న రాకెట్‌ను రైల్వే క్యాటరింగ్ విభాగం ఛేదించినట్టు రైల్వే డివిజన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెయిన్ నెంబర్ 12717 రత్నచల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22న రాజమండ్రి స్టేషన్‌లో ఉండగా చట్టవిరుద్ధంగా అనధికారికంగా డెలివరీ బాయ్ ప్రయాణికులకు ఆహారం అందిస్తుండా గుర్తించారు. అతడిని విచారించగా ఈ ముఠా అంతటికీ కీలకమైన కింగ్‌పిన్ మహిళ అనధికారిక క్యాటరింగ్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. ఆమెపై 144(1) సెక్షన్ ప్రకారం రాజమండ్రి ఆర్‌పీఎఫ్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. రాకెట్‌ను ఛేదించినందుకు కమర్షియల్ విభాగం సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబును, క్యాటరింగ్ టీమ్‌ను, డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అభినందించారు. ప్రయాణికులకు అధికారికంగా మంచి ఆహారాన్ని అందించేందుకు రైల్వే కట్టుబడి ఉందని, ఇకపై తాము నిరంతర నిఘా పెడతామని అనధికారిక ఫుడ్‌డెలివరీ చేసేవారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఐఆర్‌సీటీసీ ఆమోదిత ఫుడ్‌డెలివరీని మాత్రమే రైల్వే ప్రయాణికులు స్వీకరించాలన్నారు. ఎవరికైనా అనుమానాలుంటే 139కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.



ముఖేష్‌కుమార్ మీనా, హరిజవహర్లాల్ దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అధికారులు,

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

వన్‌టౌన్, జూన్ 24: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు కార్యదర్శిగా నియామకమైన ఎం.హరిజవహర్లాల్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయ పద్ధతిలో సాదర స్వాగతం పలికారు. ఉప కార్యనిర్వహణ అధికారి గోగినేని లీలాకుమార్ వారికి స్వాగత సత్కారాలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న మీనా దంపతులు

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి ముఖేష్ కుమార్ మీనా దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయ పద్ధతిలో సాదర స్వాగతం పలికారు. ఉప కార్యనిర్వహణ అధికారి గోగినేని లీలా కుమార్ వారికి స్వాగత సత్కారాలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేయగా అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



ధర్మపథం వేదికపై సుందరకాండ పారాయణం

దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై సోమవారం సాయంత్రం సుందరకాండ పారాయణం జరిగింది. జంక్షన్‌కు చెందిన ఎం.సులోచన ఆధ్వర్యంలోని ముముక్షుభజన మండలి సుందరకాండను భక్తి పురస్కరంగా పారాయణ చేశారు. ఎంఎస్ రామారావు గానం చేసిన సుందరకాండ, హనుమాన్ చాలీసాలు భక్తులను అలరించాయి. వీటితో పాటు విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం, భగవద్గీత పారాయణ చేశారు. దేవతలకు సంబంధించిన సంప్రదాయ కీర్తనలను ఆలపించారు.



ఈవోకు లేఖ అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

దుర్గమ్మకు జూలై 14న భాగ్యనగర్ బోనాలు

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు జూలై 14న బోనాలు సమర్పించనున్నట్టు భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్యతో పాటు కమిటీ సభ్యులు సోమవారం దుర్గగుడి ఈవో రామారావును ఆయన చాంబర్‌లో కలిసి బోనాల సమర్పణ ఏర్పాట్లను గురించి లేఖ అందచేశారు. 15ఏళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలుసుఖ శాంతులలో ఉండాలని కోరుతూ బోనాలను సమర్పిస్తున్నట్టు అంజయ్య తెలిపారు. జూలై 14 ఆదివారం వెయ్యిమందితో బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి నుంచి ఊరేగింపుగా బయలుదేరి కొండపైకి చేరుకుని అమ్మవారికి బంగారు బోనాలు పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్టు చెప్పారు. ఇందుకు ఏర్పాట్లు చేయాలని ఈవోను కోరారు. ఇదే క్రమంలో జూలై 26న దుర్గగుడి తరపున హైదరాబాద్ పాతబస్తీలోని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి రావాలని ఈవో రామారావును ఆహ్వానించారు.

భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను

దశలవారీగా ఆధునీకరిస్తాం

- మున్సిపల్ మంత్రి నారాయణ

పటమట, జూన్ 24: నగరంలో దశలవారీగా భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునీకరిస్తామని మంత్రి పొంగూరి నారాయణ హామీ ఇచ్చారు. ఓపెన్ డ్రైనేజీ పక్కనే నీటి కుళాయిలు, నీటి సరఫరా పైపులుండటంతో వాటికి రంధ్రాలు పడి నీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. డివిజన్‌లోని రెల్లిస్ కాలనీలో ఎమ్మెల్యే రామ్మోహన్‌తో కలిసి మ్రంతి సోమవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ ఇంటింటికీ వెళ్లి నీటి సరఫరా ఏయే సమయాల్లో వస్తుంది, నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో నిత్యం 600 వాటర్ శాంపిల్స్ తీశామని, ఎలాంటి కలుషితం లేదని రిపోర్టు వచ్చిందని, మంచినీటి పైపులైన్లు అధికంగా ఓపెన్ డ్రెయినేజీ పక్కనే పైప్‌లైన్లు ఉండటం కలుషితమవుతున్నాయన్నారు. కమిషనర్లతో తాను ప్రత్యేకంగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పానన్నారు. భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ బాగు చేసేందుకు చాలా వ్యయమవుతుందని, దశల వారీగా బాగు చేస్తామన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు హయాంలో స్ట్రామ్ వాటర్ నిధులను రూ.450 కోట్లు ఖర్చు చేసి ఎల్‌అండ్‌టీ కంపెనీతో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించామన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ సర్కార్ కమిషన్ల కోసం కాంట్రాక్టర్లను బెదిరించడంతో వారు పనులను వదిలేసి వెళ్లిపోయారన్నారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని, నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరుస్తారన్నారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఏసీజీ వెంకటేష్, జోనల్ కమిషనర్ శివరామకృష్ణ, సీఈ ప్రభాకర్, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి పాల్గొన్నారు.

రోజాకు అంత డబ్బెక్కడ నుంచి వచ్చింది..?

టీడీపీ నేత కొట్టేటి

విద్యాధరపురం, జూన్ 24: బ్యాంక్‌కు రుణం ఎగ్గొట్టిన వారి జాబితాలో ఉన్న మాజీ మంత్రి రోజా కోట్లాది రూపాయలను ఎలా సంపాదించిందో చెప్పాలని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు ప్రశ్నించారు. సోమవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట లేనప్పుడు మరోమాట మాట్లాడడం రోజాకే సాధ్యమన్నారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణంలో ప్రజా సొమ్ము దుర్వినియోగం కాలేదని మాజీ మంత్రులు రోజా, అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు రాంబాబు, రోజా సంబరాలు చేసుకున్నారని ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మైనారిటీ సెల్ అర్బన్ మాజీ ప్రెసిడెంట్ మహమ్మద్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు: సుచిత్ర

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చీరాల మండలం ఈపూరు పాలెంకు చెందిన సుచరిత సంఘటనను ఆమె ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి హోంమంత్రి అనితను అక్కడకు పంపారని, నిందితులను 36 గంటల్లోనే పట్టుకున్నారన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందనే భయం ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఉద్దేశమని, దీనిపై వారికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని నాటి హోంమంత్రి మహిళ అయి ఉండి కూడా చేతగాని పాలన చేసిందని విమర్శించారు. డేరింగ్ అండ్ డ్యాషింగ్ హోంమంత్రి వంగలపూడి అనిత పాలనలో నేరస్థులకు తావు లేదన్నారు.

రవాణా సమస్యలను పరిష్కరించండి

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన ఏపీ లారీ యజమానుల సంఘం నేతలు



మంత్రిని సత్కరిస్తున్న లారీ యజమానుల సంఘం, ప్రజా రవాణా ఉద్యోగుల సంఘం నాయకులు

వన్‌టౌన్, జూన్ 24: రవాణా రంగంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించాలని వాటి కోసం ఒక సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ లారీ యజమానుల సంఘం నేతలు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. రామవరప్పాడు రింగ్‌లోని కే.హోటల్‌లో మంత్రిని సోమవారం సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఎం.కృష్ణ, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.రాజా, ప్రధాన కార్యదర్శి ఏవీవీ సత్యనారాయణ, కార్యదర్శి ఆర్.శరత్, చెన్నుపాటి వజీర్, పి.రాఘవేంద్రరావు, సూరపనేని సురేష్ కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి దుశ్శాలువ కప్పి సత్కరించారు. అనంతరం మంత్రితో మాట్లాడుతూ రవాణా రంగంలో అనేకనేక సమస్యలున్నాయన్నారు. వాటిని పరిష్కరించాలని కోరారు. ఒక సమావేశం ఏర్పాటు చేసినట్టయితే లారీ యజమానుల సంఘం తరఫున ప్రతినిధి బృందం హాజరై సమస్యలు వివరిస్తామన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తాను ఈసారి నగరానికి వచ్చినపుడు సమావేశం ఏర్పాటు చేస్తానని సెక్రటరియేట్‌లో జరిగే సమావేశానికి ఆహ్వానిస్తానన్నారు.

ప్రజా రవాణా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతల శుభాకాంక్షలు

ప్రజా రవాణా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.కేదారేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఏ థామస్, రాష్ట్ర కార్యదర్శి రామానుజులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సోమవారం కే హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పర్యాటక, ఆతిథ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు: ఎంఎల్‌కే రెడ్డి

లబ్బీపేట, జూన్ 24: పర్యాటక, అతిథ్య రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఆ రంగంలో కోర్సులు చేసిన విద్యార్థులకు అపారమైన ఉపాధి అవకాశాలున్నాయని గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్‌కే రెడ్డి అన్నారు. వైవీరావు హాస్పటల్ రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం చెన్నైస్ అమిర్త గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గన్నవరం విమానాశ్రయం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, దీనికనుగుణంగా వివిధ దేశాలు, ప్రాంతాలకు ఎగుమతులు, దిగుమతులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు వృద్ధి చెందుతాయన్నారు. హయత్ ప్లేస్ హోటల్ మేనేజర్ కమల్ దీప్ శర్మ మాట్లాడుతూ వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించాలనే ఆలోచన, ఆసక్తి ప్రజల్లో పెరుగుతుందని, ఉద్యోగుల విధులు పెరగడంతో పాటు అత్యధిక వేతనాలు హోటల్ యాజమాన్యాలు అందిస్తున్నాయన్నారు. చెన్నైస్ అమిర్త గ్రూప్ చైర్మన్ భూమి నాథన్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలకు ప్రచార కర్తగా ప్రముఖ హీరోయిన్ శ్రీలీల వ్యవహరిస్తారన్నారు. చెన్నైస్ అమిర్త గ్రూప్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి సీఏడి లియో ప్రసాద్, డీన్ డాక్టర్ టి.మల్లన్, భానుమతి, విజయవాడ క్యాంపస్ ప్రిన్సిపాల్ అనంద రవికుమార్, కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

గవర్నర్ కార్యదర్శిగా హరిజవహర్ బాధ్యతలు



గవర్నర్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరి జవహర్‌లాల్

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ కార్యదర్శిగా ఉన్న ఎం.హరి జవహర్‌లాల్‌ను ప్రభుత్వం గవర్నర్ కార్యదర్శిగా బదిలీ చేసిన నేపథ్యంలో సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న ఆయనను గవర్నర్ సంయుక్త కార్యదర్శి పి.ఎస్.సూర్యప్రకాశ్, ఉప కార్యదర్శి పి.నారాయణస్వామి, గవర్నర్ ఏడీసీలు మేజర్ దీపక్ శర్మ, ఎస్.వి.రామాంజనేయులు స్వాగతం పలికారు. అనంతరం వారందరి సమక్షంలో కార్యదర్శిగా బాధ్యతలు తీసుకుంటూ సంతకం చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

నిరుద్యోగులకు మంచి రోజులొచ్చాయ్!

- ఎమ్మెల్సీలు శ్రీకాంత్, రాంగోపాల్‌రెడ్డి, చిరంజీవిరావు



ఏపీపీఎస్సీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ ఎమ్మెల్సీలు

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగులకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. సోమవారం ఈ ముగ్గురు ఎమ్మెల్సీలు పలు అంశాలను విద్యా శాఖ మంత్రి లోకేశ్, ఏపీపీఎస్సీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. గ్రూప్-1 పరీక్ష ఫలితాలు ప్రకటించేటప్పుడు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో మెరిట్‌లిస్ట్ పెట్టాలని కోరారు. దీంతో పాటు కేంద్రంలో యూపీఎస్సీ మాదిరిగా రాష్ట్రంలోనూ ఏపీపీఎస్సీ ద్వారా జాబ్ కేలెండర్ అమలు చేయాలని, గ్రూప్-1 ఇంటర్వ్యూలను పారదర్శకంగా నిర్వహించాలని, ఇంటర్వ్యూ మార్కుల్లో విపరీతమైన వ్యత్యాసాలు ఉండకూడదని సూచించారు. గ్రూప్-2 మెయిన్స్ సిలబస్‌లో కొత్తగా తెచ్చిన సైన్స్ అండ్ టెక్నాలజీ అనే సబ్జెక్ట్‌కి తెలుగులో సరైన ప్రామాణిక పుస్తకాలు లేవని తెలిపారు. తక్కువ వ్యవధిలో గ్రామీణ యువత నేర్చుకునే వీలుకాదన్నారు. 3నెలల సమయం ఇవ్వాలని కోరారు. డీవైఈవో పరీక్షకు సంబంధించి 1:50 కాకుండా, 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలని సూచించారు. వీటిపై సెక్రటరీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీలు తెలిపారు.

పిటిషనర్‌కు నేరపూరిత ఆలోచన లేదు

- టీటీడీపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై కేసు కొట్టివేత

తిరుమలలోని లడ్డూ కౌంటర్ల నిర్వహణతో పాటు ఇతర కార్యకలాపాలను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడం ద్వారా శ్రీవారి ఆదాయానికి టీటీడీ గండికొడుతోందని పేర్కొంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన తిరుపతికి చెందిన పి.నవీన్‌కుమార్ రెడ్డి పై పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. పోలీసులు నమోదు చేసిన ఐపీసీ 505(1)(బి) సెక్షన్ పిటిషనర్‌కు వర్తించదని స్పష్టం చేసింది. పిటిషనర్ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసిన వార్తను పరిశీలిస్తే ప్రజాశాంతికి భంగం కలిగించేదిగా లేదని పేర్కొంది. నేరపూరిత ఆలోచన లేకుండా సదుద్దేశంతో సామాజిక మధ్యమంలో వార్తలు వ్యాప్తి చేసినప్పుడు ఈ సెక్షన్ వర్తించదన్నారు. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఇటీవల తీర్పు ఇచ్చారు. టీటీడీ పరిపాలనాపరమైన నిర్ణయాలను ప్రశ్నిస్తూ, శ్రీవారి భక్తులను భయాందోళనలకు గురిచేసేలా సామాజిక మాధ్యమాల్లో పెట్టారని ఆరోపిస్తూ టీటీడీ సహాయ విజిలెన్స్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2021లో ఈ కేసు నమోదు చేశారు.

వాణిజ్య పన్నుల్లో కీలక ఫైళ్లు ఎంక్వైరీ చేయాలి

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నుల శాఖలో గత రెండేళ్లలో ఆమోదం పొందిన కీలకఫైళ్లపై విచారణ జరపాలని వాణిజ్యపన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గత రెండేళ్లుగా సెక్రటరీ టు చీఫ్ కమిషనర్ పోస్టును ఖాళీగా పెట్టి ఒక నాన్‌కేడర్ అధికారికి ఆ బాధ్యతలు అప్పజెప్పడంతో అనేక అక్రమాలు జరిగాయని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల బదిలీలు, ప్రమోషన్లలో అవినీతి జరిగిందని, విచారణ జరపాలని కోరారు.

రేపటి నుంచి ఉత్తరాంధ్రలో డీలర్ల భరోసా యాత్ర

అమరావతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ఈనెల 26 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 'రేషన్ డీలర్ల భరోసా యాత్ర' చేపట్టనున్నట్లు రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు తెలిపారు. 26న విశాఖపట్నం, 27న శ్రీకాకుళం, 28న అనకాపల్లి జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెలుగునాడు టీచర్స్ కార్యదర్శిగా జయరాజు

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కె.జయరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షునిగా కె.రజనిబాబు, గౌరవసలహాదారుగాఎం.లక్ష్మీనాయుడు,ఉపాధ్యక్షులుగా డాక్టర్ కైతేపల్లి దాస్‌లను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ తెలిపారు.

భర్తను చంపి పోలీసులకు లొంగిపోయిన భార్య

ఎచ్చెర్ల, జూన్ 24: ఏడాది క్రితం కుటుంబసభ్యులపై దాడిచేసి, పెద్ద కుమారుడిని హత్య చేసిన భర్తను భార్య కడతేర్చింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామానికి చెందిన కొండ్ర కుప్పయ్య అలియాస్ కుప్పేష్ (55) భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఇందుకు కుటుంబసభ్యులు సహకరిస్తున్నారని ఆగ్ర హించి గతేడాది జూన్ 27న దాడిచేశాడు. ఆదాడిలో పెద్ద కుమారుడు తాతారావును కుప్పయ్య చంపేశాడు. చిన్న కుమారుడు కామరాజు, భార్య హరమ్మ గాయపడ్డారు. అరెస్టయిన కుప్పయ్య జైలు నుంచి బయటకు వచ్చిన శ్రీకాకుళంలో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కుప్పిలిలో గ్రామ దేవత ఉత్సవాలకు రావడంతో, ఎక్కడ ఇంటి మీద దాడిచేస్తాడోనన్న భయంతో భార్య హరమ్మ ఆదివారం రాత్రి వేరొకరి ఇంటి మేడపై నిద్రిస్తున్న కుప్పయ్యను కత్తితో మెడపై దాడిచేసి హత్యచేసింది. సోమవారం ఉదయం ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌కు వెళ్లి.. భర్తను తానే హత్యచేశానంటూ చెప్పి లొంగిపోయింది.

15 రోజుల్లో 10 వైఫల్యాలు

- మోదీ సర్కారుపై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ, జూన్ 24: అధికారం చేపట్టిన మొదటి 15 రోజుల్లోనే మోదీ సర్కారు వైఫల్యాలను చవిచూసిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఉగ్రవాదుల దాడుల నుంచి ఘోర రైలు ప్రమాదాల వరకు పది వైఫల్యాలు చోటు చేసుకున్నాయంటూ, 18వ లోక్‌సభ మొదటి సమావేశం, మొదటి రోజు సందర్భంగా ట్వీట్ చేశారు. "1.ఘోర రైలు ప్రమాదం, 2. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి, 3. రైళ్లలో ప్రయాణికుల దుస్థితి, 4. నీట్ కుంభకోణం, 5, నీట్-పీజీ రద్దు, 6. యూజీసీ నెట్ పేపర్ లీక్, 7. ప్రియంగా మారిన పాలు, పప్పులు, గ్యాస్, టోల్ ట్యాక్సుల రేట్లు, 8. అడవుల్లో కార్చిచ్చు, 9. నీటి సమస్య, 10. తగిన ఏర్పాట్లు చేయని కారణంగా వడదెబ్బతో మరణాలు" అంటూ ప్రస్తావించారు. మానసికంగా వెనకడుగు వేసిన మోదీ.. ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు.

కులగణనకు అసెంబ్లీలో తీర్మానం చేస్తాం: స్టాలిన్

చెన్నై, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులాల వారీగా జనగణన చేపట్టాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేస్తామని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యుడు జీకే మణి మాట్లాడుతూ, రాష్ట్రంలో కులాల వారీగా జనాభా లెక్కలను చేపట్టాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ.. ఇప్పటికే బీహార్ వంటి రాష్ట్రాల్లో ఈ తరహా కులగణన చేపట్టగా, దాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. ఈ సమస్యకు పరిష్కారం లభించాలంటే కేంద్ర ప్రభుత్వమే తక్షణం కులగణన చేపట్టాలని కోరారు.

దాచేస్తే దాగని 'డాంగిల్'!

- అడ్డంగా బుక్కయిన గనుల వెంకటరెడ్డి
- ఆయనకు తెలిసే నిధుల దారిమళ్లింపు
- సెక్యూరిటీ డిపాజిట్ల దోపిడీ కేసులో కొత్తకోణం
- గనుల ఎండీగా వెంకటరెడ్డి డాంగిల్ వినియోగం
- ఆతర్వాతే నిధులు దారిమళ్లించి దోచుకున్నారు
- జగన్ హయాంలో చిన్న ఉద్యోగులపైనే కేసులు
- డాంగిల్ బయటపడటంతో వెంకటరెడ్డి మెడకు ఉచ్చు
- ముగ్గురు సీనియర్లు, ఐటీ ఇంజనీర్‌కూ తిప్పలే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖ మాజీ ఎండీ వెంకటరెడ్డి అడ్డంగా బుక్కయ్యారు. మాంగనీస్ టెండర్లలో కాంట్రాక్టర్ సెక్యూరిటీ డిపాజిట్ సొమ్ము దారిమళ్లింపు దోపిడీ కేసులో ఆయన పాత్ర స్పష్టంగా బయటకొస్తోంది. నిధుల విడుదల, బదిలీ కోసం గనుల శాఖ డైరెక్టర్‌గా ఆయన వాడిన డిజిటల్ డాంగిలే ఆయన పాత్రను బయటపెట్టనుంది. వెంకటరెడ్డితోపాటు మరో ముగ్గురు సీనియర్ అధికారుల డాంగిల్స్‌ను ఈ దోపిడీ వ్యవహారంలో ఉపయోగించారు. వారి సంతకాలను నోట్‌ఫైల్‌లో నమోదు చేసిన తర్వాతే నిధులను దారి మళ్లించారు. ఇప్పుడు ఇది వెంకటరెడ్డితోపాటు మరో మగ్గురు ఉన్నతాధికారల మెడకు చుట్టుకోబోతుంది. ప్రభుత్వం మారకముందు, నేరం, కుట్ర అన్నీ చిరుద్యోగులపైనే మోపి పెద్దలు తప్పించుకోవాలని చూశారు. ఈనెల 11న 'ఆంధ్రజ్యోతి' 'గనులశాఖలో తోడేళ్ల దందా' శీర్షికన వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. నిధుల దుర్వినియోగంలో అసలు కుట్రను వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ తర్వాతే పోలీసుల విచారణ శైలికూడా మారినట్లు తెలిసింది. అయితే, పోలీసుల ప్రాథమిక విచారణ సందర్భంగా లేవనెత్తిన కొన్ని లిఖితపూర్వక ప్రశ్నలతోనే గనులశాఖ పెద్దల బాగోతం బయటపడింది. ఆ ప్రశ్నలకు గనులశాఖ డైరెక్టర్‌గా ఉన్న వెంకటరెడ్డి సమాధానం ఇవ్వలేదు. మళ్లీ జగన్ ప్రభుత్వమే వస్తుందన్న ధీమాతో పోలీసుల ప్రశ్నలకు బదులివ్వకుండా, కేవలం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపైనే ఫోకస్ పెట్టాలని ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లుగా తెలిసింది. నిధుల దారిమళ్లింపులో ఉన్నతాధికారుల పాత్ర ఉందని పోలీసు విచారణలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పదేపదే చెప్పినా తొలుత పోలీసులు పరిగణనలోకి తీసుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో కేసు విచారణ దశ దిశ మారినట్లు స్పష్టమవుతోంది. కొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం...విజయనగరం జిల్లాలో మాంగనీస్ టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్ సెక్యూరిటీ డిపాజిట్‌ను ఇతర ఖాతాలకు మళ్లించారు. అనంతరం ఆ సొమ్మును డ్రా చేసి సొంతానికి వాడుకున్నారు.

ఆయనకు అంతా తెలుసు!

నిధులు సీఎఫ్ఎంఎస్ నుంచి ఓ ప్రైవేటు ఖాతాకు వెళ్లాలంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. తొలుత ఆర్థిక విభాగం నుంచి నిధుల విడుదలకు ప్రతిపాదనలు పంపించారు. వాటికి ఐటీ విభాగం ఆమోదం తెలిపింది. ఆ తర్వాత గనులశాఖలోని డిప్యూటీ డైరెక్టర్ డాంగిల్‌ను ఉపయోగించి ఆమోదం తెలిపారు. దానికన్నా ముందు ఆయన వేలిముద్ర వాడారు. ఆ తర్వాత ఈ ప్రతిపాదన గనులశాఖ జాయింట్ డైరెక్టర్‌కు వెళ్లింది. సేమ్. ఆయన కూడా తన డాంగిల్ వాడి ఆమోదం తెలిపారు. నిజానికి జేడీ ఆ ఫైలును నిశిత పరిశీలన చేసిన తర్వాత ఆమోదం తెలపాలి. ఆ నిధులు ఎందుకు మరో ఖాతాకు తరలించాలనుకున్నారు? అంత అవసరం ఏమొచ్చింది? అసలు ఆ ప్రతిపాదన ఎందుకొచ్చిందో ఆయన సంబంధిత విభాగాన్ని పిలిచి విచారించాలి. ఆ పనేం చేయకుండానే ఫైలును నేరుగా గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న వెంకటరెడ్డి లాగిన్‌కు పంపారు. ఆయన సేమ్. తన డాంగిల్‌ను వాడారు. వేలిముద్రవేసి ఫైలుకు ఆమోదం తెలిపారు. అంతే...గనుల దొంగలు మాంగనీస్ సెక్యూరిటీ డిపాజిట్ సొమ్మును దారి మళ్లించారు. గుంటూరులోని ఓ ఇసుక కాంట్రాక్టర్ బ్యాంకు ఖాతాకు తరలించి ఆ తర్వాత సొమ్ము డ్రా చేశారు. ఆ సొమ్ముతో మంగళగిరిలో బంగారం, ఖరీదైన కార్లు, ఇతర లగ్జరీ వస్తువులు కొనుగోలు చేశారు. ఈ మొత్తం ప్రక్రియలో నిధులు సీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి ప్రైవేటు ఖాతాకు వెళ్లడానికి వెంకటరెడ్డి తన డాంగిల్‌ను వినియోగించారని స్పష్టంగా బయటకొచ్చింది. నిజానికి ఆయన స్థాయిలోనూ ప్రశ్నించే అవకాశం ఉంది. కోట్లాది రూపాయల సెక్యూరిటీ డిపాజిట్‌ను ఎవరికిస్తున్నారు? ఏ ఖాతాకు మళ్లిస్తున్నారో ఆయన సంబంధిత అధికారులను పిలిచి ప్రశ్నించవచ్చు. దానిపై స్పష్టత ఇవ్వాలని జేడీని, డీడీని, ఐటీ, ఫైనాన్స్ విభాగం అధికారులను నిలదీయవచ్చు. కానీ ఆ పనులేవీ ఆయన చేయలేదు. కిందినుంచి ఫైలు రాగానే తన డాంగిల్ వాడి ఒకే చేయడం ఇప్పుడు కొత్త ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ఈ నిధుల దారిమళ్లింపు అంతా వెంకటరెడ్డితోపాటు మరో ముగ్గురు సీనియర్ అధికారులకు తెలిసే జరిగిందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎందుకంటే, ఏ స్థాయిలోనూ నిధులు ఎవరికి? ఎందుకిస్తున్నారో ఆరాతీయలేదు. దీంతో సకల సందేహాలు వెంకటరెడ్డి చుట్టూ అలుముకున్నాయి.

ఆ ప్రశ్నలకు అంతా గప్‌చుప్

కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన సెక్యూరిటీ డిపాజిట్‌ను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దారి మళ్లించారని ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులు రెండు దఫాలుగా కొన్ని ప్రశ్నలు లేవనెత్తారు. మాంగనీస్ టెండర్లు ఎలా జరిపారు? దానికి ఉన్న విధివిధానాలు ఏమిటి? శాఖపరమైన విచారణ చేశారా? నిధులు విడుదల చేయడంలో ఏ ఏ స్థాయిలో ఆమోదాలు తీసుకోవాలి? ప్రతిపాదన చేసిందెవరు? ఆమోదం తెలిపిందెవరు? అని గనుల శాఖకు ప్రశ్నలు లేవనెత్తారు. వీటికి గనుల శాఖ డైరెక్టర్, డీడీలు సమాధానం ఇవకవలూదేజ వ్యూహాత్మకంగా ఈనెల 7వ తేదీన నోట్‌ఫైల్ లేకుండానే సీక్రెట్‌గా సీఎఫ్ఎంఎస్ ఖాతాను తెరచి, అందులో డబ్బును సర్దుబాటు చేయాలన్న ప్రయత్నాలు చేశారు. దీన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టడంతో పెద్దలు అప్రమత్తమయ్యారు. కొత్త సర్కారు వెంకటరెడ్డిపై బదిలీవేటువేసింది. 7వ తేదీ అర్ధరాత్రి నుంచే గనులశాఖ డైరెక్టరేట్, తాటిగడపలోని ఏపీఎండీసీ ఆఫీసులను సీజ్‌చేసింది.

కాన్వాయ్ ఆపి.. వినతులు తీసుకుని!

- వైసీపీ హయాంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి భరోసా ఇచ్చిన సీఎం చంద్రబాబు

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. సోమవారం సాయంత్రం ఇంటికి వెళ్తూ.. వెళ్తూ.. సచివాలయం వద్ద వేచి ఉన్న బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర సాంఘిక, గిరిజన గురుకుల విద్యాలయాల్లో నైపుణ్య వికాసం ప్రాజెక్టులో పని చేస్తున్న 884 మంది ఉద్యోగులను వైసీపీ అధికారంలోకి రాగానే తొలగించింది. దీంతో అప్పటి నుంచి వారు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గత పాలకుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో నైపుణ్య వికాసం ట్రైనీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30 మంది బాధిత ఉద్యోగులు తమ సమస్యను చెప్పుకొనేందుకు సోమవారం సచివాలయానికి వచ్చారు. అయితే.. ఎవరిని కలిసి తమ గోడు వెళ్లబోసుకోవాలో తెలియక సచివాలయం 2వ బ్లాక్ వద్ద తమ సమస్యలతో కూడిన పత్రాలు పట్టుకుని నిలబడ్డారు. సాయంత్రం వరకు వారు అలానే ఉండిపోయారు. ఆ సమయంలో సచివాలయం 1వ బ్లాకు నుంచి కేబినెట్ భేటీ ముగించుకుని ఇంటికి వెళుతున్న చంద్రబాబు గుంపుగా ఉన్న వీరిని చూసి కాన్వాయ్‌ని ఆపించారు. కారు దిగి వారిని పిలిచి సమస్య తెలుసుకున్నారు. వినతులు స్వీకరించారు. దీనిపై రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఆశ్రమ పాఠశాలల్లో నైపుణ్య వికాసం ప్రాజెక్టును పునరుద్ధరించి, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎం చంద్రబాబును కోరినట్టు ఏపీ నైపుణ్య ట్రైనీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నాగరాజు, జాయింట్ సెక్రటరీ గాంధీ నాయక్ తెలిపారు. ఈ ప్రాజెక్టును గతంలో చంద్రబాబు ప్రవేశ పెట్టారని, అప్పుడు తమకు అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. జగన్ వచ్చాక తమను ఉద్యోగాల నుంచి తొలగించారని తెలిపారు.

రైలు ప్రయాణం గగనమే!

- భారీగా రైళ్ల రద్దుతో ప్రయాణికులకు పరీక్ష
- ఆగస్టు 11వ తేదీ వరకు 24 రైళ్ల రద్దు
- ప్రశ్నిస్తే మెయింటెనెన్స్ సాకు
- వందేభారత్‌కు లేని ఆటంకాలు ఇతర రైళ్లకెందుకో?



విజయవాడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు రైల్వే శాఖ పరీక్షలను పెడుతోంది. గత ఏడాది కాలంగా వందేభారత్ రైళ్లను విజయవంతంగా నడపటం కోసం.. ఇతర రైళ్లను భారీగా రద్దు చేయటం వల్ల సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటి, రెండు సార్లు అయితే సరిపెట్టుకోవచ్చు. ఏకంగా నెల రోజుల పాటు పలు సెక్షన్లలో రైళ్లను రద్దు చేస్తూ ప్రయాణికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. వందేభారత్ రైళ్లను నూరు శాతం ఆక్యుపెన్సీతో నింపటం కోసం రైల్వేబోర్డు ఆదేశాలను రైల్వే అధికారులు తూ.చ పాటిస్తున్నారు. రైల్వే మెయింటెనెన్స్ పనుల సాకుతో నెల రోజుల వరకు రైళ్లను రద్దు చేస్తూనే ఉంది. నెల రోజులుగా రికార్డు స్థాయిలో రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. సోమవారం నుంచి వచ్చే నెల ఆగస్టు 10, 11 వ తేదీల వరకు దాదాపుగా 24 రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేశారు. ఇంత భారీ సంఖ్యలో ఏ విధంగా రద్దు చేయాల్సి వస్తుందో రైల్వే అధికారులు మాట కూడా చెప్పడం లేదు. అదేమిటంటే మెయింటెనెన్స్ అంటారు. గతంలో ఎప్పుడూ ఇలా లేదు.. ఇప్పుడే ఎందుకు రద్దు చేస్తున్నారు ? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. రైళ్ల రద్దుకు సంబంధించి రైల్వే అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. వందే భారత్ రైళ్లను మాత్రం ఆటంకం లేకుండా నడుపుతున్నారు. అయతే, వాటికి లేని మెయింటెనెన్స్ ఇబ్బందులు, మిగిలిన రైళ్లకు ఎందుకో రైల్వే అధికారులు చెప్పడంలేదు.

రద్దు చేసిన రైళ్లు ఇవే...

ఈ నెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నారు. నిడదవోలు-కడియం సెక్షన్ల మధ్య ట్రాఫిక్ నిర్వహణ సందర్భంగా రోజూ నడిచే పలు రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రాజమండ్రి-విశాఖపట్నం అప్ అండ్ డౌన్ రైళ్లు, విజయవాడ-కాకినాడ పోర్ట్ అప్ అండ్ డౌన్ రైళ్లను రద్దు చేశారు. మచిలీపట్నం-విశాఖపట్నం రైలును ఈ నెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, అదే రైలును ఈ నెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేశారు. గుంటూరు- విశాఖపట్నం ఎగువ, దిగువ రైళ్లను, గుంటూరు-రాయగడ ఎగువ, దిగువ రైళ్లను, విజయవాడ-విశాఖపట్నం ఎగువ, దిగువ రైళ్లను, లింగంపల్లి-విశాఖపట్నం ఎగువ, దిగువ రైళ్లను, కాకినాడ పోర్ట్-చంగల్‌పట్టు రైలును రద్దు చేశారు. గుంటూరు- విశాఖపట్నం మధ్య సోమవారం, మంగళవారం నడిచే రైలును ఆగస్టు 10వ తేదీ వరకు రద్దు చేశారు. లింగంపల్లి- కాకినాడ టౌన్ మధ్య సోమవారం, బుధవారం, శుక్రవారం నడిచే రైలు ఆగస్టు 9వ తేదీ వరకు, కాకినాడ టౌన్- లింగంపల్లి మధ్య మంగళవారం, గురువారం, ఆదివారం నడిచే రైలును ఆగస్టు 8వ తేదీ వరకు, తిరుపతి-విశాఖపట్నం మధ్య బుధ, శుక్ర, ఆదివారం నడిచే రైలును ఆగస్టు 9వరకు, విశాఖపట్నం- తిరుపతి మధ్య సోమవారం, గురువారం, శనివారం నడిచే రైలును ఆగస్టు 10వ తేదీ వరకు రద్దు చేశారు.

రష్యాలో ఉగ్రదాడి

- 20 మంది దుర్మరణం.. ఐదుగురు దుండగులు కాల్చివేత

మాస్కో, జూన్ 24: రష్యాలో ఉగ్రవాదులు అధునాతన ఆయుధాలతో విరుచుకుపడ్డారు. ముసుగులు ధరించిన దుండగులు ఆదివారం రాత్రి ఉత్తర కాకసస్ రీజియన్‌లోని డాగెస్థాన్ నగరంలో రెండు చర్చిలు, యూదులకు చెందిన ఐదు ప్రార్థన మందిరాలు, ఒక పోలీసు పోస్టు లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 15 మంది పోలీసులు, ఒక చర్చి ఫాదర్ సహా.. 20 మంది మృతిచెందారు. చర్చిలోకి చొరబడ్డ దుండగులు ఫాదర్ నికోలేని గొంతు కోసి చంపారని, ఉగ్రవాదుల కాల్పుల్లో మరో నలుగురు పౌరులు మృతిచెందారని పోలీసులు వివరించారు. మృతుల్లో డాగెస్థాన్ నగర అంతర్గత భద్రత విభాగం చీఫ్ మాష్షదిన్ ఖిదిర్నాబియేవ్ కూడా ఉన్నట్లు తెలిపారు. 20 మంది పోలీసులు సహా.. 40 మంది గాయపడ్డట్లు వివరించారు. భద్రతాబలగాలు వెంటనే కౌంటర్ ఆపరేషన్‌ను ప్రారంభించి, ఐదుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు వెల్లడించారు.

నిందితుల్లో అధికారి కుటుంబం

ఉగ్రవాదులను మట్టుబెట్టాక.. వారిని గుర్తించే క్రమంలో డాగెస్థాన్ పోలీసులు తెల్లబోయారు. ఉగ్రవాదుల్లో డాగెస్థాన్ మునిసిపల్ అధికారి మాగొమెడ్ ఒమరోవ్ కుటుంబ సభ్యులు ముగ్గురు ఉన్నట్లు నిర్ధారించారు. చనిపోయిన ఉగ్రవాదుల్లో మాగొమెడ్ కుమారులు ఉస్మాన్ ఒమరోవ్, ఆదిల్ ఒమరోవ్, అతని మేనల్లుడు ఉన్నట్లు గుర్తించారు. దాంతో.. మాగొమెడ్ ఇంట్లో సోదాలు నిర్వహించామని, అతణ్ని అరెస్టు చేశామని చెప్పారు. కాగా, ఉగ్రవాదులు వినియోగించిన కారు(రిజిస్ట్రేషన్ నంబర్ ఎన్‌వో75యూటీ05) ఓ పోలీసు అధికారికి చెందినదిగా తెలుస్తోంది. ఆ కారు షామిల్ ఇబ్రాగిమోవ్ పేరిట రిజిస్టరై ఉందని, అతను డాగెస్థాన్‌లోని సెంటర్ ఫర్ కాంబాటింగ్ టెర్రరిజంలో పనిచేస్తారని అధికారులు గుర్తించారు.

అయోధ్య ఆలయం పైకప్పు లీక్

- సీజన్‌లో తొలి భారీవర్షానికే గర్భగుడిలోకి నీరు

అయోధ్య జూన్ 24: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అయోధ్య రామాలయం గర్భగుడి పైకప్పు.. కట్టి ఆర్నెల్లయినా కాకముందే.. కురిసిన తొలి భారీ వర్షానికే లీక్ అవుతోంది! శనివారం అర్ధరాత్రి అయోధ్యలో కురిసిన కుండపోత కారణంగా నీరు కారుతోందని ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ సోమవారం తెలిపారు. రామ్‌లల్లా ముందు పూజారి కూర్చునే స్థలంలో, వీఐపీలు దర్శనం చేసుకునే స్థలంలో నీరు లీక్ అవుతున్నట్టు ఆయన వివరించారు. వానలు ఇలాగే భారీగా కురుస్తుంటే లోపల కూర్చుని పూజ చేయడం కూడా కష్టమేనని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది. దేశం నలుమూలల నుంచీ ఇంజనీర్లు వచ్చి రామాలయాన్ని నిర్మిస్తున్నారు. జనవరి 22న ఆలయాన్ని ప్రారంభించేశారు. కానీ.. భారీ వర్షం కురిస్తే పైకప్పు కారుతుందని ఎవరికీ తెలియదు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన ఒక ఆలయం పైకప్పు లీక్ అవడం చాలా ఆశ్చర్యకరం. ఇలా ఎందుకు జరుగుతోంది?" అని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. అంతమంది పెద్ద ఇంజనీర్ల సమక్షంలో ఇలా జరగడమేంటని నిలదీశారు. ఆలయ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని.. గుడి ప్రాంగణంలోకి చేరిన నీరు బయటకు వెళ్లే మార్గం కూడా లేకుండా నిర్మించారని సత్యేంద్రదాస్ ఆరోపించారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయం తెలియగానే.. అయోధ్య రామాలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా అక్కడికి చేరుకున్నారు. కారుతున్న పైకప్పును పరిశీలించి.. వెంటనే మరమ్మతులు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "మొదటి అంతస్తు నుంచి నీరు కారుతోంది. పైనున్న గురుమండపానికి ఎలాంటి ఆచ్ఛాదనా లేకపోవడమే దీనికి కారణం. రెండో అంతస్తు, శిఖర నిర్మాణం పూర్తయితే గురు మండపంలోకి వర్షపు నీరు రాదు" అని ఆయన వివరించారు. ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని, మొదటి అంతస్తు నిర్మాణం కొనసాగుతోందని.. జూలై నాటికి మొదటి అంతస్తు, డిసెంబరు నాటికి మొత్తం నిర్మాణం పూర్తవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




విశాఖపట్నంలో అనుమతులు లేకుండా మాజీ మంత్రి అమర్‌నాథ్ నిర్మించిన భవనం

అమర్ అక్రమ నిర్మాణానికి నోటీసు

- ప్లాన్ తీసుకోలేదు.. 'సెట్‌బ్యాక్' పాటించలేదు
- వారంలోగా వివరణ ఇవ్వాలని జీవీఎంసీ ఆదేశం
- లేకుంటే భవనాన్ని తొలగిస్తామని స్పష్టీకరణ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

విశాఖపట్నం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జీవీఎంసీ అనుమతి లేకుండా నిర్మించిన భవనానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం నోటీసు జారీచేశారు. ఎలాంటి అనుమతి పొందకుండానే అమర్‌నాథ్ విశాఖపట్నంలోని గాజువాక సమీప చట్టివానిపాలెం వద్ద హైవేను ఆనుకుని జీ+4 తరహాలో వాణిజ్య భవనం నిర్మించారు. 'అమర్ అక్రమ నిర్మాణం' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో దీనిపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మకు ఈ భవనం గురించి ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ ఆ భవనానికి సంబంధించిన వివరాలను సీసీపీ సురేశ్‌కుమార్ నుంచి సేకరించారు. సర్వే నంబర్ 79/4లోని 447.33 చదరపు గజాల స్థలంలో జీ+4 తరహాలో వాణిజ్యభవనం నిర్మించారని, వీఎంఆర్‌డీఏ రూపొందించిన మాస్టర్ ప్లాన్-2040 ప్రకారం ఆ స్థలంలో 178 చదరపు గజాలు రోడ్డు విస్తరణలో పోతుందని, కానీ, అమర్‌నాథ్ 46.92 చదరపు గజాలను మాత్రమే 2021లో జీవీఎంసీకి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారని కమిషనర్‌కు సీసీపీ వివరించారు. అంతేకాకుండా ఆ స్థలంలో భవన నిర్మాణానికి ఎల్‌టీపీ ద్వారా రూ.10 వేలు దరఖాస్తు ఫీజు చెల్లించి వదిలేశారని, ఆ దరఖాస్తు ఇప్పటికీ ఎల్‌టీపీ లాగిన్‌లోనే ఉందని, జీవీఎంసీ లాగిన్‌కు రాలేదని పేర్కొన్నారు. దీంతో ఆ భవనాన్ని ఎందుకు తొలగించకూడదో తెలపాలంటూ షోకాజ్ నోటీసు జారీచేయాలని సీసీపీని కమిషనర్ ఆదేశించారు. ఆ మేరకు భవన యజమాని అమర్‌నాథ్‌కు గాజువాక ఏసీపీ శ్రీలక్ష్మి షోకాజ్ నోటీసు జారీచేశారు. భవనానికి ప్లాన్ తీసుకోలేదని, సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించలేదని, భవనానికి మరోవైపు ఉన్న రోడ్డు విస్తరణ అంశాన్ని అఫిడవిట్‌లో పేర్కొనలేదని నోటీసులో పేర్కొన్నారు. వారంరోజుల్లోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో భవనాన్ని తొలగించాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు, రేపు కుప్పంలో సీఎం పర్యటన



కుప్పం, జూన్ 24: తన సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో మంగళ, బుధవారాల్లో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఆయన తొలిసారిగా కుప్పం వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత శాంతిపురం మండలంలోని జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి గ్రామ సమీపంలో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువను పరిశీలించి కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం పార్టీ నేతలతో సమావేశమై రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ అధికారులతో అభివృద్ధిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4.10 గంటలకు హెలికాప్టరులో బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

ఉద్యోగులపై అక్రమ కేసులు ఎత్తేయండి: సీపీఎస్ఈఏ

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని కోరుతూ ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్, ప్రధాన కార్యదర్శి సీఎం దాస్.. పలువురు మంత్రులకు విన్నవించారు. సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రులు నారా లోకేశ్, కొలుసు పార్థసారధి, వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, టీజీ భరత్, సుభాశ్, సవిత తదితరులను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఫేక్ ప్రచారం చేస్తే.. వైసీపీకి సింగల్ నంబరే: టీడీపీ

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు అరండల్‌పేటలో కబ్జా చేసిన స్థలంలో 2015లో టీడీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించింది అంటూ వైసీపీ చేసిన ఆరోపణల్ని తెలుగుదేశం పార్టీ ఎక్స్‌లో ఖండించింది. 'ఇలాంటి ఫేక్ ప్రచారం చేస్తేనే వైసీపీకి క్రికెట్ టీం నంబర్ వచ్చింది. అయినా మారకపోతే.. సింగిల్స్ ఆడే షటిల్ టీం నంబరు ఇస్తారు ప్రజలు. గుంటూరు టీడీపీ కార్యాలయాన్ని నాటి జిల్లా పార్టీ అధ్యక్షుడు యడ్లపాటి వెంకట్రావు కట్టారు. 1998లో ఆఫీస్ కడితే.. 2015లో అని ఫేక్ చేస్తున్నారు' అని టీడీపీ పేర్కొంది.

అట్లాంటాలో కూటమి విజయగర్జన

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి విజయం సాధించిన నేపథ్యంలో అమెరికాలోని అట్లాంటాలో తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు కలసి ప్రజావిజయం పేరుతో తాజాగా విజయగర్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అట్లాంటాలోని జేడ్ బాంక్వెట్ హాలులో ఈ వేడుకలు జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు దాదాపు 500 కార్లతో డులూత్ రోడ్లలో అతి పెద్ద ర్యాలీ నిర్వహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆన్‌లైన్ ద్వారా వేడుకల్లో పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు ఎన్ఆర్ఐల ఉత్సాహం

అమరావతి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎన్ఆర్ఐలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ఉన్నారని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య(ఏపీ చాంబర్స్) అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు తెలిపారు. ఎన్ఆర్ఐలతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించగా ప్రపంచ నలుమూలల నుంచి 300 మంది ప్రవాస భారతీయులు పాల్గొన్నట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అమెరికా, కెనడా, యూకే, జర్మనీ, నెదర్లాండ్స్, యూఏఈ, మలేషియా, సింగపూర్, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి అనేకమంది పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపినట్లు తెలిపారు. ఏపీ చాంబర్స్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరపడానికి రెండు నెలల్లో రాష్ట్రానికి వచ్చేందుకు పలువురు ఎన్ఆర్ఐలు ఆసక్తి చూపిస్తున్నారని వెల్లడించారు.

కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో నిరాశ

న్యూఢిల్లీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురయింది. ఆయన బెయిల్‌పై ఎలాంటి నిర్ణయాన్ని వెలువరించలేదు. ఈ కేసులో ట్రయల్ కోర్టు తనకు ఇచ్చిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. హైకోర్టు స్టే విధించిన తీరు అసాధారణంగా ఉందని, ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమంటూ విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి | దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 25 జూన్ 2024



హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పలు ఫారిన్ లాంగ్వేజీల్లో సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ, డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండు సెమిస్టర్లు. ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభమౌతాయి. సోమ, బుధ, శుక్రవారాల్లో కోర్సుకు నిర్దేశించిన ప్రకారం ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆఫ్‌లైన్ మోడ్‌లో తరగతులు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ఒక ప్రోగ్రామ్‌నకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఎంట్రెన్స్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇఫ్లూలో పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లు

సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ కోర్సు: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 310 సీట్లు ఉన్నాయి. ఫ్రెంచ్‌లో 50, జర్మన్‌లో 50, స్పానిష్‌లో 50, పర్షియన్‌లో 30, పోర్చుగీస్‌లో 50, రష్యన్‌లో 20, అరబిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. అరబిక్‌లో ఆన్‌లైన్ మోడ్‌లో మరో 40 సీట్లు కూడా ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

డిప్లొమా: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 110 సీట్లు ఉన్నాయి. ఫ్రెంచ్‌లో 30, స్పానిష్‌లో 20, పోర్చుగీస్‌లో 20, రష్యన్‌లో 20, ఇటాలియన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

- ఇఫ్లూ నుంచి 'సి' లేదా ఆపై గ్రేడ్‌లో సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ కోర్సు /బీఏ (ఆనర్స్/రీసెర్చ్) ఇంగ్లీష్‌లో రెండు సెమిస్టర్లు(మొదటి ఏడాది) పూర్తిచేసినవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరికి నేరుగా అడ్మిషన్ ఇస్తారు.

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: స్పానిష్‌లో 20 సీట్లు ఉన్నాయి.

- ఇఫ్లూ నుంచి 'సి'/ఆపై గ్రేడ్‌లో డిప్లొమా కోర్సు/బీఏ ఆనర్స్ ఇంగ్లీష్‌లో నాలుగు సెమిస్టరు (రెండో ఏడాది) పూర్తిచేసినవారు నేరుగా ప్రవేశాలు పొందవచ్చు.

డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్: ఈ ప్రోగ్రామ్‌లో అరబిక్ నుంచి ఇంగ్లీష్, ఇంగ్లీష్ నుంచి అరబిక్ ట్రాన్స్‌లేషన్ నేర్పిస్తారు. మొత్తం 32 సీట్లు ఉన్నాయి. సోమ, మంగళ, బుధ, గురువారాల్లో ఉదయం ఏడు నుంచి తొమ్మిది వరకు తరగతులు ఉంటాయి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఇఫ్లూలో చదవని అభ్యర్థులు; ఇఫ్లూ నుంచి సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ /డిప్లొమా/బీఏ(ఆనర్స్/రీసెర్చ్)ఇంగ్లీష్ మొదటి/రెండో ఏడాది ప్రోగ్రామ్‌లను 'డి' గ్రేడ్‌లో పూర్తిచేసినవారు; ఏడాది కిందట ఇఫ్లూలో చదివినవారు తప్పనిసరిగా ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.100; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **ప్రొఫిషియెన్సీ కోర్సుకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలు విడుదల:** జూలై 8, 23
- **ప్రొఫిషియెన్సీ కోర్సు అభ్యర్థులకు డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 15, 25
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు అర్హులైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 8
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 1
- **డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా అభ్యర్థులకు డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 6
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్‌కు తీసుకురావాల్సినవి:** పదోతరగతి/ప్రొఫిషియెన్సీ కోర్సు/డిప్లొమా/బీఏ ఇంగ్లీష్ ఒరిజినల్ సర్టిఫికెట్లు; కుల ధ్రువీకరణ పత్రాలు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ప్రొఫిషియెన్సీ కోర్సు ఆగస్టు 1 నుంచి; డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమాలు ఆగస్టు 6 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూలో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తి చేయాలి. ఈ ప్రోగ్రామ్‌ను యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఇందులో పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన రీసెర్చ్, మేనేజ్‌మెంట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్, స్టాటిస్టికల్ సాఫ్ట్‌వేర్ అంశాల్లో శిక్షణ ఇస్తారు. అభ్యర్థులు 15 కోర్ మాడ్యూల్స్, ఎంచుకొన్న విభాగానికి సంబంధించి 5 ఎలక్టివ్ మాడ్యూల్స్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆడియో- విజువల్ ఎయిడ్స్ ద్వారా లెక్చర్స్, డిమాన్‌స్ట్రేషన్స్, గ్రూప్ డిస్కషన్స్, ప్రజంటేషన్స్, రెండు నెలల ఇంటర్న్‌షిప్, డిజర్టేషన్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 50 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ ప్రోగ్రామ్‌లో 20 సీట్లు ఉన్నాయి. ఎన్‌టీఏ నిర్వహించే సీయూఈటీ-పీజీ ఎగ్జామ్ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎలక్టివ్ విభాగాలు: ఎపిడిమియాలజీ, ప్రోగ్రామ్ పాలసీ అండ్ ప్లానింగ్, హెల్త్ మేనేజ్‌మెంట్, ఆర్ఎంఎన్‌సీహెచ్+ఎ

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/డెంటిస్ట్రీ/నర్సింగ్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/న్యూట్రిషన్/ఫార్మకాలజీ/అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/స్టాటిస్టిక్స్/బయోస్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/సోషియాలజీ/సైకాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్/ఎకనామిక్స్/లా) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 9
- **వెబ్‌సైట్:** www.nihfw.ac.in



లిటిల్స్



ధర్మారాయుడి తీర్పు

ఒక ఊరిలో ధర్మారాయుడు అనే గ్రామాధికారి ఉండేవాడు గ్రామంలో వచ్చే చిన్నా పెద్దా తగాదాలలో అతను మంచి న్యాయమైన తీర్పులు చెబుతాడని చుట్టుపక్కల అతనికి మంచి పేరుండేది. ఆ గ్రామంలో ఒక వర్తకుడు రామయ్య అనే రైతుకు తన పొలంలోని బావిని అమ్మాడు. కానీ రామయ్య ఆ బావిలోని నీళ్ల వాడుకోబోతుండగా వర్తకుడు రామయ్యతో 'నేనునీకు బావి మాత్రమే అమ్మాను కానీ అందులోని నీళ్ల కాదు.ఆ నీళ్ల ఇంకా నావే. కాబట్టినువ్వు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ బావిలోని నీళ్ల వాడుకోకూడదు అని షరతు పెట్టాడు. ఈ




మాటలు విన్న రామయ్యకు ఏం చేయాలో పాలుపోక, ధర్మారాయుడికి ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని మిగతా వారందరికీ వర్తకుడు పెట్టిన షరతు అన్యాయంగా అనిపించినా ఎవరూ ఏమీ చేయలేక ఊరుకున్నారు.విషయం తెలుసుకున్న ధర్మారాయుడు వర్తకుడిని పిలిచి, నువ్వు రామయ్యకు బావిని మాత్రమే అమ్మావు కనుక అతని బావిలో నీ నీళ్ల ఉండటం న్యాయ సమ్మతం కాదు, నీ నీళ్ల అన్నిటినీ తీసుకెళ్లి మరెక్కడైనా దాచుకో లేదా నీళ బావిలో ఉంచినందుకు, రామయ్యకు అద్దె చెల్లించు అని తీర్పు ఇచ్చాడు. అందరూ వర్తకుడి మోసనపు బుద్ధికి మంచి గుణపాఠం నేర్పాడని ధర్మారాయుడిని పొగిడారు.


దారి కనుక్కోండి



ఎన్ని సింహాలు ఉన్నాయి?



10 తేడాలు గుర్తించండి!





సరైన నీడ ఏది?



50వ జీ-7 సమావేశం

ఆహ్వానిత దేశంగా భారత్

(నిన్నటి దిక్సూచి తరువాయి)

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జీ-7 విశిష్టత

- జీ-7 దేశాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్నాయి.
- అంతేకాక ఇవి ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు, అణుశక్తి ఉత్పత్తి కలిగిన దేశాలు. అధిక ఎగుమతులు కలిగిన దేశాలు.
- ఐక్యరాజ్య సమితికి నిధుల వితరణపరంగా శక్తిమంతమైన దేశాలు.
- ప్రపంచ జనాభాలో పదిశాతం మాత్రమే కలిగి ప్రపంచ నికర సంపదలో మాత్రం 60 శాతం మూటగట్టుకున్న ధనిక దేశాలు.

జీ-7 లక్ష్యం: ప్రాథమికంగా జీ-7 లక్ష్యం ఆర్థిక, రాజకీయపరమైన అంతర్జాతీయ అంశాలపరంగా సభ్యదేశాలకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలను రచించడమే అయినప్పటికీ కాలక్రమంలో ఈ లక్ష్యాల పరిధి విస్తరించి అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వం, ప్రపంచ భద్రత, శక్తి/ఇంధన వనరుల సంబంధిత అంశాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటి అనేక కీలక అంశాలకు స్థానం లభిస్తోంది.

జీ-7 భారతదేశం: కొంతకాలంగా వరుసగా ఈ సమావేశాలకు ఆహ్వానాన్ని అందుకుంటున్న భారత్ జీ-7 యవనికపై తన ముద్రను వేస్తూనే ఉంది. కొవిడ్ మహమ్మారి విజృంభణను అరికట్టేందుకు భారత్ జీ-7 47వ సమావేశంలో 'వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో 'సమష్టి కృషి' ఆవశ్యకతను చాటిచెప్పింది. కొవిడ్ టీకా పరిశోధనల్లో, ముడి పదార్థాల అందుబాటులో దేశాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కృషిచేసింది. అదేవిధంగా టీకాల అందుబాటు పెంచేందుకు అడ్డంకిగా ఉన్న ట్రిప్స్ నిబంధనలను తొలగించాలని డబ్ల్యూటీఓ(ప్రపంచ వాణిజ్య సంస్థ)లో దక్షిణాఫ్రికాతో కలిసి దాఖలు చేసిన విజ్ఞప్తిని జీ-7 దేశాల మద్దతుకు కృషి చేసింది. అదేవిధంగా 2023లో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన గత సదస్సులో ప్రధాని మోదీ మూడు ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని ప్రపంచశాంతి, వాతావరణ మార్పుల నిరోధం, ఇతరత్రా బహుముఖ సంక్షోభాలపరంగా భారతవాణిని వినిపించారు. ఈ సమావేశంలో భారత్ కొన్ని అంతర్జాతీయ చొరవలకు మార్గదర్శనం చేసింది. భారత్ ప్రతిపాదించిన లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, మిల్లెట్స్ అండ్ అదర్ ఏన్షియంట్ గ్రైన్స్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వంటి చొరవలు 'హిరోషిమా యాక్షన్ ప్లాన్ ఫర్ రిసైలియంట్ గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ'లో గుర్తించారు.

జీ-7 భారత్ మధ్య పరస్పర అవసరాలు

- భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. జీ-7లోని సగం దేశాలకు పైగా(కెనడా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌ల కన్నా కూడా) పెద్ద ఆర్థికవ్యవస్థ అయినందున జీ-7, భారత్ మధ్య సంబంధం పరస్పర లాభదాయకంగానే ఉంటుంది.
- ప్రస్తుతం ప్రాధాన్యం పొందుతున్న హిందూ-పసిఫిక్ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహించే భారత్ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా చాలా కీలకం. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో విస్తరిస్తున్న చైనా ఆధిపత్యాన్ని నిలువరించడానికి జీ-7 కూటమికి భారత్ అవసరం ఉండగా, చైనాను ధీటుగా ఎదుర్కోడానికి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రత్యామ్నాయాలు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్న జీ-7 మద్దతు భారత్‌కు అంతే అవసరం ఉంది.
- శాస్త్ర సాంకేతికరంగాల్లో, క్లీన్ ఎనర్జీ/పునరుత్పాదక శక్తిరంగం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందు వరుసలో ఉన్న జీ-7 దేశాలకు మద్దతు భారత్‌కు అవసరం. అదేవిధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం అత్యధిక జనాభాతో కూడిన అతిపెద్ద మార్కెట్‌ను జీ-7 దేశాలకు అందిస్తోంది.
- ప్రపంచ శాంతి సామరస్యాలు కాపాడటానికి, వాతావరణ మార్పుల కట్టడి చర్యలకు, ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, సముద్ర మార్గాల రక్షణ వంటి అనేక ఉమ్మడి సమస్యలపై పోరాడటానికి అభివృద్ధి చెందిన జీ-7 దేశాల కూటమికి, అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్‌కు మధ్య సమన్వయానికి దోహదపడుతుంది.
- జీ-7 సమావేశాల నేపథ్యంలో జరిగే వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు భారత్‌కు పలు దేశాలకు మధ్య వాణిజ్య, రక్షణ, దౌత్య సంబంధాలను బలపర్చడానికి ఒక చక్కని అవకాశం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

భారత వాయుసేనలో అగ్నివీరులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - అగ్నివీర్ వాయు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.



వయోపరిమితి: 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: పురుషులు 152.5 సెం.మీ.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫేజ్-1(ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

పరీక్ష ఫీజు: రూ.550

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: జూలై 8

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 28

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 18

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

జాబ్ కార్నర్

ఆర్ఎంఎల్‌హెచ్‌లో సీనియర్ రెసిడెంట్స్

న్యూఢిల్లీలోని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, డాకర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్.... రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 140

విభాగాలు: ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, కార్డియాక్ అనస్థీషియా, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఓ అండ్ జీ, మెడిసిన్, మైక్రోబయాలజీ, నియోనాటాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, పీఎంఆర్, రేడియాలజీ, సర్జరీ, అనాటమీ, కమ్యూనిటీ మెడిసిన్, ఫిజియాలజీ, ఫార్మకాలజీ.

అర్హత: సంబంధిత విభాగాల్లో ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ/డిప్లొమా/డీఎన్‌బీ ఉత్తీర్ణులై ఉండాలి.

జీతం: నెలకు రూ.67,700 - రూ.2,08,700

వయోపరిమితి: 45 ఏళ్ల మించకూడదు

ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్/రాత పరీక్ష ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.800. ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సెంట్రల్ డైరీ డిస్పాచ్ సెక్షన్, గేట్ నెం.3 దగ్గర, ఎబీవీఐఎంఎస్ అండ్ డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, న్యూఢిల్లీ చిరునామాకు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 29

రాత పరీక్ష తేదీ: జూలై 28

వెబ్‌సైట్: https://rmlh.nic.in/

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్...రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 5

1. క్లయిమేట్ రిస్క్ స్పెషలిస్ట్(ఎంఎంజీఎస్-3)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-3: **2 పోస్టులు**
2. మార్కెట్ రిస్క్ స్పెషలిస్ట్(ఎంఎంజీఎస్-3)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-స్కేల్ 3: **3 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/ఐసీడబ్ల్యూఏఐ, ఎంబీఏ(బ్యాంకింగ్/ఫైనాన్స్), పీజీ ఉత్తీర్ణతతోపాటు రెండు నుంచి మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.63,840 - రూ.78,230

పోస్టింగ్ ప్రదేశం: ముంబయి

దరఖాస్తు రుసుము: రూ.750. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 27

వెబ్‌సైట్: https://sbi.co.in/

ఏఈఈఎస్‌లో స్పెషల్ ఎడ్యుకేటర్ ఖాళీలు

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అటామిక్ ఎనర్జీ కేంద్రీయ విద్యాలయాలు/జూనియర్ కాలేజీల్లో ఉన్న టీచింగ్ ఖాళీల భర్తీకి ముంబయిలోని అటామిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 9

1. ప్రిన్సిపాల్: **6 పోస్టులు**
2. స్పెషల్ ఎడ్యుకేటర్: **3 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, బీఎడ్, డిప్లొమా, పీజీ, సర్టిఫికెట్ కోర్సు, సీటెట్ స్కోరు, ఇంగ్లీష్ మీడియంలో టీచింగ్ అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ప్రిన్సిపాల్ పోస్టుకు 35 నుంచి 50 ఏళ్లు, స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు 18 నుంచి 35 ఏళ్ల మించకూడదు

దరఖాస్తు ఫీజు: ప్రిన్సిపాల్, స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు రూ.750. ఎస్సీ/ఎస్టీ/మహిళలు/దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు: గూగూల్ ఫాం ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 12

వెబ్‌సైట్: https://www.aees.gov.in/

డైలీ సుడోకు - 341

		3			4		1	
8								
	4		8			7		2
				3	2			6
	3	2		7		4	8	
4			1	5				
2		4			9		3	
								4
	8		7			1		

సుడోకు - 340 సమాధానం

7	2	8	4	9	5	1	6	3
9	3	1	8	6	7	5	4	2
5	6	4	3	1	2	7	9	8
4	9	5	2	3	6	8	7	1
6	7	2	1	8	4	9	3	5
1	8	3	5	7	9	6	2	4
8	5	6	9	4	3	2	1	7
2	4	9	7	5	1	3	8	6
3	1	7	6	2	8	4	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.